

చదువు
రూ॥ 180/-
పేజీలు: 210
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



బిసిల చుట్టూ తెలంగాణ రాజకీయం
మయన్మార్‌లో ఎమర్జెన్సీ రద్దు
బందీలను విడుదల చేయకపోతే గాజా భూభాగం విలీనం
లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 241 | శుక్రవారం | 1-08-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# స్పీకర్‌దే నిర్ణయం

## మూడు నెలల్లో తేల్చాలి : పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై గడువు విధించిన సుప్రీంకోర్టు





- రాజకీయ ఫిరాయింపులను అరికట్టకపోతే ప్రజాస్వామ్యం దెబ్బతింటుందని వ్యాఖ్య
- అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాల్సిన స్పీకర్ల ఆలస్యంపై యంత్రాంగాన్ని రూపొందించాల్సింది పార్లమెంటేనని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** తెలంగాణ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌కు విధేయులుగా మారిన 10మంది బిఆర్‌ఎస్ శాసనసభ్యుల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి సుప్రీంకోర్టు గురువారం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు 3నెలల గడువుతో డెడ్‌లైన్ విధించింది.ఈ నిర్దిష్ట గడువులో నిర్ణయించాలని అత్యున్నత న్యాయస్థానం స్పీకర్‌ను ఆదేశించింది. రాజకీయ ఫిరాయింపులను అరికట్టకపోతే ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి వాటికి ఉందని వ్యాఖ్యానించింది. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను విచారించేటప్పుడు స్పీకర్ ఒక ట్రిబ్యునల్ మాదిరిగా వ్యవహరించాలని, న్యాయపరిశీలనకు వ్యతిరేకమైతే రోగనిరోధక శక్తి లభించదని అత్యున్నత న్యాయస్థానం చెప్పింది. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ఫిరాయింపుల ఆధారంగా అనర్హత వేటు గురించి వివరిస్తుంది.అనర్హత పిటిషన్లపై తెలంగాణ శాసనసభ స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం శాసనసభ స్పీకర్‌ను కోరుతూ ఒకవేళ మేం ఎలాంటి ఆదేశాలు జారీచేయకపోతే 'ఆపరేషన్ విజయవంతం అయ్యింది. రోగి మరణించాడు' అని విస్తృతంగా విమర్శించబడే పరిస్థితిని పునరావృతం చేసినట్లే అవుతుందని పేర్కొంది.రాజకీయ ఫిరాయింపులు అనేవి జాతీయస్థాయి చర్చనీయాంశం.'ఒకవేళ రాజకీయ ఫిరాయింపులను అరికట్టకపోతే వాటికి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి ఉంది' అని తీర్పును ప్రకటిస్తూ భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్ ఎస్.గవాయ్ చెప్పారు. 'అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాల్సిన సీకర్ల ఆలస్యంపై ఒక యంత్రాంగాన్ని రూపొందించాల్సింది పార్లమెంట్ 'అని సుప్రీంకోర్టు పేర్కొంది. 'మన ప్రజాస్వామ్యం పునాదిని, దానిని కళంకం చేసే సూత్రాలను కాపాడుకోవడానికి ప్రస్తుత తరువాయి 2లో

### వెంటనే నిర్ణయం తీసుకోండి

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, ఇప్పటికైనా ఫిరాయింపు ఎంఎల్‌ఎలపైన వెంటనే అనర్హతవేటు విధిస్తూ నిర్ణయం తీసుకోవాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు కోరారు. రానున్న మూడు నెలల కాలంలో పది నియోజకవర్గాల్లో జరిగే ఉప ఎన్నికలకు తమ పార్టీ సిద్ధమవుతోందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొంతమంది ప్రజాప్రతినిధులు అడ్డదారులు తొక్కినంత మాత్రాన భారతదేశ తరువాయి 2లో

### తీర్పు శుభ పరిణామం

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలన్న తీర్పును స్వాగతిస్తున్నామని, ఇది ఒక మంచి పరిణామమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు తీర్పుపై రామచందర్ రావు స్పందించారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై మూడు నెలల్లో చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. స్పీకర్ మూడు నెలల్లోపు తరువాయి 2లో

### బిఆర్‌ఎస్‌కు చెంపపెట్టు

తీర్పును స్వాగతిస్తున్నాం : కాంగ్రెస్

ప్రజాపక్షం / హైదరాబాద్

ఎంఎల్‌ఎల అనర్హతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, సుప్రీంకోర్టు తీర్పు బిఆర్‌ఎస్ పార్టీకి చెంపపెట్టు అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ ఎంఎల్‌ఏ జి.మధుసూదన్ రెడ్డి, ఎంఎల్‌సిఇ అద్దంకి దయాకర్ అన్నారు. తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని బిఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారని వారు అన్నారు. సుప్రీంకోర్టు ఎంఎల్‌ఎలపై అనర్హత వేటు వేస్తుందని బిఆర్‌ఎస్ నాయకులు తరువాయి 2లో

## చొరబాటుదారులా? శరణార్థులా?

రోహింగ్యాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** రోహింగ్యాలకు సంబంధించి సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. అసలు వాళ్లు శరణార్థులా, చొరబాటుదారులా అనేదే పెద్ద సమస్య.. తొలుత దీనిపై స్పష్టత వస్తే ఇతర సమస్యలు తేలికగా పరిష్కారమవుతాయని పేర్కొంది. ఒకవేళ వాళ్లు చొరబాటుదారులైతే వారిని బహిష్కరిస్తున్నారా? అని ప్రశ్నించింది. రోహింగ్యాల విషయంలో దాఖలైన పలు పిటిషన్లను విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 'శరణార్థులా లేదా చొరబాటుదారులా అనేదే ప్రధాన సమస్య. శరణార్థులుగా ప్రకటించేందుకు వారు అర్హులు కాదా? అలా ఐతే, వారికి ఎలాంటి రక్షణలు, హక్కులు ఉంటాయి? ఇక రెండో అంశం.. శరణార్థులు కాకుంటే, అక్రమ వలసదారులైతే.. వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహిష్కరించే చర్య సరైనదేనా? చొరబాటుదారులను నిరవధికంగా నిర్బంధించడం లేదా బెయిల్‌పై విడుదల చేయవచ్చా? కోర్టులు ఎటువంటి షరతులు విధించవచ్చు?' అని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది మాట్లాడుతూ.. రోహింగ్యాల నిర్బంధమే కీలక అంశమని, వారిని నిరవధికంగా తరువాయి 2లో


రైతులు, కార్మికులు, ఎగుమతిదారుల సంక్షేమమే ముఖ్యం
ట్రంప్ టారిఫ్‌లపై పార్లమెంటులో గోయల్ ప్రకటన 05




## భారత్ ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ నిజమే చెప్పారు!

- దేశ ఆర్థిక వ్యవస్థ చనిపోయిందని ప్రతి ఒక్కరికీ తెలుసు
- ప్రధాని, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు ఇంకా తెలియలేదు
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శలు

**న్యూఢిల్లీ :** భారత ఆర్థిక వ్యవస్థపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు తప్ప భారత ఆర్థిక వ్యవస్థ 'చనిపోయిందని' ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం దేశ ఆర్థిక, రక్షణ, విదేశాంగ విధానాలను నాశనం చేసిందని ఆయన ఆరోపించారు. గురువారం రాహుల్‌గాంధీ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ అమెరికాతో వాణిజ్య ఒప్పందం జరుగుతుందని, ట్రంప్ దానిని నిర్వచిస్తారని, ప్రధానమంత్రి మోదీ అమెరికా అధ్యక్షుడు చెప్పినట్లు చేస్తారని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై 25 శాతం సుంకాలు, జరిమానాలు విధిస్తున్నట్లు ప్రకటించిన తర్వాత, భారత్, రష్యావి తరువాయి 2లో

## కాళేశ్వరంపై కమిషన్ నివేదిక సమర్పణ

- 650 పేజీల తుదినివేదికను ప్రభుత్వానికి అందజేసిన జస్టిస్ పిసి ఘోష్
- మంత్రివర్గ సమావేశంలో సీల్డ్ కవర్ నివేదికను తెరవనున్న సర్కార్
- ఏం చర్యలు తీసుకోబోతున్నారనేదానిపై సర్వత్రా ఉత్కంఠ

ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలపై 'జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఏకసభ్య కమిషన్' చేపట్టిన విచారణ పరిసమాప్తమైంది. హైదరాబాద్ బిఆర్‌కె భవన్‌లోని కమిషన్ కార్యాలయంలో గురువారం జస్టిస్ పిసిఘోష్ కమిషన్ 650 పేజీలకు పైగా రూపొందించిన తుది నివేదికను నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు గురువారం అందజేశారు. సిల్డ్ కవర్‌లో అందజేసిన ఈ నివేదికను రాహుల్ బొజ్జా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావుకు సమర్పించారు. అయితే 'సిల్డ్ కవర్ నివేదిక'ను మంత్రివర్గ సమావేశంలో తెరిచి, చర్చించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన విచారణ ఇక పూర్తయింది. ప్రభుత్వం అంటే కౌన్సిల్ ఆఫ్ మినిస్టర్స్ అని, కాళేశ్వరంపై నివేదిక ఇవ్వడమే తమ పని అని, దీనిపైన ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తమకు తెలియదని కమిషన్ వర్గాలుఎ పేర్కొన్నాయి.

**16 నెలల్లో 116 మంది బహిరంగ విచారణ**

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు జరిగిన నష్టంపై దర్యాప్తునకుగాను జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ మార్చి 14 2024న ప్రభుత్వం నియమించింది. విచారణలో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలు, తరువాయి 2లో



## బిసి కోటాకు బిజెపియే అడ్డంకి

- స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును గత నాలుగు నెలలుగా తొక్కిపెట్టడం సరికాదు
- ఆర్డినెన్స్ ఆమోదంపైనా తాత్సారం వద్దు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శ



ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిసి బిల్లుకు బిజెపి పెద్ద అడ్డంకి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఒక వైపు బిసి బిల్లుకు అడ్డుపడుతున్న బిజెపి మరోవైపు రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంపిన బిసి బిల్లులను గత 4 నెలలుగా తొక్కి పెట్టడం సరికాదని, ఆర్డినెన్స్‌ను ఆమోదం విషయంలో సైతం ఇదే విధంగా చేయడం సమాజసం కాదన్నారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో గురువారం కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిసి బిల్లునే కాకుండా ఎస్‌సి వర్గీకరణ అమలుకు సంబంధించి ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సింధూర్‌కు సంబంధించి అన్ని పార్టీలు, ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించగా, ఈ అంశంపై కేంద్రం మాత్రం పార్లమెంట్‌లో ఒక్క సత్యం కూడా చెప్పడంలేదన్నారు. యుద్ధం తానే ఆపానంటూ అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కనీసం ఖండించే ధైర్యం కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లేకుండా పోయిందన్నారు. ఇందుకు సంబంధించిన వాస్తవాలను పార్లమెంట్ ముందు ప్రధాని స్పష్టం చేయాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

**పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని సమగ్రంగా సవరించాలి**

ప్రజాప్రతినిధుల పార్టీ ఫిరాయింపులకు సంబంధించి స్పీకర్ తరువాయి 2లో

## డబ్బుకు కక్కుర్తి పడ్డాం

- అడ్డమైన దారుల్లో వెళ్లాం
- విచారణలో విస్తుపోయే నిజాలు బయటపెట్టిన 'సృష్టి' నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత

ప్రజాపక్షం/హైదరాబాద్



డబ్బులకు కక్కుర్తి పడి అడ్డమైన దారుల్లో నడిచామని సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ అట్లూరి నమ్రత పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలను బయటపెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ఓ దంపతులు సంతాన పొందేందుకు సృష్టి ఐవిఎఫ్ కేంద్రానికి చేరారు. వారి అనుమతి లేకుండా వేరే వ్యక్తి వీర్యాన్ని ఉపయోగించి పుట్టిన బిడ్డను వారికి అప్పగించారు. డిఎన్‌ఏ పరీక్షలో అసలు వాస్తవాలు బయటపడడంతో పోలీసులు సృష్టి ఆసుపత్రిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆసుపత్రి నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతతో పాటు డాక్టర్ అట్లూరి నమ్రత తో తరువాయి 12లో

## ఫేక్ అటెండెన్స్‌పై ప్రభుత్వం సీరియస్

- పంచాయతీ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్




విధులు నిర్వహించకుండానే ఫేక్ అటెండెన్స్‌ను సమర్పిస్తున్న పంచాయతీ కార్యదర్శులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహించకుండా, ఫేక్ అటెండెన్స్ ద్వారా ఉద్యోగ బాధ్యతలను నెరవేర్చుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఇటువంటి అధికారులపైన కఠిన చర్యలు తీసుకోవాలిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క తరువాయి 12లో

## మాలేగావ్ బాంబు పేలుడు కేసు ఏడుగురూ నిర్దోషులే

- 17 ఏళ్ల తర్వాత తీర్పు వెలువరించిన 'ఎన్ఐఎ' కోర్టు
- మాజీ ఎంపి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్‌కు ఊరట



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మహారాష్ట్రలోని మాలేగావ్ పేలుళ్ల కేసులో ముంబయిలోని ప్రత్యేక కోర్టు గురువారం కీలక తీర్పును వెలువరించింది. ఆరుగురు ప్రాణాలు కోల్పోయిన మాలేగావ్ బాంబు పేలుడు కేసులో 17ఏళ్ల తర్వాత ఏడుగురు నిందితులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కోర్టు ఏడుగురు నిందితులను నిర్దోషులుగా తేలుస్తూ తీర్పును ఇచ్చింది. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపి ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్ సహా ఏడుగురు నిందితులకు ఊరట లభించింది. 'నిందితులపై విశ్వసనీయమైన, బలమైన ఆధారాలు లేవు' అని ఎన్ఐఏ కోర్టు ఏడుగురినీ తరువాయి 12లో

## నీటిపారుదల శాఖ భూముల్లో ఒక్క అంగుళాన్నీ వదలం

- భూపరిరక్షణకు తక్షణ చర్యలు
- అన్యాక్రాంతమైన వాటిని యుద్ధప్రాతిపదికన స్వాధీనం చేసుకోవాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశం
- కోర్టు కేసుల పరిష్కారానికి ప్రత్యేక సీనియర్ న్యాయవాదులను నియమిస్తామని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

నీటిపారుదల శాఖ భూముల పరిరక్షణకు అత్యవసర చర్యలను తీసుకోవడంతో పాటు అన్యాక్రాంతమైన భూములను యుద్ధప్రాతిపదికన స్వాధీనం చేసుకుని వాటి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. నీటిపారుదల శాఖకు చెందిన అంగుళం భూమిని కుడా ప్రభుత్వం తరువాయి 2లో



## భారత్‌కు పాక్ చమురు విక్రయాలు

- ఏదో ఒకరోజు కొనుగోలు చేయాల్సి వస్తుందని ట్రంప్ సంచలన వ్యాఖ్య
- పాక్‌తో అమెరికాకు వాణిజ్య ఒప్పందం కుదిరిందని ప్రకటన

న్యూయార్క్/ఇస్లామాబాద్

పాకిస్థాన్‌లో మూడు సామూహిక చమురు నిల్వల క్షేత్రాలను ఏర్పాటు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. పాకిస్థాన్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిందని ట్రంప్ గురువారం ప్రకటించారు.భవిష్యత్‌లో ఎప్పుడో ఒకప్పుడు పాకిస్థాన్ నుండి భారతదేశం కూడా చమురు కొనుగోలు చేయాల్సిన రోజు వస్తుందని సోషల్ మీడియా ద్వారా ట్రంప్ దిగ్భ్రాంతికరమైన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐతే ఈ సామూహిక చమురు నిల్వలక్షేత్రం సామర్థ్యం ఏమిటి? దాని ప్రణాళిక ఏమిటి? అనే వివరాలను మాత్రం ట్రంప్ వెంటనే తెలియజేయలేదు. భారత్‌పై 25 శాతం భారీ సుంకాలతోపాటు జరిమానాలు కూడా విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన కొద్ది గంటల తర్వాత పాకిస్థాన్‌తో తరువాయి 12లో





# ప్రపంచం
WORLD NEWS

## థాయ్‌లాండ్ కర్మాగారంలో పేలుడు

### 9 మంది కార్మికులు మృతి

**బ్యాంకాక్:** థాయ్‌లాండ్‌లోని ఒక బాణసంచా కర్మాగారంలో గురువారం పేలుడు సంభవించింది.అక్కడ విధుల్లో ఉన్న తొమ్మిదిమంది కార్మికులు మరణించారు.మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని సమరికాన్ సుఫాన్ బురి రెస్క్యూ ఫౌండేషన్ అధికారులు చెప్పారు. బ్యాంకాక్‌కు వాయువ్యంగా 95 కి.మీ దూరంలో ఉన్న సుఫాన్ బురిలో పేలుడు సంభవించింది. ఐతే ఇంకెంతమంది లోపల ఉండిపోయారో ఇంతవరకూ సమాచారం తెలియలేదు. బాణసంచా తయారు చేసేభవంతి ప్రదేశంలోనే ప్రమాదం జరిగిందని, ఐతే ఈ బాణసంచా కర్మాగారానికి లైసెన్సు ఉందా? లేదా? అనే విషయాన్ని పరిశీలిస్తున్నామని పోలీసు సీనియర్ సార్జెంట్ పైసో చెన్నాని చెప్పారు.



# 'మయన్మార్‌లో ఎమర్జెన్సీ రద్దు

### 6 నెలల్లో ఎన్నికలు

### ఎన్నికలు బహిష్కరిస్తాం : ప్రతిపక్షాలు



**నైపిడో:** మయన్మార్‌లో సైనిక జుంటా ప్రభుత్వం దేశంలో అమలు చేస్తున్న ఎమర్జెన్సీని గురువారం నాడు రద్దుచేసింది. ఈ ఏడాది డిసెంబరునెలలో దేశంలో ఎన్నికల నిర్వహణకు తీసుకునే చర్యలను ముమ్మరం చేసింది. ఐతే సైనికపాలకులు తమ నియంతృత్వ పాలనను చట్టబద్ధంగా స్థిరపరచుకునేందుకే ఈ ఎన్నికల మోసాన్ని తలపెట్టారని, ఈ ఎన్నికలను బహిష్కరిస్తామని ప్రతిపక్షాలు ప్రతిజ్ఞ చేశాయి. ఐక్యరాజ్యసమితి కూడా జులైలో ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది. దేశంలో అంతర్యుద్ధాన్ని అరికట్టేందుకే సైనిక పాలకులు ఎన్నికల ప్రకటనలతో ప్రజలను మభ్య పెడుతున్నారని ప్రతిపక్షాలు విమర్శించాయి. అధికారంలో తమ సైనికశక్తిని ఏకీకృతం చేయడానికి ఈ ఎన్నికలు తమకు ఉపయోగపడతాయని మిలిటరీ మానిటర్లు ప్రకటించారు.కాగా జుంటా సైనిక ప్రభుత్వ అధికార ప్రతినిధి జా మిన్ తున్ గురువారం నాడు పాత్రికేయులకు ఒక వాయిస్ మెసేజ్ విడుదల చేస్తూ, మయన్మార్‌లో బహుళపక్ష ప్రజాస్వామ్య మార్గంలో ఎన్నికలు నిర్వహించేందుకే ఎమర్జెన్సీని రద్దుచేశామని పేర్కొన్నారు. ఆరు నెలల వ్యవధిలో ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తి అవుతుందని ఆయన చెప్పారు. ఐతే రాజకీయ విశ్లేషకుల అంచనా ప్రకారం ఈ ఎన్నికల తర్వాత జుంటా సైనిక పాలకుడు మిన్ ఆంగ్ హ్లాంగ్ దేశాధ్యక్ష పదవిలోగానీ లేదా తిరుగులేని అధికారాలతో సర్వసైన్యాధిపతిగా గానీ తన అధికారాన్ని స్థిరపరచుకునే అవకాశాలున్నాయి. తద్వారా ఆయన తన పదవీవిరమణాధికార కాలాన్ని పొడిగించుకునే అవకాశాలున్నాయి. రక్షణ చర్యలు, ఎన్నికల ప్రక్రియలను పర్యవేక్షించేందుకు జాతీయ భద్రతా కమిషన్, శాంతి కమిషన్‌తో పాటు ఒక సరికొత్త కేంద్ర ప్రభుత్వం ఏర్పడిందని, వీటన్నింటికీ హ్లాంగ్ నాయకత్వం వహిస్తారని ఆయన సంతకంతోనే ప్రకటన వెలువడింది. గురువారంనాడు నైపిడోలో హ్లాంగ్ చేసిన ప్రసంగంలో ఈ విషయం చెప్పారని అధికారపత్రిక పేర్కొంది. ఈ చర్యల ద్వారా తాము మొదటి అధ్యాయం పూర్తి చేశామని, ఇక రెండవ అధ్యాయం ప్రారంభిస్తున్నామని జుంటా పాలనామండలి సమావేశం (గౌరవ వేడుక)లో హ్లాంగ్ చెప్పారు. 2020 చివరిలో జరిగిన ఎన్నికల్లో సైన్యం మద్దతుతో డవలప్‌మెంట్ పార్టీ కూడా పోటీ చేసింది. ఈ పార్టీని జుంటా సైనికులే పెట్టారు. ఎన్నికలు ఏకపక్షంగా అన్యాయపూరితంగా జరిగాయని, అక్రమాలు జరిగాయని జుంటా సైనిక పార్టీ ఆనాడు ఆరోపించింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని 2021 ఫిబ్రవరిలో కూలదోసి జుంటా సైనిక నాయకుడు మిన్ ఆంగ్ హ్లాంగ్ అధికారం చేపట్టారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి, ప్రధానమంత్రి ఆంగ్‌సాన్ సూకీ, ఆమె మంత్రివర్గాన్ని, ఇతర ఎంపీలందరినీ జైళ్లలో నిర్బంధించారు. మిలిటరీ అధినేత మిన్ ఆంగ్ హ్లాంగ్ అపరిమితమైన అధికారాలు చేజిక్కించుకున్నారు. ప్రతిపక్షనేతల న్యాయవిచారణ న్యాయస్థానం కూడా ఆయన కనుసన్నల్లోనే తీర్పులు చెప్పింది. మరోవైపు దేశంలో ప్రజలు ముఖ్యంగా యువకులు తిరుగుబాటు చేశారు. వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేశారు. కానీ సైన్యం వేలాదిమందిని కాల్చి చంపింది. వెంటాడి, వేటాడి హతమార్చింది. అనేకమందిని జైలుపాలు చేసింది. మయన్మార్‌లో అనేకచోట్ల ప్రజాదళాలు సైన్యంపై తిరగబడ్డాయి. ఒకదశలో సైన్యం ఈ ప్రజాదళాలపై పోరాటంలో వెనకబడింది. సైన్యాన్ని అనేక సందర్భాల్లో ప్రజాదళాలు తరిమికొట్టాయి. ఎన్నికలు నిర్వహిస్తామని గడచిన ఐదు సంవత్సరాలుగా జుంటా సైనిక ప్రభుత్వం మాటలు వల్లెవేస్తూ వస్తోంది. తాజాగా డిసెంబరులో ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసేందుకు సన్నద్ధమవుతోంది.

## బందీలను విడుదల చేయకపోతే గాజా భూభాగం విలీనం

### హమాస్‌కు ఇజ్రాయెల్ హెచ్చరిక



**టెల్‌అవీవ్ :** బందీలను విడుదల చేయకపోతే గాజా చుట్టుపక్కలభూభాగాలను విలీనం చేసుకునే ప్రక్రియ ప్రారంభిస్తామని హమాస్ ఉగ్రవాద సంస్థకు ఇజ్రాయెల్ ఒక హెచ్చరిక సందేశం పంపించింది.సీనియర్ ఇజ్రాయెలీ అధికారి ఒకరు ఛానెల్–13 కు గురువారం ఈ విషయం వెల్లడించారు.చర్చలబల్లదగ్గరకురావాలని కాల్పుల విరమణను అంగీకరించకపోయినా, బందీలను విడుదల చేయకపోయినాగాని తీవ్ర పరిణామాలు సంభవిస్తాయని, గాజా చుట్టుపక్కల ఉన్న భూభాగాలను ఇజ్రాయెల్ దేశంలో విలీనం చేసుకుంటామని హమాస్‌కు సందేశం పంపించారు.బందీల విడుదల, కాల్పుల విరమణ ఒప్పందానికి ఇటీవల చేస్తున్న ప్రయత్నాల్లో కొంత పురోగతి కనిపించడంతో ప్రధానమంత్రి నెతన్యాహూ పరిమితమైన ఉన్నతస్థాయి మంత్రులు, అధికారులతో సమావేశం జరిపారని, పరిస్థితులను సమీక్షించారని ఆ అధికార ప్రతినిధి చెప్పారు. మధ్యవర్తి దేశాలతో దీనికి సంబంధించిన ఒక డాక్యుమెంటునుఇజ్రాయెల్ హమాస్‌కు పంపించింది. ప్రధానమైనహెచ్చరికల అంశాలను రెడ్‌లైన్స్‌లో పెట్టి పంపించారు. గాజా సరిహద్దుల్లో ఉన్న ఫిలిడెల్ఫీ కారిడార్‌ను గానీ, బఫర్ జోన్‌ను గానీ తాము వదులుకునే దిలేదని కూడా హమాస్ ప్రతినిధులకు ఇజ్రాయెల్ తనపత్రాల ద్వారా తెలియజేసింది. ఐతేతదుపరి హమాస్‌సీట్లవిధుల్లో ధోరణి అనుసరించే అవకాశంలేదనిఇజ్రాయెల్‌గట్టిగా నమ్ముతోంది.

**ఫ్రాన్స్,బ్రిటన్‌లతో జత కలిసిన కెనడా**

పాలస్తీనాను స్వయంప్రతిపత్తిగల సభ్యదేశంగా ఐక్యరాజ్యసమితిజనరల్ అసెంబ్లీలో ఈ ఏడాది సెప్టెంబరులో గుర్తింపు ప్రకటన చేసేందుకు ఫ్రాన్స్,బ్రిటన్ దేశాలతో కెనడా కూడా జత కలిసింది. తాము కూడా తమ తోటి జి–7 కూటమి దేశాలుఫ్రాన్స్,బ్రిటన్‌దారిలోనే ప్రయాణం చేస్తామని కెనడా ప్రధానిమార్క్ కార్నీ గురువారం ప్రకటించారు. రాజధాని ఒట్టావాలో ఆయన మీడియాతోమాట్లాడుతూప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికలు, అవినీతి నియంత్రణ చర్యలు, సైనిక రహిత రాజ్యపాలనవిషయంలో పాలస్తీనాకున్న నిబద్ధత ఆధారంగా గుర్తింపు ఇస్తామన్నారు.

## రాజీపడిన బ్రౌన్ యూనివర్సిటీ

# ట్రంప్ అజెండా అమలుకు అంగీకారం

**వాషింగ్టన్:**ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగంతో బ్రౌన్ యూనివర్సిటీరాజీపడింది.ఇప్పటివరకూ మంజూరు కాకుండా స్తంభించిపోయిన ఫెడరల్ రీసెర్చ్ ఫండింగ్‌నిధులనుతిరిగిరాబట్టుకునేందుకు ట్రంప్ యంత్రాంగంతో ఒక ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు యూదు విద్యార్థులను అదుపు చేసేందుకు పలుచర్యలు తీసుకోవడానికి సమ్మతించింది. రోడ్ ఐలాండ్ డవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌కు 50 మిలియన్ డాలర్లు చెల్లించేందుకు బ్రౌన్ యూనివర్సిటీ అంగీకారం తెలియజేసింది. మూడేళ్ళపాటు అమలులో ఉండేవిధంగా కుదిరిన ఈ ఒప్పందంవల్ల ఇప్పటివరకూ స్తంభించిన ప్రభుత్వ నిధులు యూనివర్సిటీకి తిరిగి లభిస్తాయి. ఈ ఒప్పందంవల్ల యూనివర్సిటీలోయూదులకు వ్యతిరేకంగా వివక్ష పాటిస్తున్నారన్న విషయంపై దర్యాప్తు ఆగిపోతుంది. నిధులు దుర్వినియోగం జరుగుతున్నాయన్నవిషయంపై కూడా దర్యాప్తు నిలిచిపోతుంది. బ్రౌన్ పాలనాయంత్రాంగంలో జాతి వివక్ష అమలులో ఉందన్న ఆరోపణలపై కూడా దర్యాప్తు ఆగిపోతుంది. డోనాల్డ్ ట్రంప్ ఎజెండా అమలుకు, అందుకుఅనుగుణంగా అనేక రాయితీలకు కూడా యూనివర్సిటీ అంగీకారం తెలియజేసింది. ఈ ఒప్పందం వల్ల బ్రౌన్ యూనివర్సిటీ స్వతంత్రత, స్వయంప్రతిపత్తికి రక్షణ కలుగుతుందని, యూనివర్సిటీలో బోధనాంశాలపై ప్రభుత్వ నియంత్రణ ఉండబోదని యూనివర్సిటీ అధ్యక్షుడు క్రిస్టినా హెచ్.పాక్సన్ చెప్పారు. అమెరికా విశ్వవిద్యాలయాలలో అరాచకం, అల్లర్లు, అశాంతి పెరిగిపోతోందని, యూనివర్సిటీ విద్యార్థులకు విపరీతమైన స్వేచ్ఛ ఇవ్వడంవల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోందని, విదేశీవిద్యార్థులు హింసాత్మక చర్యలు పేట్రేగుతున్నాయని ట్రంప్ యంత్రాంగం ఆగ్రహం వ్యక్తం చేసింది. యూదు వ్యతిరేక ప్రదర్శనలు వివిధ విశ్వవిద్యాలయాల్లో పెరిగిపోవడం, పాలస్తీనా ఉద్యమానికి అనుకూలంగా ప్రదర్శనలు జరగకుండా కట్టుదిట్టం చేయాలని ట్రంప్ కోరుకుంటున్నారు. ట్రంప్ అజెండాకు బ్రౌన్ యూనివర్సిటీ తలవొగ్గింది. గతవారంలో కూడా కొలంబియా యూనివర్సిటీతో ఇదేవిధమైన ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందాలు మిగిలిన విశ్వవిద్యాలయాలకు ఒక బృహత్తర ప్రణాళికగా ఉపయోగపడతాయని ట్రంప్ యంత్రాంగం పేర్కొంది.

# అక్టోబరులో ఏసియన్ సదస్సుకు ట్రంప్

**వాషింగ్టన్ :**మలేసియాలో ఈ ఏడాది అక్టోబరులో జరిగే'ఏసియన్'(ఆగ్నేయ ఆసియా దేశాల సంఘం)సదస్సులోఅమెరికాఅధ్యక్షుడుడోనాల్డ్ ట్రంప్ పాల్గొంటారు. మలేసియా దేశాధ్యక్షుడు, ప్రస్తుతం 'ఏసియన్'అధ్యక్షబాధ్యతల్లోఉన్న అన్వ ర్ ఇబ్రహీంతో టెలిఫోన్ సంభాషణ అనంతరం ట్రంప్ తన పర్యటనను ఖరారు చేశారు. 2018లో సింగపూర్‌లో జరిగిన ఏసియన్ సదస్సుకు ట్రంప్ హాజరయ్యారు.థాయ్‌లాండ్–కాంబోడియా మధ్య సరిహద్దు ఘర్షణ పరిష్కారానికి 'ఏసియన్' అధ్యక్షుడి హోదాలోఅన్వర్ఇబ్రహీం మధ్యవర్తిత్వం వహించి కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చారు. గడచిన ఆదివారం (జులై27) ఈ చర్చల సందర్భంగా ఘర్షణ పడిన ఇరుగుపొరుగు దేశాలు కాంబోడియా–థాయ్‌లాండ్‌రెండూఅసంతృప్తి వ్యక్తం చేయలేదు. కానీ తర్వాత కాంబోడియా ఈ కాల్పులవిరమణనుఉల్లంఘించిందనిథాయ్‌లాండ్ఆరోపించింది. చైనా ప్రభుత్వం రంగంలోకి దిగి బుధవారం షాంఘైలో నిర్వహించిన త్రైపాక్షిక సమావేశంలో రెండు దేశాలను కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉంటామన్న విషయాన్ని పునరుద్ఘాటించాయి. థాయ్‌లాండ్–కాంబోడియా మధ్య ఒప్పందం కుదిర్చిన ఘనత తనదేనని ట్రంప్ చెప్పుకుంటున్నతరుణంలోచైనాజోక్యంతో అమెరికాకు ఎదురుదెబ్బ తగిలింది. అసలు ఆదివారంనాటి చర్చల్లో ఏం జరిగిందన్న విషయాలను కూడా అన్వర్



ఇబ్రహీం నుండి ఫోన్ సంభాషణల్లో ట్రంప్ అడిగి తెలుసుకున్నారు.అన్వర్–ట్రంప్‌మధ్య గురువారం టెలిఫోన్ సంభాషణ జరిగింది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్వర్‌తో ట్రంప్ టెలిఫోన్ సంభాషణ ఇదే మొదటిసారి. 'ఏసియన్' బ్లాక్‌లో థాయ్‌లాండ్–కాంబోడియారెండూ దేశాలు సభ్యులుగా ఉన్నాయి. మొత్తం పదిదేశాలు ఈ కూటమిలోఉన్నాయి. సరిహద్దు వివాదంపై రెండు దేశాలమధ్య విజయవంతంగా మధ్యవర్తిత్వం చేసినందుకుట్రంప్‌తనకుఅభినందనలుతెలిపారని అన్వర్ ఇబ్రహీం చెప్పారు. మలేసియాతో కూడా ట్రంప్ వాణిజ్యఒప్పందంచేసుకుంటున్నారు.అన్వర్ పార్లమెంటులో మాట్లాడుతూ వాణిజ్య ఒప్పందంమలేసియా ఆర్థిక వ్యవస్థకు భారం కాకు ండా చూస్తాన న్నారు.మలేసియాపై సుంకాలను 20 శాతం కంటే తక్కువగా విధించాలని ట్రంప్‌ను కోరుతున్నారు.

## చొరబాటుదారులా? శరణార్థులా?

(మొదటి పేజీ తరువాయి)

అలా కొనసాగించలేరని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం.. రోహింగ్యాలకు సంబంధించి దాఖలైన అనేక పిటిషన్లను మూడు విభాగాలుగా విభజించి విచారణ చేపడతామని పేర్కొంది. ప్రతి బుధవారం వీటిని విచారించేందుకు సమయాన్ని కేటాయిస్తామని తెలిపింది. ఇదే అంశంపై ఈ ఏడాది మే నెలలో విచారణ జరిపిన సుప్రీం కోర్టు.. దేశంలో ఉన్న రోహింగ్య శరణార్థులు విదేశీయులని తేలితే, భారత చట్టాల ప్రకారం వారిని తిరిగి పంపించాల్సిందేనని అభిప్రాయపడింది. యుఎన్‌హెచ్‌సిఆర్ జారీ చేసిన ఐడి కార్డులు కూడా వారికి ఎటువంటి సాయం చేయకపోవచ్చంటూ అంతకుముందు ఇచ్చిన ఆదేశాలను గుర్తుచేసింది.

ఇదిలాఉంటే, దేశంలో 12 రాష్ట్రాల్లో రోహింగ్యాలు నివసిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఢిల్లీ, తెలంగాణ, యుపి, పశ్చిమ బెంగాల్, తమిళనాడుతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో వీరు ఉంటున్నప్పటికీ.. కచ్చితంగా ఎంత మంది ఉన్నారనే దానిపై స్పష్టత లేదని కేంద్ర హోంశాఖ గతంలో ఓసారి వెల్లడించింది.

## బిజెపేయే అడ్డంకి

(మొదటి పేజీ తరువాయి)

మూడు నెలలలోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు నిచ్చిందని, అయితే ఈ చట్టంలోని లోసుగుల కారణంగా అది సాధ్యమా అని కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ఎవరు పార్టీ మారిన వారిపై తక్షణమే అనర్హత వేటు పడేలా చట్టాన్ని మరింత పటిష్టం చేయాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారించిన జస్టిస్ పి.సి.ఘోష్ ఏకసభ్య కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి అందజేసిన నేపథ్యంలో ఇందుకు సంబంధించిన బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బిజెపిలో బిఆర్‌ఎస్ విలీనానికి సంబంధించి ఇటు బిజెపి, అటు బిఆర్‌ఎస్ మధ్య మాటల యుద్ధాన్ని కట్టిపెట్టి ఇందుకు సంబంధించిన వాస్తవాలను మాజీ ముఖ్యమంత్రి, బిఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర రావు వెల్లడించడం ద్వారా తమ చిత్తశుద్ధిని నిరుపించుకోవాలని సూచించారు.

## స్పీకర్‌దే నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

విధానం సరిపోతుందా? లేదా? అని పరిశీలించాలి. పునరావృతం కాకుండా మేం దానిని గమనించాం. దానిపై పార్లమెంట్ నిర్ణయం తీసుకోవాలి' అని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. అధికార కాంగ్రెస్‌కు విధేయులుగా మారిన ఫిరాయింపుదారులైన బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను త్వరగా నిర్ణయించేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ పాడి కౌశిక్‌రెడ్డి సహా బిఆర్‌ఎస్ నాయకులు దాఖలు చేసిన అప్పీళ్లను ధర్మాసనం అనుమతించింది. సింగిల్ జడ్జి ముందస్తు ఉత్తర్వులపై జోక్యం చేసుకుంటూ తెలంగాణ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం 2024 నవంబరు 22న తీసుకున్న నిర్ణయాన్ని ధర్మాసనం పక్కనపెట్టింది. దాదాపు ఏడు నెలలుగా అనర్హత పిటిషన్లపై స్పీకర్ కనీసం నోటీస్ కూడా జారీ చేయలేదనే విషయాన్ని అత్యున్నత న్యాయస్థానం గమనించింది. వివరణాత్మక తీర్పు కోసం వేచి ఉంది. ఏప్రిల్ 3న అత్యున్నత న్యాయస్థానం తీర్పు రిజర్వ్ చేసిన విషయం విదితమే.

## నివేదిక సమర్పణ

(మొదటి పేజీ తరువాయి)

డిజైన్‌లోని లోపాలు, నిర్వహణ సమస్యలు వంటి అంశాలపై దృష్టి సారించిన 'కమిషన్' 16 నెలల పాటు విచారణ చేపట్టింది.విచారణ పూర్తి కాకపోవడంతో కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం ఆరుసార్లు పొడిగించింది.

గురువారంతో జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ తుది గడువు ముగిసిన నేపథ్యంలో తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. విచారణలో భాగంగా ఇంజనీర్లు, నిర్మాణసంస్థ, మాజీ ప్రభుత్వ కార్యదర్శి,సిఎంఒ అధికారులు, నీటి పారుదల శాఖ కార్యదర్శులు, మాజీ ఇఎన్‌సితో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు చెందిన అధికారులను కమిషన్ విచారించింది. అలాగే పలువురు రాజకీయ నాయకులు, నీటిపారుదల రంగ నిపుణులను కూడా విచారించింది. వారి నుంచి కొన్ని పత్రాలను కూడా స్వీకరించింది. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన ప్రస్తుత బిజెపి ఎంపి ఈటల రాజేందర్, నీటిపారుదల శాఖ మంత్రిగాపనిచేసిన ప్రస్తుత ఎంఎల్‌ఎ తన్నీరు హరీష్‌రావుతోపాటు చివరగా ముఖ్యమంత్రిగా ఉన్న కె.చంద్రశేఖర్‌రావును కూడా కమిషన్ విచారించింది. అయితే విచారణలో భాగంగా కమిషన్ మొత్తం 116 మందిని విచారించింది. ఇందులో ఒక కెసిఆర్‌ను మాత్రమే ఇన్ కెమెరాలో విచారించింది.

**ఆ నివేదికపై సర్వత్ర ఉత్కంఠ :**

కాళేశ్వరం అవకతవకలపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదికపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. ఆ నివేదికల్లో కమిషన్ చేసిన సిఫార్సులు, వాటిపై ప్రభుత్వం తీసుకోబోనున్న చర్యలు ఏలా ఉండబోనున్నాయనే అంశంపై రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో నీటిపారుదల నిపుణులు, రాజకీయ నాయకులు, తదితరులు తమ తమ అభిప్రాయాలను, పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మేడిగడ్డ ఘటనపైన ఎన్‌డిఎస్‌ఎ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించిన తర్వాత నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రస్తుత స్థితి, వాస్తవ పరిస్థితులను వివరించారు. బాధ్యులపైన చట్టపరంగా చర్యలు ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వం ఇది వరకే అనేక సందర్భాల్లో ప్రకటించిన విషయం తెలిసిందే.

అయితే మంత్రి వర్గ సమావేశంలో 'కాళేశ్వరం నివేదిక'పై ఎటువంటి నిర్ణయం తీసుకుంటారు?, బాధ్యులపై చర్యలు ఎలా ఉంటాయా?, ప్రాజెక్ట్ విషయంలో ఎలా స్పందిస్తుందనే విషయమై రకరకాల అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

## తీర్పు శుభ పరిణామం

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం తీసుకోవాలని కోరారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని కొన్ని పార్టీలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆరోపించారు. అప్పుడు బిఆర్‌ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ అదే పనిచేస్తుందన్నారు. గతంలో బిఆర్‌ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలు ఫిరాయింపులను ప్రోత్సహించాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న జనహిత పాదయాత్రపై కూడా రామచందర్ రావు స్పందించారు. ఆ పార్టీ జనహిత పాదయాత్ర చేస్తుందో లేక జనాన్ని మోసం చేసే యాత్ర చేస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు, డిక్లరేషన్లు, కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో ఎన్ని నెరవేర్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శ్వేతపత్రం విడుదల చేస్తేనే పాదయాత్ర చేసే నైతిక హక్కు ఉంటుందన్నారు.

## బిఆర్‌ఎస్‌కు చెంపపెట్టు

(మొదటి పేజీ తరువాయి)

ఆశించారని, అయితే ఎంఎల్‌ఎలపై అనర్హత అంశం స్పీకర్ పరిధిలోనే ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం హర్షణీయమ్న కాంగ్రెస్ నేతలు అన్నారు. ఎంఎల్‌ఎల అనర్హతపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తాము స్వాగతిస్తామని వారు చెప్పారు. ఈ మేరకు హైదరాబాద్‌లో గురువారం వారు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు.

బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు పార్టీ మారిన శాసనసభ్యుల పదవులు రద్దవుతాయని పగటి కలలు కంటున్నారని ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. వారి తీరు చూస్తే 100 ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్లుందన్నారు. పదేళ్లు టిఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష ఎంఎల్‌ఎలను, ఎంపిలను ఎంఎల్‌సిలను, జెడ్‌పి చైర్మన్‌లను, వందల మంది జెడ్‌పిటిసిలను ఎంపిటిసిలను సర్పంచ్‌లను తమ పార్టీలోకి చేర్చుకుని పజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. శాసనమండలిలో, శాసనసభలో పార్టీలకు పార్టీలను విలీనం చేసుకున్నామని గొప్పలు చెప్పుకున్నారన్నారు.

గతంలో స్పీకర్‌కు విశేష అధికారులు ఉన్నాయని బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతిపక్ష సభ్యులను తీసుకున్నప్పుడు ఏ విధంగా జరిగిందో ఇప్పుడు కూడా అలాగే ఈ విషయాన్ని స్పీకర్ నిర్ణయానికి వదిలేద్దామంటే బిఆర్‌ఎస్ నేతలు రకరకాలుగా యాగి చేస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు కూడా స్పీకర్ నిర్ణయం ప్రకారమే తదుపరి చర్యలు ఉండాలని అభిప్రాయపడిందన్నారు. కెటిఆర్ హరీష్ రావు కవిత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు రోజుల నుంచి ప్రభుత్వం పడిపోతుందని ప్రచారం మొదలుపెట్టారని, బిజెపి, బిఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

సుప్రీంకోర్టులో ఎంఎల్‌ఎల అనర్హతపై పిటిషన్ వేసిన కుత్బుల్లాపూర్ ఎంఎల్‌ఎ వివేకానందనే స్వయంగా ఫిరాయింపుదారుడని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ మధుసూదన రెడ్డి గుర్తు చేశారు. ఆయన గతంలో టిడిపి నుంచి బిఆర్‌ఎస్‌లోకి ఫిరాయించాడని, బిఆర్‌ఎస్ హయాంలో ఎంఎల్‌ఎల అనర్హత అంశంపై అప్పటి స్పీకర్ స్పందించలేదని గుర్తు చేశారు. పార్టీ ఫిరాయించి ప్రయోజనాలు పొందిన వారి నుంచి ఆమొత్తాన్ని రికవరీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ఎంఎల్‌ఎసి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ఎంఎల్‌ఎల అనర్హతపై స్పీకర్ అధికారులను సుప్రీంకోర్టు ప్రశ్నించ లేదన్నారు. స్పీకర్‌కు సుప్రీంకోర్టు కేవలం సూచనలు మాత్రమే ఇచ్చిందని, సభా హక్కులను కాపాడేది కేవలం స్పీకర్ మాత్రమేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పిందన్నారు. తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని బిఆర్‌ఎస్ నాయకులు తెలివి తక్కువగా మాట్లాడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. బిఆర్‌ఎస్ నాయకులు ముందు సుప్రీంకోర్టు తీర్పును చదువుకోవాలని హితువు చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు పార్టీలకు పార్టీలను టిఆర్‌ఎస్‌లో విలీనం చేసుకున్న చరిత్ర కెసిఆర్‌దేనని ఆయన అన్నారు. ప్రతిపక్ష హోదా ఉండి అసెంబ్లీకి రాని కెసిఆర్‌పై స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని అద్దంకి దయాకర్ తెలిపారు.

## నిర్ణయం తీసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామిక వ్యవస్థ నాశనం కాదని సుప్రీంకోర్టు నిరూపించిందన్నారు. గత ఎన్నికల సందర్భంగా పాంచ్ న్యాయం పేరుతో పార్టీ మారితే ఆటోమేటిక్‌గా అనర్హత వర్తించాలని చెప్పిన రాహుల్‌గాంధీ సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తారని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. రాహుల్ గాంధీ చెప్పే మాటలకు, నీతులకు కట్టుబడి ఉండాలన్నారు. బిఆర్‌ఎస్ తరఫున ఎన్నికైన పదిమంది ఎంఎల్‌ఎలు ప్రలోభాలకు లొంగి, పార్టీ మారినప్పటికీ కష్టకాలంలో పార్టీ వెంట నిలిచిన కార్యకర్తలకు కెటిఆర్ ధన్యవాదాలు తెలిపారు.

## ఒక్క అంగుళాన్నీ వదలం

(మొదటి పేజీ తరువాయి)

వదలుకోబోదన్నారు. ఈ భూములను స్వాధీనం చేసుకునేందుకు అవసరమైతే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ భూముల పరిరక్షణలో భాగంగా గురువారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో హైడ్రా, ఇరిగేషన్ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,హైడ్రా కమిషనర్ ఏ.వి రంగనాథ్,ఆర్‌అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు, ఇఎన్‌సి అఫ్జల్ హుస్సేన్, ఇఎన్‌సి అడ్మిన్ రమేష్‌బాబు వాలంతరి డైరెక్టర్ జనరల్ అనిత,హైడ్రా ఎస్.పి అశోక్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా హైదరాబాద్‌లోని గండిపేట,రాజేంద్రనగర్ పరిధిలో ఉన్న గండిపేట సమీపంలోని హిమాయత్ సాగర్,కిస్మత్‌పురతో పాటు రాజేంద్రనగర్ పరిధిలోని వాలంతరి,టిజిఇఆర్‌ఎల్ కు చెందిన 42630 ఎకరాలకుగాను 13131ఎకరాలు కబ్జాకు గురైనట్లు గుర్తించామన్నారు.అందులో ఐటిఐఆర్ అధీనం లో ఉన్న 81.26 ఎకరాల అంశం కోర్టు పరిధిలో ఉందని, మిగిలిన 50.13 ఎకరాలు ఆక్రమణకు గురైందని తెలిపారు. కాగా ఈ ఆక్రమణలపై జిల్లా కోర్టులో 20 కేసులు పెండింగ్‌లో ఉండగా హైకోర్టు లో మరో 2 కేసులు నడుస్తున్నాయని వెల్లడించారు. భూములను పరిరక్షిండంలో ఏలాంటి న్యాయపరమైన చిక్కులు ఏర్పడ్డా ఎదుర్కొనేందుకు నీటిపారుదల శాఖా ప్రత్యేక సీనియర్ న్యాయవాదిని నియమించనున్నట్లు మంత్రి వెల్లడించారు. కోటానుకోట్ల విలువ చేసే భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు గాను నీటిపారుదల శాఖా హైడ్రా, రెవిన్యూ, ఆర్‌అండ్‌ఆర్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీటిపారుదల శాఖ భూములను సత్వరం గుర్తించాలని ఆయన నీటిపారుదల శాఖాధికారులకు సూచించారు. అంతే గాకుండా నీటిపారుదల క్వార్టర్స్ లో అక్రమంగా ఆక్రమించుకున్న వారిని తొలగించడంతో పాటు తక్షణమే వాటి సమగ్ర సమాచారం తన ముందుంచాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లోనూ ఆక్రమణలకు చోటు లేకుండా పరిపాలనా పరంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. .తద్వారా ఆక్రమణలకు చెక్ పెట్టొచ్చని ఆయన సూచించారు. దానికి తోడు రాష్ట్ర వ్యాప్తంగా నీటిపారుదల కాలువల పక్కన ఉన్న భూముల్లో ,ప్రాజెక్టులకు చెందిన భూములలో సౌర విద్యుత్ ప్లాంట్ ల ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఇందుకు సంబంధించి ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చించినట్లు మంత్రి తెలిపారు. సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులకు విద్యుత్ నందించ వచ్చని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## ట్రంప్ నిజమే చెప్పారు!

(మొదటి పేజీ తరువాయి)

'చనిపోయిన ఆర్థిక వ్యవస్థలు' అని అన్నారు. ఈ విషయమై రాహుల్‌గాంధీ మీడియా ప్రశ్నించగా, ట్రంప్ చెప్పింది నిజమేనన్నారు. ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రి తప్ప అందరికీ ఈ విషయం తెలుసున్నారు. అధ్యక్షుడు ట్రంప్ ఒక వాస్తవాన్ని చెప్పినందుకు సంతోషిస్తున్నానన్నారు. బిలియనీర్ గౌతమ్ అదానీకి సహాయం చేయడానికి బిజెపి భారత ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. 'మనది అద్భుతమైన విదేశాంగ విధానం అని విదేశాంగ మంత్రి ప్రసంగం చేస్తారు. ఒక వైపు, అమెరికా మనల్ని దుర్వినియోగం చేస్తోంది. మరోవైపు చైనా వెంటపడుతోంది, మూడవదిగా మీరు ప్రపంచవ్యాప్తంగా ప్రతినిధుల బృందాలను పంపినప్పుడు ఏ దేశం పాకిస్తాన్ వైఖరిని ఖండించలేదు. అసలు మీరు దేశాన్ని ఎలా నడుపుతున్నారు? మీకు దేశాన్ని ఎలా నడపాలో తెలియదు' అని రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు. మంగళవారం లోక్‌సభలో మోదీ ప్రసంగాన్ని ప్రస్తావిస్తూ, ప్రధాని ట్రంప్ పేరును లేదా చైనాను ప్రస్తావించలేదని మండిపడ్డారు. ఏ దేశం కూడా పాకిస్తాన్‌ను ఖండించలేదని మోదీ చెప్పలేదని, పహల్గామ్ దాడి వెనుక ఉన్న పాకిస్థాన్ సైనికాధికారితో ట్రంప్ భోజనం చేస్తున్నారని, వారు పెద్ద విజయం సాధించారని చెబుతున్నారని, ఇది మే మేరకు వాస్తవమని ప్రశ్నించారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ పూర్తి చేశానని ట్రంప్ 30 సార్లు చెప్పారని, భారతదేశానికి చెందిన ఐదు విమానాలను కూల్చివేసినట్లు కూడా ట్రంప్ చెబుతున్నారన్నారు. ఇప్పుడే 25 శాతం సుంకం విధిస్తానని ప్రకటించారని రాహుల్ గుర్తుచేశారు. మోదీ ఎందుకు సమాధానం చెప్పలేకపోతున్నారని నిలదీశారు.

**ట్రంప్ నిరాధార ఆరోపణలపై మోదీ మౌనమేల? : ఖర్గే...** కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్–పాకిస్థాన్ కాల్పుల విరమణ వాదనలపై పార్లమెంటులో ప్రధాని 'మౌన వ్రతం' చేశారని, భారతదేశంపై అమెరికన్ నాయకుడు చేసిన నిరాధారమైన ఆరోపణలపై ఆయన మౌనంగా ఉంటారా అని ప్రశ్నించారు. తమకు దేశమే ముందని, తాము ఎల్లప్పుడూ దేశంతోనే ఉంటామని ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు. ట్రంప్ భారత్‌పై విధించే 25 శాతం సుంకాలు దేశ వాణిజ్యాన్ని దెబ్బతీస్తాయని, ఎంఎస్‌ఎంఇలు, రైతులు కూడా ప్రతికూలంగా ప్రభావితమవుతారన్నారు. అనేక పరిశ్రమలు భారీ నష్టాలను చవిచూస్తాయని, కేంద్ర మంత్రులు నెలల తరబడి అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరపాలని మాట్లాడుతున్నారని, వారిలో కొందరు చాలా రోజులు వాషింగ్టన్‌లో మకాం వేశారని ఖర్గే గుర్తుచేశారు. 'మీ స్నేహితుడు 'నమస్తే ట్రంప్', 'అబ్కీ బార్ ట్రంప్ సర్కార్' మీ స్నేహానికి గుర్తుగా మన దేశానికి ఈ విధంగా ప్రతిఫలం ఇచ్చారా? అని ప్రశ్నించారు.

రష్యా నుంచి భారత్ చమురు దిగుమతి చేసుకోవడం, ఆయుధాల కొనుగోలు, బ్రిక్స్‌లో భారత దేశం సభ్యత్వం, బ్రిక్స్ అమెరికా డాలర్‌పై దాడి తదితర కారణాల వల్ల అమెరికా అధ్యక్షుడు సుంకానికి కారణమని ఖర్గే అన్నారు. భారతదేశ జాతీయ విధానమైన 'వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి'కి ఇది తీవ్ర దెబ్బ అని కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో, ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ అమెరికాతో సహా 45 దేశాల నుండి భారతదేశానికి అణు మినహాయింపు పొందారని ఖర్గే ఎత్తి చూపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## హైకోర్టులో అదనపు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం



ప్రజాపక్షం/హైదరాబాద్: హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా న్యాయవాదుల కోటా నుంచి గౌస్ మీరా మొహినుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్ కుమార్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. మొదటి కోర్టు హాల్లో జరిగిన కార్యక్రమంలో వారితో చీఫ్ జస్టిస్ ఏకే సింగ్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాజ్యాంగానికి లోబడి, చట్టబద్ధంగా, రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహిస్తామని దైవసాక్షిగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు రిటైర్డ్ న్యాయమూర్తులు న్యాయ అధికారులు సీనియర్ న్యాయవాదులు కొత్తగా నియమితులైన న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు హాజరయ్యారు.



## అనేక త్యాగాల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ

### సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్ ఆవిష్కరణలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్: సమసమాజమే లక్ష్యంగా ఆవిర్భవించి అనేక త్యాగాల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో ఘనంగా జరగనున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు చెప్పారు. మహాసభలు జరిగే ప్రాంతానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, దివంగత 'ఎన్.బాలమల్లేష్ నగర్'గా నామకరణం చేసినట్లు చెప్పారు. వందేళ్ల ప్రస్థానంతో ముందుకు సాగుతున్న సిపిఐని ప్రజలతో మరింత మమేకం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర మహాసభలు కొనసాగుతాయని ఆయన ప్రకటించారు. సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్ అవిష్కరణ కార్యక్రమం గురువారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట రెడ్డి, పశ్యపద్మ, వి.ఎస్.బోస్, ఈ.టి.నరసింహ, మాజీ ఎమ్మెల్సీ పి.జె.చంద్రశేఖర రావు, సిపిఐ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్,సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఇ.ఉమామహేష్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయా దేవితో కలిసి కూనంనేని సాంబశివరావు మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ 2022లో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో సిపిఐ రాష్ట్ర 3వ మహాసభలు జరగగా 4వ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో జరగనున్నాయని వెల్లడించారు.

గడిచిన ఈ మూడేళ్లలో బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద, ఫాసిస్టు విధానాలను వెలుగులోకి తీసుకురావడం లో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారన్నారు. తద్వారా గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని 240 సీట్లకు కట్టడి చేయడంలో విజయం సాధించామని చెప్పారు. రాష్ట్రం లో పోడు భూములకు సంబంధించి సిపిఐ నిర్వహించిన ఉద్యమాలతో 75 శాతం ఈ సమస్య పరిష్కారమైందన్నారు.

అసంఘటిత కార్మికుల వేతనాల పెంపుకోసం సిపిఐ రాజీలేని పోరాటాలను నిర్వహిస్తోందన్నారు. అయితే అధికార పార్టీతో ఉన్న స్నేహ ధర్మాన్ని పాటిస్తునే ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమిస్తున్నామని చెప్పారు. ఇకముందు మరింత పెద్దఎత్తున ప్రజా పోరాటాలకు సన్నద్ధం కానున్నామని, ఇందుకు మహాసభల వేదికగా కార్యచరణ ను రూపొందించుకోనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జి. సాయిలు గౌడ్, కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, పి.ప్రేమ్ పావని, ఆర్.అంజయ్య నాయక్, ఎం.ప్రవీణ్ కుమార్, దామోదర్ రెడ్డి, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి మొక్కలను పెంచిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్: గంజాయి మొక్కలను పెంచిన వ్యక్తికి కోర్టు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధించింది. దూల్‌పేట్ ఎక్సైజ్ సిఐ మధుబాబు సంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్నప్పుడు నమోదైన కేసులో గురువారం ఈ తీర్పు వెలువడింది. సంగారెడ్డి మండలం, మునిపల్లి గ్రామంలో తన పొలంలో 36 గంజాయి మొక్కలను పెంచుతున్న సమాచారం తెలుసుకున్న సిఐ మధుబాబు గంజాయి మొక్కలను పీకి వేసి అతనిపై కేసు నమోదు చేసి చార్జీ దాఖలు చేశారు. ఈ కేసు 2001లో నమోదయింది. శిక్ష పడినటువంటి మన్నె రాములు కానిస్టేబుల్ సిహెచ్ రమేష్ జైలుకు తరలించారు.

## పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం

### సిపిఐ వరంగల్ జిల్లా మహాసభలో జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

### అంబేద్కర్ వాదులు, కమ్యూనిస్టులు ఏకం కావాలి : తక్కళ్లపల్లి



ప్రజాపక్షం/వరంగల్:పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయమని, యుద్ధోన్మాదులు,మతోన్మాదులతోనే దేశానికి ప్రమాదకరమని, కగార్ ఆపరేషన్ పై న్యాయ విచారణ జరుపాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ జిల్లా సిపిఐ మహాసభల రెండవ రోజు ఖిలా వరంగల్ మండల కేంద్రంలో జరిగిన ప్రతినిధుల సభను ఉద్దేశించి చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత తలసరి ఆదాయం రెట్టింపు అయితే ప్రజల కొనుగోలు శక్తి ఎందుకు పెరగలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎందుకు రాలేదని, రైతుల పంట ఉత్పత్తుల కు గిట్టుబాటు ధరలు ఎందుకు కల్పించబడలేదని ప్రశ్నిం చారు. మోడీ పాలనలో సంపద అంతా కార్పొరేట్ శక్తులైన అంబానీ, అదానీల వద్దే కేంద్రీకృతం అయిందని, అందుకే పేదల బతుకులు మారలేదని అన్నారు. మోడీ అధికారంలోకి రాకముందు కేవలం 50లక్షల కోట్లు ఉన్న అప్పు నేడు 160 లక్షల కోట్లకు పెరిగిందని అన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ఇండ్లులేని నిరుపేదలు పెరిగి పోయారని చెప్పారు.

దేశంలో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వీరోచిత విప్లవాల చరిత్ర కలిగిన శ్రమ జీవుల పార్టీ సిపిఐ అన్నారు. దశాబ్దాలుగా ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటాలను సిపిఐ నిర్వహించిందని చెప్పారు. ఎన్నో పార్టీలు పుట్టి కనుమరుగు అయ్యాయని, ప్రజా ప్రయోజనాలకే నిలబడి ఉండడం వల్లనే అధికారం లేకున్నా కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల పాటు నిలబడిందని అన్నారు. సిపిఐ ఆవిర్భవించి ఈ ఏడాది డిసెంబర్ 25 నాటికి వందేళ్లు కావస్తుందని, ఈ సందర్భంగా వందేళ్ల ముగింపు బహిరంగ సభను ఖమ్మంలో ఐదు లక్షల మందితో నిర్వహించనున్నట్లు తెలిపారు.

రెండవ రోజు సిపిఐ మహాసభల సందర్భంగా జరిగిన ప్రతినిధుల సభను ప్రారంభించిన అనంతరం సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మూడవసారి అధికారంలోకి వచ్చిన తరువాత అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని మార్చి వేసి మనువాదాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నదన్నారు. అలాగే ఆపరేషన్ కగార్ పేరుతో, వక్ఫ్ బిల్లు పేరుతో దాడి తీవ్రంచేస్తూ ముస్లింలు, క్రిష్టియన్‌లను, కమ్యూనిస్టులను శత్రువులుగా చూస్తున్నారన్నారు. అందు కే దేశంలో అంబేద్కర్ వాదులు, కమ్యూనిస్టులు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో తలసరి ఆదాయం పెరిగిందని, ప్రపంచంలో మనదేశం నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, తప్పుడు లెక్కలు చెబుతున్నారని, దొంగ లెక్కలు, మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. దేశంలో పేదల సంపద రెట్టింపు కాలేదని, కేవలం అంబానీ, ఆదానీ లాంటి కార్పొరేట్ శక్తుల ఆదాయమే పెరిగిందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో మన పాత్ర ఉందని, అసెంబ్లీలో సిపిఐకి ఒక్క ఎమ్మెల్యేనే ఉన్నప్పటికీ ప్రజా సమస్యలపై గళమెత్తడంలో ముందున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేదంటే సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**వరంగల్‌ను రెండో రాజధానిగా అసెంబ్లీలో ప్రకటించాలి**

హైదరాబాద్ తరువాత అతిపెద్ద నగరంగా ఉన్న వరంగల్‌ను రాష్ట్ర రెండో రాజధానిగా ఏర్పాటు చేసేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని, హైదరాబాద్ మాదిరిగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పేదల ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ రావాలని, సాఫ్ట్ వేర్ కంపెనీలు రావాలని, స్థానికులకు ఉద్యోగాలు రావాలన్నారు. వీటి సాధన కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామ గ్రామాన సిపిఐని బలోపేతం చేసి ఉద్యమాలు నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి ఇప్పటి వరకు పార్టీ నిర్వహించిన కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెట్టగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ప్రతినిధుల సభను ఉద్దేశించి ప్రసంగించారు. తొలుత సిపిఐ జిల్లా మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సిపిఐ పతాకాన్ని సిపిఐ రాష్ట్ర నాయకులు తాటిపాముల వెంకట్రాములు ఎగురవేశారు. ఈ మహాసభకు అధ్యక్షవర్గంగా దండు లక్ష్మణ్, గుండె బద్రి, అక్కెపల్లి రమేష్, ల్యాదల్ల శరత్, తోట చంద్రకళ వ్యవహరించగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. విజయ సారథి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర నాయకులు టి. వెంకట్రాములు, సిరబోయిన కరుణాకర్, పంజాల రమేష్, అదరి శ్రీనివాస్, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి, ఎన్ ఎ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కె బాష్‌మియా, పనాస ప్రసాద్, హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, నాయకులు గన్నారపు రమేష్, దండు లక్ష్మణ్, అక్కపెల్లి రమేష్, బుస్సా రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శిగా ఎస్‌కె. బాష్‌మియా



ప్రజాపక్షం/వరంగల్: సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శిగా ఎస్‌కె బాష్ మియా ఎన్నికయ్యారు. నగరంలోని ఖిలా వరంగల్ మండలం శంభునిపేట ప్రాంతానికి చెందిన బాష్ మియా ఇప్పటివరకు పార్టీ నగర సహాయ కార్యదర్శిగా, నగర కార్యదర్శిగా, జిల్లా సహాయ కార్యదర్శిగా పనిచేశారు. వరంగల్ నగరంలో సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన భూపోరాటాలలో బాష్ మియా క్రియాశీలంగా పనిచేశారు.

## ఆదాయ ధ్రువీకరణ పత్రాల నిబంధనలు ఎత్తివేయండి

### మాజీ మంత్రి మహమూద్‌అలీ

ప్రజాపక్షం/హైదరాబాద్:ఇమాం, మౌజంలను వేతనా ల విషయంలో ప్రభుత్వం ఆదాయ ధ్రువీకరణ పత్రాల ను అడుగుతోందని, ఆదాయమే లేనప్పుడు వారు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఎలా ఇస్తారని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి మహమూద్‌అలీ ప్రశ్నించారు. ఇమామ్, మౌజంలకు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలనే నిబంధనలు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహమూద్‌అలీ మాట్లాడుతూ మైనారిటీ గురుకులాల్లో సరైన సౌకర్యాలు కల్పించడం లేదని, మైనార్టీలకు ఫ్రీ, పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిపదవిని మైనార్టీకి చెందిన వ్యక్తికే అప్పగించాలని డిమాండ్ చేశారు.వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ మసియుల్లాఖాన్ మాట్లాడుతూ షబ్బీర్ అలీ సిఎంకు సలహాదారుగా ఉన్నప్పటికీ మైనార్టీలకు న్యాయం జరగడం లేదని ఆరోపించారు. ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ రహీముల్లా ఖాన్ నియాజీ మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వం మైనార్టీలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు అర్షద్ అలీ ఖాన్, మొయిద్ ఖాన్, బద్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా రంగానికి మంచి భవిష్యత్తు

### నూతన క్రీడా విధానంతో

### మంత్రి వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం/హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు సమగ్రమైన తెలంగాణ క్రీడా విధానం–2025 ను రూపొందించామని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. వనపర్తి నియోజకవర్గం ఆత్మకూరు కేంద్రంలో స్పోర్ట్స్ కాంక్లేవ్ పోస్టర్ ను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దశాబ్దకాలం నుండి విస్మరించబడ్డ క్రీడారంగం సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేగవంతంగా పనిచేస్తూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కృషి జరుగుతోందని అన్నారు. తాను క్రీడల మంత్రి గా బాధ్యతలు చేపట్టిన మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలోనే క్రీడారంగం ఆమోదింపబడటం ఒక క్రీడాకారుడిగా తనకి ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు. దీర్ఘకాలిక క్రీడల అభివృద్ధి కొరకు ఉద్దేశించబడ్డా యి. ఈ నూతన క్రీడా విధానాన్ని పటిష్టంగా, పకడ్బందీగా అమలు చేయడానికి దేశవ్యాప్తంగా ఉన్న వివిధ క్రీడారంగ నిష్ణాతులు వివిధ క్రీడా సమాఖ్యల ప్రతినిధులతో కలిసి విస్తృత స్థాయిలో ఈ స్పోర్ట్స్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడా విధానం–2025 తెలంగాణ క్రీడా రంగాని కి ఒక నూతన వరవడిని సాధించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడా రంగానికి క్రీడాకారులకు మంచి భవిష్యత్తు అందజేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి, మట్టిలో మాణిక్యాలను గుర్తించి వారిని ప్రపంచ ఛాంపియన్లుగా చేయటానికి ఈ క్రీడా విధానం ఎంతో దోహదం చేస్తుందని అన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ.. నూతన క్రీడా విధానంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ బాధ్యతలు మరింత విస్తరించబోతున్నాయని వివిధ శాఖల సమన్వయం తో విస్తృతంగా క్రీడా కార్యక్రమాలను నిర్వహించడానికి, క్రీడాకారులను ప్రోత్సహించడానికి బహుముఖంగా తెలంగాణ స్పోర్ట్స్ తాటి సేవలు అందజేయడానికి ఈ విధానం ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. ఏడాదికాలంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరపున ఎన్నో జాతీయ, అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలు నిర్వహించామని, రానున్న రోజుల్లో ఈ కృషిని మరింత రెట్టింపు ఉత్సాహంతో కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## బిసిల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బిసి డిక్లరేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బిసిల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం బిసి రిజర్వేషన్లు పెంచడం తోపాటు రాష్ట్ర బడ్జెట్ లో నిధులు పెంచి బీసీ సబ్ ప్లాన్ తీసుకువచ్చే దిశగా ఆలోచిస్తున్నామని చెప్పారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలోని బిసి ప్రతినిధుల బృందం గురువారం హైదరాబాద్‌లోని మాహాత్మ జ్యోతిబాపూలే భవన్ లో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు, ఈ సందర్భంగా బిసి డిమాండ్లపై ఉప ముఖ్యమంత్రి జాజుల శ్రీనివాస్ గౌడ్ తో సుదీర్ఘంగా చర్చించారు . ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రాష్ట్ర బడ్జెట్లో బిసిల సంక్షేమానికి ప్రతి ఆర్థిక సంవత్సరం రూ. 20వేల కోట్లు కేటాయించాలని ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ తరహాలోని బిసిలకు కూడా చట్టబద్ధమైన సబ్ ప్లాన్ తీసుకురావాలని డిప్యూటీ సిఎంను కోరారు. అదేవిధంగా గత 4 ఏళ్లుగా ఉన్న బిసి విద్యార్థుల ఫీజుల బకాయిలను తక్షణమే చెల్లించడంతో పాటు హైదరాబాదులో ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కొనే విధంగా మహాత్మ జ్యోతిబాపూలే నాలెడ్జ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బిసిల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి కమిటీ మెంట్ తోపనిచేస్తుందని డిప్యూటీ సిఎం హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, బిసిసంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బిసియువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకూర్మ, బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మని మంజరి, బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి డి రమ, బిసి మేధావుల వేదిక నాయకులు ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ శ్రీనివాస్, బిసి నేతలు రావులకు నరేష్ ప్రజాపతి, జాజుల లింగం గౌడ్ వేముల నాదం గౌడ్ పానుగంటి విజయ్, జి నాగరాజు గౌడ్, సత్యం గౌడ్ ఇంద్రమ్ రజక, గౌతమ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## 'తెలంగాణ స్టేట్ కాన్సులర్ వెయిటింగ్ ఏరియా'

### రూ.1.5 కోట్లతో

### లాంఛనంగా ప్రారంభించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వేసే ప్రతి అడుగు తెలంగాణ ప్రజల కోసమేనని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని యుఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయ ప్రాంగణంలో రూ.1.5 కోట్లతో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్(టిజిఐఐసి) అత్యాధునిక వసతులతో నిర్మించిన 'తెలంగాణ స్టేట్ కాన్సులర్ వెయిటింగ్ ఏరియా'ను ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు. 'హైదరాబాద్‌లోని యుఎస్ కాన్సులేట్‌కు ప్రతిరోజూ 3వేలమందికి పైగా సందర్శకులు వస్తుంటారు. వేచి చూసేందుకు సరైన సౌకర్యాలు లేక ఇక్కడికొచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మా దృష్టి కొచ్చిం ది. క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ఎక్కడెక్కడ ఏం అవసరమో గుర్తించి... అందుకు అనుగుణంగా అత్యాధునిక వసతులతో కూడిన వెయిటింగ్ ఏరియాను అందుబాటులోకి తీసుకొచ్చాం. కేవలం పారిశ్రామిక, సాంకేతిక రంగాలకే పరిమితం కాకుండా, ప్రజల రోజువారీ జీవితాల్లో మార్పు తెచ్చేందుకు మా ప్రభు త్వం తీసుకుంటున్న చొరవకు ఇది నిదర్శనం' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణ – అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఫార్మా, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఇవి రంగాల్లో అమెరికా మన రాష్ట్రానికి అగ్రగామి వ్యాపార భాగస్వామి అని తెలిపారు. మన ఐటి ఎగుమతుల్లో 38 శాతం ఉత్తర అమెరికాకు జరుగుతున్నాయని, గూగుల్, అమెజాన్, యాపిల్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రపంచ స్థాయి కంపెనీలకు హైదరాబాద్ నిలయంగా ఉందన్నారు. ఈ ఏడాది ఒక్క జనవరిలోనే అమెరి కా కంపెనీలు మన రాష్ట్రంలో రూ. 31,500 కోట్ల పెట్టుబడులను పెట్టాయన్నారు.

ఫలితంగా 30వేల కొత్త ఉద్యోగాలు సృష్టించబడ్డాయి అని చెప్పారు. ఈ కొత్త వెయిటింగ్ ఏరియా ద్వారా ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసేందుకు కూడా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ తదితరులు పాల్గొన్నారు.

### అమెరికా కాన్సులేట్ జనరల్ లార్సన్‌కు శ్రీధర్ బాబు ఆత్మీయ వీడ్కోలు



హైదరాబాద్ అమెరికా కాన్సుల్ జనరల్‌గా తన పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న జెన్నిఫర్ లార్సన్‌కు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే చేనేత చీరను ఆమెకు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ అమెరికా మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసేందుకు ఆమె విశేష కృషి చేశారని; విద్య, సాంస్కృతిక మార్పిడి, వాణిజ్య రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో కీలకంగా వ్యవహరించారన్నారు. ఆమె అందించిన సహకారం, దార్శనికతకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ తెలంగాణ అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అయ్యేలా సహకారం అందించాలని కోరారు. ఆమె తదుపరి ప్రయాణంలోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## కేంద్రమంత్రికి తెలంగాణ బిసి కమిషన్ లేఖ

### కేంద్ర ఒబిసి జాబితాలో 40 కులాలు చేర్చాలంటూ..

ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్ర ఒబిసి జాబితాలో కొత్తగా 40 కులాలను వెంటనే చేర్చాలని తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల ఛైర్మన్ జి.నిరంజన్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రి వీరేంద్ర కుమార్‌కు గురువారం ఒక లేఖ రాశారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కేంద్ర ఒబిసి జాబితాను 2016లో ప్రకటించడం జరిగిందని, అయితే అప్పటికే రాష్ట్ర బిసి జాబితాలో 112 కులాలుండగా, కేంద్రం మాత్రం 90 కులాలతో మాత్రమే జాబితా ప్రకటించడం జరిగిందని లేఖలో నిరంజన్ పేర్కొన్నారు. తదనంతర కాలంలో తెలంగాణ రాష్ట్ర జాబితాలో అనాథలను, మరో 17 కులాలను రాష్ట్ర ప్రభుత్వం చేర్చిందని, దీంతో రాష్ట్రంలోని బిసి జాబితాలో మొత్తం కులాల సంఖ్య 130కి చేరగా, కేంద్ర జాబితాలో చేర్చవలసిన కులాల సంఖ్య 40కి చేరిందని లేఖలో ఆయన తెలిపారు. కేంద్ర జాబితాలో లేనటువంటి కులాలను చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం 2016 నుండి వివిధ దఫాలుగా కేంద్రాన్ని కోరుతూ వస్తుందని, 2016 నుంచి 2020 వరకు అప్పటి బిసి వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ లేఖలు రాయటం జరిగిందని, 2021 డిసెంబర్ నెలలో మొత్తం 40 కులాలను కేంద్ర జాబితాలో చేర్చే విషయంలో జాతీయ బిసి కమిషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో విచారణ కూడా జరిగిందని లేఖలో గుర్తు చేశారు.

తదనంతరం 2023 సెప్టెంబర్ 5న జాతీయ బిసి కమిషన్ అధ్యక్షుడు హంసరాజ్ గంగారామ్ ఆహీర్ ఆధ్వర్యంలో మరో మారు న్యూఢిల్లీలో విచారణ చేపట్టడం జరిగిందన్నారు. అయినప్పటికీ ఈ 40 కులాలను కేంద్ర జాబితాలో చేర్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ప్రకటించలేదని, ఈ 40 కులాలకు చెందినవారు కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలలో మరియు ఉద్యోగ రంగంలో తమ అవకాశాలను కోల్పోతున్నారని, కావున సదరు 40 కులాలను వెంటనే కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చవలసిందిగా నిరంజన్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం. ఫోన్ నం.08743-232428
ఆర్.సి.నం. ఇ1/382/2025 | eGP Portal-Tenders షార్ట్ టెండరు ప్రకటన-2వ పిలుపు | ది: 31.07.2025
ఈ దేవస్థానమునకు సంబంధించిన వివిధ పనులు చేయుటకుగాను మరియు కంప్యూటర్లు, ప్రింటర్స్, ఇతర మెటీరియల్ సరఫరా చేయుటకుగాను ఈ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్లు కోరబడుచున్నవి. **డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేది:** 31.07.2025 మధ్యాహ్నం గం. 1.00ల నుండి, **టెండరు దాఖలుచేయు చివరి తేది:** 06.08.2025 మధ్యాహ్నం గం.1.00వరకు, **ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది:** 06.08.2025 మధ్యాహ్నం గం.1.30లకు. ఇతర వివరములు https://tender.telangana.gov.in నందు చూడగలరు.
సం/- ఎల్. రమాదేవి
కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 5815-PP/CL/ADVT/1/2025-26, Date: 31-07-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, డివిజన్-14, జిహెచ్‌ఎంసి**
NIT No. 30/E.E.14/GHMC/25-26 | టెండర్ ప్రకటన | తేది: 30.07.2025
**పని పేరు:** జిహెచ్‌ఎంసి, కెజెడ్, డివిజన్ 14 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు, **అంచనా విలువ:** రూ.1172142.00, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 31.07.2025న ఉ.11.00గం.ల నుండి మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 07.08.2025న ఉ.11.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ - 14, జిహెచ్‌ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ 14, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 5809-PP/CL/ADVT/1/2025-26, Date: 31-07-2025

## అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



**ప్రజాపక్షం/మునుగోడు:** అంకితభావంతో పనిచేస్తేనే అధికారులకు సరైన గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డిఈఈ ముజుబుద్దిన్ పదవీ విరమణ కార్యక్రమం గురువారం మునుగోడు మండల కేంద్రంలో ఫంక్షన్ లో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ సత్యం ముఖ్య అతిథిగా హాజరై పదవి విరమణ పొందిన డిఈఈ ముజుబుద్దిన్‌నికి శాలువాతో సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో పని చేస్తూ గత కొన్ని సంవత్సరాలుగా ఇంటింటికి తాగునీరు అందించే విషయంలో డిఈఈ చాలా శ్రద్ధ తీసు కొని ప్రతి ఇంటికి నీరు వచ్చేలా కృషి చేశారని అన్నారు. గత 36 సంవత్సరాలుగా ఈ శాఖలో సుదీర్ఘకాలంగా ఈ జిల్లాలో పనిచేశారని నిజాయితీ గల అధికారిగా పనిచేసినందుకు ఆయనను అభినందించారు.

## నేడు యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు డిప్యూటీ సిఎం రాక

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వం దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌కు నేడు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కతోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్లాంట్‌లో నిర్మించినున్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు శంకుస్థాపన చేయడంతోపాటు 1వ యూనిట్‌ను జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు. నేడు ఉదయం 9గంటలకు బేగంటపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలు దేరి మంత్రులు 10గంటలకు పవర్‌ప్లాంట్‌కు చేరుకుంటారు. 10.15గంటల నుంచి 11గంటల వరకు ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు శంకుస్థాపన చేసి 11గంటల నుంచి 11.45గంటల వరకు యూనిట్1ను ప్రారంభించి జాతికి అంకితం చేస్తారు. 12గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు అధికారులతో సమీక్షా సమావేశం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహిస్తారని, 1.45గంటలకు తిరిగి బేగంపేటకు వెళ్లనున్నట్లు తెలిపారు.



## వేగంగా లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులందరూ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం భువనగిరి మండలం హన్మాపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం ఎన్ని ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంలో ఉన్నాయి. అవి ఏ దశలో ఉన్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు అందరూ వేగంగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. డబ్బులు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రతి సోమవారం మీ అకౌంట్‌లలో డబ్బులు జమ అవుతున్నాయని లబ్ధిదారులకు సూచించారు. ఇండ్లు ప్రారంభించడానికి ఆర్థికంగా ఇబ్బందులు ఉంటే మీ గ్రామంలో మహిళా సంఘాల ద్వారా లోన్ తీసుకొని ఇంటి నిర్మాణాలు వేగంగా చేపట్టాలన్నారు. మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల పనులకు సంబంధించిన మెటీరియల్‌ను కూడా తక్కువ ధరలకు ఇచ్చేందుకు ప్రతి మండలంలో కమిటీలు వేశావని తదనుగుణంగా లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఇంటి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు.

## ఇష్టంతో చదివితేనే ఉన్నత స్థానాలకు

### కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్ :** విద్యార్థులు ప్రతి సబ్జెక్ట్‌లో ఇష్టంతో చదివి మంచి మార్కులు తెచ్చుకుని జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ ఆకాంక్షించారు. గురువారం సూర్యాపేట మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యా ప్రాముఖ్యతను, వ్యక్తులు చేసే ప్రతి వృత్తిద్వారా సమాజంలో గుర్తింపు పొందుతారని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించి భవిష్యత్‌ను రూపొందించడానికి పాఠశాల స్థాయి నుండే కష్టపడాలని తెలిపారు. విద్యార్థులకి తెలుగు, ఇంగ్లీష్ భాషలపై పట్టు సాధించాలని తెలిపారు. బోధన పద్ధతులు, బాషా నైపుణ్యాలను పొందడంలో విద్యార్థులు పురోగతి సాధించాలని, విద్యార్థులు క్రమంగా మెరుగుపడుతున్నప్పటికీ నెమ్మదిగా నేర్చుకోవాలని అన్నారు. వారి ప్రాథమిక జ్ఞానాన్ని బలోపేతం చేయడానికి వారి అభ్యాస ఫలితాలను పంచడానికి అదనపు తరగతులు క్రమం తప్పకుండా నిర్వహించాలని కలెక్టర్ కోరారు. డిఇవో సతీష్‌కుమార్, డిఆర్‌డిఎ పిడి వివి అప్పారావు, తహసిల్దార్ కృష్ణయ్య, ఎంపిడివో బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెండు నెలల్లో రెండు పడక గదుల ప్రారంభం

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** రెండు నెలల్లో రెండు పడక గదులను ప్రా రంభించడం జరుగుతుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణం సింగన్నగూడెంలో డబుల్ బెడ్రూం ఇండ్ల మౌలిక సందుపాయల పనులను, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డును భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్ల మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయని అన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను త్వరలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయాని, నియోజక వర్గ అభివృద్ధి మంత్రులు సహకారం కూడా అందుతుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలకు రూ.2 కోట్లు ఖర్చు చేసి పూర్తి చేయడం జరిగిందన్నారు. బీసీ రిజర్వేషన్ 42 శాతంకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఆవేస్ చిస్తీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పి.ప్రమోద్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జాంగిర్, పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, మాజీ ఎంపీపీ నూతి రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్‌శాఖలో సుదీర్ఘకాలం సేవలు అభినందనీయం : ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** సూర్యాపేట జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎస్‌ఐ అంతిరెడ్డి గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన ఎస్‌ఐ వారి కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి కె.నర్సింహా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సుదీర్ఘ కాలం పొందిన గొప్ప విషయమని అన్నారు. గృహిణిగా భర్తకు సహాయ సహకారాలు అందించడంలో భార్య సేవలు విలువైనవని అన్నారు. ఇంటిని పిల్లలను ప్రయోజకులను చేయడంలో భార్యపాత్ర కీలకమైందని అన్నారు. కానిస్టేబుల్ గా ఉద్యోగంలో చేరి ఎస్‌ఐ స్థాయి పొందారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్‌రెడ్డి, ఎఆర్ అదనపు ఎస్‌పి జనార్ధన్‌రెడ్డి, ఎవో మంజూ భార్గవి, డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ హరిబాబు, పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షులు రామచందర్‌గౌడ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




# నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

### రూ. 40 కోట్ల వ్యయంతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనానికి శంకుస్థాపన





**ప్రజాపక్షం/ నల్లగొండ :** మంచి విద్యనందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో రూ. 40 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనానికి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, అందువల్ల విద్యార్థులు బాగా చదువుకోవాలని అన్నారు. ప్రస్తుతం మహిళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలలో రెండు రోజుల్లో తాగునీటి ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ,నెల రోజుల్లో ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో బాత్రూంలు, ఇతర సౌకర్యాలన్నీ కల్పిస్తామని తెలిపారు. కేరళలో 99.9 అక్షరాస్యత ఉండగా, మన రాష్ట్రంలో 60 శాతం ఉందని , విద్య, నైపుణ్యాలు పెంపొందింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీతో పాటు, అన్ని రకాల విద్యా సదుపాయాలు కల్పిస్తున్నదని అన్నారు. నర్సింగ్ విద్యార్థులు చదువు పైన దృష్టి సారించాలని, సెల్ ఫోన్ జోలికి వెళ్ళవద్దని, ప్రజలకు మంచి సేవలు అందించాలని, సమయాన్ని వృధా చేసుకోవద్దని అన్నారు. ఈ నెల 4 న ప్రభుత్వ వైద్య కళాశాల పక్కనే 150 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాటశాల పనులకు భూమి పూజ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నర్సింగ్ కోర్స్ చాలా ఉత్తమమైనదని, వైద్యరంగంలో నర్సింగ్ అనేది మొదటి అడుగు అని అన్నారు. రోగులు ముందుగా స్టాఫ్ నర్స్ ని సంప్రదిస్తారని, డాక్టర్ కన్నా స్టాఫ్ నర్స్ ముఖ్యమని, రోగి ప్రాణాలు కాపాడటంలో స్టాఫ్ నర్స్ పాత్ర ఎంతో ఉంటుందని అన్నారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి తదితరులు ఉన్నారు.

**వైద్య పరికరాలు, సౌకర్యాలకు ప్రతిపాదనలను తక్షణమే రూపొందించాలి**

ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని అన్ని విభాగాలలో అవసరమైన వైద్య పరికరాలు, సౌకర్యాలను కల్పిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఇందుకుగాను అవసరమైన ప్రతిపాదనలను తక్షణమే రూపొందించి సమర్పించాల్సిందిగా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.గురువారం ఆయన పభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అభివృద్ధిపరిచిన దయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ఛాంబర్ లో ఆసుపత్రి వైద్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జిల్లాలో వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రసవం తర్వాత తల్లికి,బిడ్డకు పనికి వచ్చేలా ఎం సి హెచ్ కిట్లను అందించేందుకు అన్ని వస్తువులతో కిట్లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా అవసరమైన సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. ఖాళీగా ఉన్న ఫిజీషియన్, సర్జన్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.



## చివరి ఆయకట్టుకూ సాగునీరందించడమే లక్ష్యం

### ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** ధర్మారెడ్డి కాల్వ ద్వారా చివరి ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం మండలంలోని వెల్లంకి, సిరిపురం గ్రామాల్లో ప్రవహించే ధర్మారెడ్డి కాల్వ నిర్మాణ పనులను అధికారులు, రైతులతో కలిసి పర్యవేక్షించి అతి త్వరలో కాల్వ నిర్మాణ పనులను పూర్తి చేసి రైతన్నలకు నీరందిస్తామని హామి ఇచ్చారు. స్వయంగా ఆయకట్టు చుట్టు తిరుగుతూ కాల్వ నిర్మాణ పనులను పరిశీలించి ఎమ్మెల్యే శరవేగంగా ఉన్న మిగతా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎడారిగా ఉన్న దుక్కులను సస్యశ్యామలంగా పచ్చని పైర్లుగా మార్చే దిశగా కృషి చేస్తున్నామన్నారు. రైతన్నల కల సాకారమవుతునంద్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# యూరియా అక్రమార్కుల అరెస్ట్

### నల్లగొండ డిఎస్‌పి శివరాంరెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/చిట్యాల :** రైతులకు ఉపయోగపడాల్సిన సబ్సిడీ ఎరువును బ్లాక్ మార్కెట్ కొనుగోలు, అమ్మకం దందాను నిర్వహిస్తున్న పలువురిని చిట్యాల పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఈ విషయంపై నల్లగొండ డిఎస్‌పి శివరాంరెడ్డి, సిఐ నాగరాజు, ఎస్ఐ రవికుమార్‌లు పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రం, నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన పలువురు సిండికేట్‌గా ఏర్పడి పలు ప్రాథమిక సహకార సంఘాల నుండి రైతుల ఆధార్ కార్డులతో సబ్సిడీ ఎరువులను కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నట్లు వారు వెల్లడించారు. బీహార్‌కు చెందిన నాగదేవ్ శంకర్ యాదవ్ గత 10 సంవత్సరాలుగా 65వ నెంబర్ జాతీయ రహదారిపై వెలిమినేడు గ్రామ శివారులో యుపి, బీహార్ పేరుతో డాబా హోటల్ నిర్వహిస్తున్నాడు. దానిపై సంపాదన సరిగ్గా లేకపోవడంతో అక్రమ పద్ధతుల్లో డబ్బును సంపాదించాలన్న నెపంతో రాజస్థాన్‌కు చెందిన గుర్తు తెలియని వ్యక్తి ద్వారా చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయడ్ అనే ఇంధనాన్ని తయారు చేసి విధానంపై శిక్షణ పొందాడు. అనంతరం ఎలాంటి అనుమతులు లేకుండా ఆయిల్ తయారు చేసే యంత్రాలతో ఎడి బ్లూ కంపెనీ పేరుతో డిఎఫ్ పరిశ్రమను ఏర్పాటు చేయడం జరిగింది. ఆయిల్ తయారికి గాను యూరియ విరివిగా అవసరమౌతుంది. దాంతో నాగదేవ్ శంకర్ యాదవ్ వెలిమినేడుకు చెందిన గోలి శంకరయ్య, పిఎసిఎస్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న మేడగోని దుర్గయ్యలతో కలిసి రైతులు ఉపయోగించాల్సిన సబ్సిడీ ఎరువులను రైతుల ఆధార్ కార్డుల పేరుతో కొనుగోలు చేయడం జరుగుతుంది. పరిశ్రమ కోసం వాడే యూరియా బస్తా ధర బహిరంగ మార్కెట్‌లో రూ. 1500 ఉండగా సబ్సిడీ ద్వారా సుమారు రూ. 267 మాత్రమే అందుతుంది. దీంతో వెలిమినేడు పిఎసిఎస్‌తో పాటు చిట్యాల, గుండ్రాంపల్లి సంఘాల నుండి కూడా యూరియ కొనుగోలు చేశారు. ఈ విధంగా రైతులకు యూరియా అందుబాటులో లేకుండా కృత్రిమ కొరత సృష్టిస్తూ అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న వారిని గురువారం అరెస్ట్ చేయడం జరిగిందని వారు తెలిపారు. వీరికి సహకరించిన వినోద్ కుమార్, రాజీవ్ రాయ్, రోషన్ కుమార్‌లపై కూడా కేసు నమోదు చేసి రిమాండ్ చేయనున్నట్లు డిఎస్‌పి శివరాంరెడ్డి తెలిపారు. కేసును చేధించిన ఎస్ఐ రవికుమార్, హెడ్ కానిస్టేబుల్ మధు, కానిస్టేబుల్స్ వెంకట్, కలీం, సాయి, గణేష్, జాన్‌రెడ్డి, హోంగార్డు వెంకటేశ్వర్లు లను ఆయన అభినందించారు.



## అర్హులందరికీ రేషన్ కార్డులు

### ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు ఇస్తామని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాపూజీ నగర్‌లో నూతనంగా నిర్మించిన డ్రింకింగ్ వాటర్ పైప్‌లైన్‌ను ప్రారంభించారు. అంబేద్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జేబి కాలనీలో అండర్ గ్రౌండ్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సాయికృప ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి లబ్దిదారులకు రేషన్ కార్డుల మంజూరు పత్రాలను అందజేశారు. లబ్దిదారులతో ముచ్చటించారు. అనంతరం ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ 10 సంవత్సరాలలో బిఆర్‌ఎస్ పాలనలో ఏ ఒక్కరికి కూడా రేషన్ కార్డులు అందలేదన్నారు. మండల వ్యాప్తంగా 1213కుటుంబాలకు నూతనంగా రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని తెలిపారు. ఎస్‌ఎల్‌బిసి, డిండి ఎత్తిపోతల పథకాలను త్వరలో పూర్తి చేస్తామని అన్నారు. పెండ్లీపాకుల రిజర్వాయర్ బాధితులకు త్వరలో 600 కోట్ల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వనున్నట్లు తెలిపారు. పెండ్లిపాకుల ఆయకట్టు రైతులకు త్వరలో నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మార్కెట్ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

# మర్రిగూడ ఎంపిడిఓ మునయ్యకు షోకాజ్ నోటీసు



ఇందిరమ్మ ఇండ్లపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్

**ప్రజాపక్షం /మునుగోడు :**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గ్రౌండింగ్ లో నిర్లక్ష్యం వహించడంతోపాటు,పి ఎం ఏవై గ్రామీన్ ఆన్ లైన్ ఎంట్రీ వివరాల నమోదులో కూడా నిర్లక్ష్యం వహించిన కారణంగా మర్రిగూడ ఎంపీడీవో మునయ్య కు షో కాజ్ నోటీసులు జారీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం మునుగోడు ఎంపీడీవో కార్యాలయంలో చండూరు డివిజన్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా మర్రిగూడ ఎంపీడీవో మునయ్య ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ లో నిర్లక్ష్యం వహించారని అంతేకాక తప్పనిసరిగా నమోదు చేయాల్సిన వివరాలను సైతం ఆన్లైన్లో నమోదు చేయడం లేదని తెలిపారు. అందువల్ల షో కాజ్ నోటిస్ జారీ చేసినట్లు తెలిపారు.చండూరు డివిజన్లో సోమవారం నాటికి ఇండ్ల గ్రౌండింగ్ 50 శాతం పురోగతి తీసుకురావాలని చెప్పారు. ఇళ్లు మంజూరై కట్టుకునేందుకు ఆర్థికంగా స్తోమత లేని లబ్ధిదారులను గుర్తించి స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా రుణం ఇప్పించేలా ప్రోత్సహించాలని తెలిపారు.ఎల్ 3 నుండి ఎల్ 1 కు వచ్చే లబ్ధిదారుల జాబితా పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఎట్టి పరిస్థితులలో జాబితాలో అనర్హులు రావడానికి వీలులేదని తెలిపారు.భూభారతిపై కూడా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.సమీక్ష అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిఖంగా తనిఖీ చేసి వైద్య కేంద్రం ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, ఓపి, మందులు స్టాక్ రిజిస్టర్ ను, ఇతర వివరాలను పరిశీలించారు.చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి , గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్, ఎంపీడీవో, తహసిల్దార్, ఇతర అధికారులు ఎంపీడీవోలు,పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

## అత్యాచారం కేసులో నిందితునికి 21 సంవత్సరాల జైలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేసిన కేసులో నిందితునికి 21 సంవత్సరాల జైలు శిక్ష తోపాటు జరిమాన వేయడం జరిగిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ సందర్భంగా వేస్తూ మాట్లాడుతూ నార్కట్ పల్లి మండల పరిధికి చెందిన వలిగొండ వెంక న్న కట్టంగూర్ మండలానికి చెందిన ఒక మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతి చేసి మోసం చేసిన కేసులో నిందితుడుకి ఏ డి జె 2 కమ్ ఎస్సీ, ఎస్టీ కోర్టు,అత్యాచారం పోక్సో కేసుల ఫాస్ట్ ట్రాక్ కోర్టు యుఎస్ 420,376 అఫ్ ఐపీసీ అండ్ సెక్షన్ 5(1) 6 అఫ్ ఫోక్స 2012 అండర్ సెక్షన్.235(2) సి ఆర్, పి సి ప్రకారం నిందితునికి 21 సంవత్సరాల జైలు తో పాటు జరిమాన విధించడం జరిగిందని తెలిపారు. ఈ కేసులో సరిఅయిన ఆధారాలు సేకరించి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు సమర్పించి నిందితునికి శిక్ష పడే విధంగా చేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్,ఎస్ఐ బి.రంజిత్, సీఐ క్యాస్ట్రో, ప్రస్తుతం శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి,ఎస్ఐ రవీందర్ కట్టంగూర్ పీఎస్, పి పి వేముల రంజిత్ కుమార్, సిడిఓ రువ్వా నాగరాజు, భరోసా లీగల్ ఆఫీసర్ కల్పన, లైజన్ అధికారులు, పి.నరేందర్, ఎన్.మల్లికార్జున్ ల ను ఎస్‌పి అభినందించారు.

## పచ్చదనం పెంపొందించాలి




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పచ్చదనం పెంపొందించడంతో పాటు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి అన్నారు. వన మహోత్సవం 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం స్థానిక సంక్షేమ సంఘం గురుకుల పాఠశాల, కళాశాల ప్రాంగణంలో ఆయన గురుకుల సోసైటీ ఫిఫ్త్ జోన్ జోనల్ ఆఫీసర్ ఎస్. విద్యారాణి మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు కోసం విద్యార్థులు మొక్కలు నాటాలని కోరారు. విద్యార్థులు ఉత్సాహం, మొక్కలతో క్యాంపస్ కళకళలాడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జివి విద్యాసాగర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సారు గండ్ల శ్రీనివాస్, టిపివో సోమయ్య, శివప్రసాద్, వసుంధర, ఉప ప్రిన్సిపాల్ బి. యాదయ్య, జి.రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

### జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు

**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఆగస్టు 3న ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరగనున్న పరీక్షకు రెండు కేంద్రాలు శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల అమరావతినగర్, కోదాడలోని సన ఇంజనీరింగ్ కళాశాలలో నీట్ పరీక్ష నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ పి.రాంబాబు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల అమరావతి నగర్‌లో 180 మంది, కోదాడ సన ఇంజనీరింగ్ కళాశాలలో 50 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులను నిశిత తనిఖీ తదుపరి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. ఉదయం 7 గంటల నుండి 8:30 గంటల వరకు అనుమతి ఇస్తారని ఆ తదుపరి అనుమతి ఉండదన్నారు. విద్యుత్ అంతరాయం లేకండా విద్యుత్‌ను సరఫరా చేయాలని విద్యుత్ అధికారులక సూచించారు. పరీక్ష కేంద్రాల్లో అత్యవసరమైన వైద్య సేవలతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. అత్యవసర సేవలకు గానూ అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. అభ్యర్థులకు మంచినీరు అందించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో వ్యర్థాలు లేకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్‌ను అదేశించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి నీట్ పరీక్ష నిర్వహణలో భాగంగా అభ్యర్థులు సిబ్బంది పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, టాబ్స్, బ్లూటూత్, స్మార్ట్‌వాచ్, ఇయన్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ అభరణాలు ధరించవద్దని తెలిపారు. ఎటువంటి మాల్ ప్రాక్టిస్‌కు అవకాశం లేకుండా పకడ్బందిగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 8:30 గంటలలోపు పరీక్ష కేంద్రంగేట్ మూసివేస్తారని గేట్లు మూసిన తర్వాత ఎవ్వరిని లోపలకు అనుమతించమని తెలిపారు. ఎఎస్‌పి రవీందర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ విద్యాభాస్కర్, జిల్లా వైద్యాధికారి పి.చంద్రశేఖర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జయలత, పరీక్ష కేంద్రాల ప్రిన్సిపాల్ ఆర్టీసి డిఎం లక్ష్మి నారాయణ, తహసిల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి పాల్గొన్నారు.





# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## అండమాన్ నికోబార్‌లో ఇడి సోదాలు

### దీవుల్లో తనిఖీలు చేపట్టడం ఇదే మొదటిసారి

**న్యూఢిల్లీ :** మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అండమాన్ నికోబార్ దీవుల్లో సోదాలు నిర్వహించారు. ఈ దీవుల్లో ఇడి తనిఖీలు చేపట్టడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఓ సహకార బ్యాంకు రుణాల వ్యవహారంలో అవకతవకలకు పాల్పడినట్లు స్థానిక కాంగ్రెస్ మాజీ ఎంపి కుల్దీప్‌రాయ్ శర్మ తదితరులపై ఆరోపణలు ఉన్నాయి. మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఇడి అధికారులు పోర్ట్ బ్లెయిర్ పరిసరాల్లోని తొమ్మిది ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. కోల్‌కతాలోనూ తనిఖీలు కొనసాగాయి. అండమాన్ నికోబార్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకు (ఎఎన్‌ఎస్‌సిబి) ద్వారా రుణాలు, ఓవర్ డ్రాఫ్ట్ మంజూరులో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. కొందరు 15 షెల్ సంస్థలుసృష్టించి.. బ్యాంకు నుంచి రూ.200 కోట్లకుపైగా రుణాలను మోసపూరితంగా తీసుకున్నారని వెల్లడించారు. ఈ రుణాల్లో చాలావరకు నగదు రూపంలో ఉపసంహరించుకుని.. గతంలో బ్యాంకు వైస్ ఛైర్మన్‌గా పనిచేసిన కుల్దీప్ రాయ్ శర్మకు, ఇతరులకు ముట్టజెప్పినట్లు పేర్కొన్నారు.

# ‘ఎస్‌ఐఆర్’పై చర్చకే ప్రతిపక్షాలు పట్టు

**తన్యూఢిల్లీ:** పార్లమెంట్ ఉభయసభల్లో గురువారం కూడా ప్రతిపక్ష ఎంపిలు ఆందోళన చేపట్టారు. లోక్‌సభలో బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సహా పలు అంశాలపై చర్చించాలని పట్టుబడుతూ విపక్ష సభ్యులు ఆందోళన నిర్వహించారు. అటు రాజ్యసభలో బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణతో పాటు ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన చర్చకు ప్రధాని మోదీ స్పందించడం లేదంటూ నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. కొందరు సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో ఉభయసభల్లోనూ సాయంత్రం వరకు వాయిదాల పర్వం కొనసాగింది. లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి సమావేశమైన వెం టనే, ప్రతిపక్ష సభ్యులు తమ నిరసనలను కొనసాగించడంతో స్పీకర్ సభను సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేయాల్సి వచ్చింది. కొంతమంది ప్రతిపక్ష సభ్యులు కొన్ని అంశాలను లేవనెత్తడానికి ప్రయత్నిస్తూ సభలో నినాదాలు చేశారు. సభకు అధ్యక్షత వహించిన అవధేష్ ప్రసాద్ సభ్యులను తమ స్థానాల్లో కూర్చోమని కోరారు, కానీ తన విజ్ఞప్తిని ఎవరూ వినకపోవడంతోకార్యకలాపాలను వాయిదా వేశారు. ముందుగా, స్పీకర్ ఓం బిర్లా నిరసన వ్యక్తం చేస్తున్న సభ్యులను నినాదాలు చేయడం మానేసి వారి స్థానాలకు తిరిగి వెళ్లమని కోరారు.అయినా సభ్యులు ఖాతరు చేయకపోవడంతో మ ధ్యాహ్నం 2గంటల వరకు కార్యకలాపాలను వాయిదా వేశారు. ఉదయం సభ ప్రారంభమైన వెంటనే ఇస్రో, నాసా సంయుక్తంగా అభివృద్ధి చేసిన భూమి పరిశీలన ఉపగ్రహాన్ని ప్రయోగించిన జిఎస్‌ఎల్‌వి రాకెట్ విజయవంతమైనందుకు శాస్త్రవేత్తలను సభ అభినందించింది. మరోవైపు రాజ్యసభలో సాయంత్రం నాటికి సభ మూడుసార్లు వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు సమావేశం అయిన వెంటనే, మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది, ఆపై ప్రతిపక్ష ఎంపిల నిరసనల మధ్య మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. మధ్యాహ్నం 2 గంటలకు సభ సమావేశమైన వెంటనే, ప్రతిపక్ష సభ్యులు లేచి నిలబడి ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్రధానమంత్రి సభకు రావాలని డిమాండ్ చేశారు. చైర్మన్ స్థానంలో ఉన్న సస్మిత్ పాత్ర ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గేను మాట్లాడటానికి అనుమతించారు. 2008లో ముంబై ఉగ్రవాద దాడి తర్వాత, అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రాజ్యసభలో జరిగిన చర్చకు సమాధానం ఇవ్వలేదని, అప్పటి హోంమంత్రి ఎగువ సభలో సమాధానం ఇచ్చారని సభా నాయకుడు జెపి నడ్డా ఉదయం సమావేశంలో సభలో చేసిన ప్రకటనను ఖర్గే ఉటంకించారు. అయితే, హోంమంత్రి చేసిన వ్యాఖ్యకు అభ్యంతరం చెప్పానని ఆయన అన్నారు.



### ఎస్ఐఆర్ రద్దు చేయాల్సిందే


బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా సవరణను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీతో సహా ఇండియా కూటమి పార్టీలకు చెందిన పలువురు ఎంపిలు గురువారం వరుసగా ఎనిమిదో రోజు పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో నిరసన తెలిపారు. దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రోజు కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, ఇతర ప్రతిపక్ష ఎంపిలు బీహార్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలిపారు. పార్లమెంట్ మకర ద్వారం మెట్ల వద్ద వరుసలో నిలబడి వరుసగా ఎనిమిదో రోజు నిరసన ప్రదర్శన చేస్తూ ‘ఎస్ఐఆర్ లోక్‌తంత్ర పే వార్’ అని రాసిన భారీ బ్యానర్‌ను ప్రదర్శించారు. ఇసి, ప్రభుత్వం మధ్య కుట్ర జరిగిందని ఆరోపిస్తూ పోస్టర్లతో పాటు ‘ఎస్ఐఆర్‌ను ఆపండి’ వంటి ప్లకార్డులు చేబూని కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జెడి, వామపక్ష పార్టీలతో సహా ప్రతిపక్షాలకు చెందిన పలువురు ఎంపిలు నిరసనలో పాల్గొని నినాదాలు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్‌లో ‘ఓటర్ల ఓటు హక్కును తొలగించడం’ లక్ష్యంగా ఇసి ఈ చర్య చేపట్టిందని ఆరోపిస్తూ, ప్రతిపక్షాలు పార్లమెంటు ఉభయ సభలలో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నాయి. ఈ అంశంపై ఉభయ సభలలో చర్చ జరగాలని వారు డిమాండు చేస్తున్నారు.

### వచ్చే వారం ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీ



ఎస్ఐఆర్ అంశంపై ఇండియా కూటమి పార్టీలు పార్లమెంటు లోపల, వెలుపల తమ నిరసనలను కొనసాగిస్తాయని, వచ్చే వారం ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయానికి ర్యాలీ నిర్వహించే అంశంపై చర్చిస్తున్నాయని వర్గాలు తెలిపాయి. గురువారం ఉదయం జరిగిన ఇండియా కూటమి సమావేశంలో ఈ విషయం చర్చకు వచ్చినట్లు తెలిపాయి. బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ (ఎస్ఐఆర్) అంశం ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశంలో తమకు ప్రాధాన్యతనిస్తుందని ప్రతిపక్ష పార్టీలు అంగీకరించాయని, చర్చకు కూడా డిమాండ్ చేశాయి. ఇండియా కూటమి నాయకులు రానున్న వారంలో ఎన్నికల కమిషన్ కార్యాలయానికి ర్యాలీ చేయాలని నిర్వహించాలని యోచిస్తున్నాయని కూడా వర్గాలు పేర్కొన్నాయి. ఈ సమావేశంలో రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ఎల్ఓపి రాహుల్ గాంధీ, టిఎంసి రాజ్యసభ నాయకుడు డెరెక్ ఓబ్రియన్, డిఎంకె నాయకులు టిఆర్ బాలు, తిరుచి శివ, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు రాంగోపాల్ యాదవ్, ఎన్‌సిపి (ఎస్‌పి)కి చెందిన సుప్రియా సూలే, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్‌కు చెందిన రాజా రామ్ సింగ్, సిపిఐ(ఎం)కి చెందిన జాన్ బ్రిట్టాస్, సిపిఐకి చెందిన పి. సందోష్ కుమార్ పాల్గొన్నారు.

## రెండవభాగంలో సాధారణం కంటే అధిక వర్షపాతం : ఐఎండి



**న్యూఢిల్లీ :** వానాకాలం సీజన్ రెండవ భాగంలో (ఆగస్టు, సెప్టెంబర్) భారతదేశంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) గురువారం తెలిపింది. తూర్పు భా రత దేశంలోనిఈశాన్య,పరిసర ప్రాం తాలుమినహాదేశంలోని చాలా ప్రాంతాలలో ఆగస్టులో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్ర ఆన్‌లైన్ విలేకరులసమావేశంలో తెలిపారు. సెప్టెంబర్‌లోవర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఆయన అన్నారు. రుతుపవనాల మొదటి భాగంలో (జూన్, జులై) భారతదేశంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. కొన్ని రాష్ట్రాలు, ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్ ఆకస్మిక వరదలను ఎదుర్కొంటోంది. మొత్తంమీద, నైరుతి రుతుపవనాల రెండవ భాగంలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం(దీర్ఘకాలికసగటు 422 .8 మిమీలో 106 శాతం) ఎక్కువగా ఉంటుందని మోహపాత్రఅన్నారు. భౌగోళికంగా, ఈశాన్య,పరిసర తూ ర్పు భారతదేశంలోని అనేక ప్రాంతాలు, మధ్య భారతదేశంలోని వివిక్త ప్రాంతాలు, ద్వీపకల్ప ప్రాంతంలోని నైరుతి ప్రాంతాలు మినహా, చాలా ప్రాంతాలలో సాధారణం నుండి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం ఎక్కువగా ఉంటుందని, అక్కడ మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉంటుందని మహపాత్ర చెప్పారు. రానున్న రెండు వారాల్లో వర్షపాతం తగ్గుతుందని అంచనా వేస్తున్నామన్నారు. అయితే, పరిస్థితులు ‘బ్రేక్ మాన్సూ న్ దశ’ ప్రమాణాలకు అనుగుణంగా లేదని, ఇది రుతుపవనాల సమయంలో వర్షపాతం తాత్కాలికంగా తగ్గడాన్ని సూచిస్తుందని, జూన్ 1 నుండి జులై 31 వరకు ద్రోణి హిమాలయాల దిగువ ప్రాంతాల వైపు మారినప్పుడు వర్షపాతంలో తాత్కాలిక విరామం ఉంటుంది. జూన్ 1 నుండి జులై 31 వరకు దేశంలో సాధారణ వర్షపాతం 445.8 మి. మీ.కు బదులుగా 474.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇది ఆరు శాతం మిగులు. దేశంలో 624 అతి భారీ వర్షపాతం ఘటనలు, 76 అతి భారీ వర్షపాతం ఘటనలు నమోదయ్యాయి. ఇది గత ఐదు సంవత్సరాలలోఅత్యల్పగణాంకాలు అని ఐఎండి చీఫ్ చెప్పారు. ఈశాన్య భారతదేశంలో సాధారణం కంటే తక్కువవర్షపాతం నమోదు కావడం ఇది వరుసగా ఐదవ సంవత్సరం. గత 30 సంవత్సరాలుగా ఈశాన్య రాష్ట్రాలలో వర్షపాతం తగ్గుతున్న ధోరణి గమనించామన్నారు.

## ధర్మస్థలలో అవశేషాల గుర్తింపు

**మంగళూరు:** కర్ణాటకలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం ధర్మస్థలలో అనుమానస్పద మరణాలకు సంబంధించిన కేసు దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. శ్రీక్షేత్ర సమీపంలోని అటవీ ప్రాంతంలో కొన్ని శవాలను పూడ్చి పెట్టానని ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు చూపించిన ప్రదేశాల్లో తవ్వకాలు జరుపుతుండగా ఓ చోట గురువారం కొన్ని అవశేషాలను గుర్తించారు. ఇప్పటివరకు ఈ కేసులో బయటపడిన తొలి ఆధారం ఇదే కావడం గమనార్హం. పారిశుద్ధ్య కార్మికుడి ఫిర్యా దు నేపథ్యంలోఅనుమానాస్పద మరణాలపై రాష్ట్ర ప్ర భుత్వం సిట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గత సోమవారం నుంచి సిట్ అధికారులు.. అతడిని వెంట తీసుకెళ్లి దర్యాప్తు చేపట్టారు. నేత్రావతి నది స్నానఘట్టానికి అవతలి వైపు ఉన్న ప్రాంతం నుంచి పరిశోధన ప్రారంభించారు.మృతదేహాలనుపూడ్చిపెట్టినట్లుగా మొత్తం 13 చోట్లను అతడు గుర్తించగా.. ఆ ప్రాంతాల్లో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం ఆరో ప్రాంతంలో మానవ అవశేషాలు బయటపడ్డాయి. వాటిని ఫోరెన్సిక్ బృందం సేకరించి ల్యాబ్‌కు పంపించింది. ల్యాబ్‌లో పరీక్షించిన తర్వాతే వాటి గురించి వివరాలు తెలుస్తాయని సిట్ అధికారులు చెబుతున్నారు.

### మిస్టరీ కేసు..

దక్షిణ కన్నడ జిల్లాలో ధర్మస్థల ప్రముఖ శైవ క్షేత్రం. కర్ణాటక ప్రజలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచీ ఇక్కడికి భారీగా వస్తుంటారు. గతంలో అక్కడ పనిచేసి వెళ్లిపోయిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు.. ఇటీవల సంచలన ఆరోపణలు చేశాడు. 1998 నుంచి 2014 మధ్య ఇక్కడ అనేక మంది మహిళలు, యువతులు హత్యకు గురయ్యారని.. వారి మృతదేహాలను తానే పూడ్చి పెట్టానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అవన్నీ అనుమానాస్పద రీతిలో అదృశ్యమైన వారివని, లైంగిక దాడులకు గురై చనిపోయినట్లు అనుమానాలున్నట్లు పేర్కొనడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. 2014 డిసెంబరులో తమ కుటుంబంలోని ఒక యువతిని కొందరు లైంగికంగా వేధిస్తుండడంతో తాము అజ్ఞాతంలోకి వెళ్లిపోయామని ఆ వ్యక్తి చెప్పినట్లు సమాచారం. మృతదేహాలను ఎవరు ఖననం చేయమన్నారు? వాటిని ఎవరి సహాయంతో తీసుకువెళ్లేవారు? తదితర ప్రశ్నలను సిట్ అధికారులు అడిగి అతడి నుంచి వివరాలు తెలుసుకున్నారు.

## ట్రంప్‌తో మోదీ స్నేహం వట్టి డొల్ల : జైరామ్‌రమేశ్

**న్యూఢిల్లీ:** ట్రంప్ విధించిన 25 శాతం సుంకాలు, రష్యా నుండి దిగుమతులపై అనిర్దేశిత పెనాల్టీలపై పార్లమెంటు ఉభయసభల్లో కేంద్ర వాణిజ్యమంత్రి పీయూశ్ గోయల్ చేసిన ప్రకటనను కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కమ్యూనికేషన్స్ వి భాగం ఇన్‌ఛార్జి జైరామ్ రమేశ్ విమర్శించారు.సమస్యను ఎటూ తేల్చకుండా గోయల్ దాటవేశారనీ,భారత వ్యాపారులు, ఎగుమతిదారుల భావోద్వేగాలు పట్టించుకోలేదని, వారి సమస్యను పరిష్కరించలేదని విమర్శించారు. పార్లమెంటులో సరైన సమాధానం చెప్పకుండా తమ భుజాలు తామే చరుచుకుంటూ స్వోత్కర్ష ప్రదర్శించారని ఎక్స్ వేదికగా పోస్టింగ్ చేశారు. అమెరికాతో భారతదేశం ఇప్పుడు సరికొత్త,భారీ సవాళ్ళను ఎదుర్కొంటోందన్న విషయం చాలా స్పష్టంగా అర్థమైందన్నారు. ఈ సవాళ్ళపై గోయల్ ఎటూతేల్చకుండా దాటవేత ధోరణి ప్రదర్శించారన్నారు. ట్రంప్‌తో తనకున్న చాలా విలువైన వ్యక్తిగత స్నేహంపైనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ పూర్తిగా ఆధారపడ్డారని, అది ఇప్పుడు పూర్తిగా వట్టి డొల్ల అని తేలిపోయిందన్నారు. అసలు వాస్తవానికి భారత ఆర్థిక వ్యవస్థ పెద్దనోట్ల ఉపసంహరణ, మౌలికంగా తప్పుల తడకగా ఉన్న జిఎస్‌టి షాక్స్ నుండి భారత ఆర్థిక వ్యవస్థ తేరుకోలేదన్నారు.భారతదేశ ఆర్థికవృద్ధిరేటు ప్రైవేటు కార్పొరేట్ పెట్టుబడులు, ప్రస్తుత ప్రైవేటు వినియోగ స్థాయిల నుండి ఎంతమాత్రం వేగం పుంజుకుని ముందుకు వెళ్ళలేదని,ఈ రెండు లోపాలకు మోదీ ప్రభుత్వం అనుసరించిన సొంత విధానాలే కారణమనివిమర్శించారు. ట్రంప్ విధించిన టారిఫ్‌ల అంశాన్ని పూర్తిగా తప్పుతోవ పట్టించి తమను తామే అభినందించుకుంటూగొప్పలుచెప్పుకున్నారని విమర్శించారు. ‘‘ట్రంప్ విధించిన సుంకాలపై ఈరోజు మంత్రి గోయల్ ఎలాంటి ప్రకటన చేయలేదు, దాటవేత ధోరణితో వక్రీకరించారు. తమప్రభుత్వం ఏదో సాధించిందని గొప్పలు చెప్పుకున్నారు తప్ప భావోద్వేగాలకుపరిష్కారం చూపించలేదు.

# రైతులు, కార్మికులు, ఎగుమతిదారుల సంక్షేమమే ముఖ్యం

**ట్రంప్ టారిఫ్‌లపై పార్లమెంటులో మంత్రి గోయల్ ప్రకటన**

**జాతీయ ప్రయోజనాల కోసం అన్ని చర్యలూ తీసుకుంటాం**

**ఎలాంటి చిక్కులెదురవుతాయో స్టడీ చేస్తున్నాం**



**న్యూఢిల్లీ:** దేశ ప్రయోజనాల రక్షణకోసం అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని కేంద్ర వాణి జ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ చెప్పా రు. గడువులోపు వాణిజ్య ఒప్పందం చేసుకోని దేశాలపై భారీ సుంకాలు ప్లస్ పెనాల్టీలు విధిస్తామన్న ట్రంప్, భారత్‌పై 25 శాతం సుంకాలు—అనిర్దేశిత పెనాల్టీలు ఆగస్టు 1నుండీ అమలులోకి వస్తాయని ప్రకటించిన మరునాడు గురువారంపార్లమెంటుఉభయసభల్లో పీయూశ్ గోయల్ ఎవరూఅడక్కుండానే స్వయంగా పై ప్రకటన చేశారు. ఇటీవలజరుగుతున్నపరిణామాలవల్ల ఎలాంటి చిక్కులు ఎదురవుతాయన్న విషయాలను ప్రభు త్వం అధ్యయనం చేస్తోందని పీయూశ్ గోయల్ చెప్పారు. జాతి ఆర్థిక ప్రయోజనాలనురక్షించేందుకు,జాతీయ ప్రయో జనాలు ప్రోత్సహించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని లోక్‌సభలో మంత్రి చెప్పారు. అమెరికాకు సరుకులను ఎగుమతి చేసేదేశంలో ఉన్న కంపెనీలు, ఏజంట్లు, సంబంధిత వ్యవస్థలన్నింటితోనూ సంప్రదింపులు చేస్తున్నామని, రైతులు, ఎగుమతిదారులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, పారిశ్రామిక విభాగాలన్నింటితో ఈ టారిఫ్‌ల ప్రభావంపై చర్చిస్తున్నామని, వారి నుండి సమాచారాన్ని సేకరిస్తున్నామని ప్రకటించారు. ‘‘మనదేశ రైతులు, కార్మికులు, ఎగుమతిదారుల సంక్షేమాన్ని ప్రోత్సహించేందుకే ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది, దానికే కేంద్రం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుంది, అన్ని రంగాల భద్రత, అన్ని పారిశ్రామిక విభాగాలు, ఎంఎస్‌ఎంలను కాపాడేందుకు మేం అన్ని చర్యలూ తీసుకుంటాం’’ అని చెప్పారు. న్యాయబద్ధమైన, సమతుల్యమైన, రెండు దేశాలకు ప్రయోజనం కలిగించే వాణిజ్య ఒప్పందం జరగాలనే ఉద్దేశంతో ఈ ఏడాది మార్చిలో రెండు దేశాలు చర్చల్లోకి ప్రవేశించాయని మంత్రి చెప్పారు. కేవలం పది సంవత్సరాల సమయంలోనే భారతదేశం శరవేగంగా ఆర్థికంగా ప్రపంచంలో 11వ స్థానం నుండి ఐదోస్థానానికి ఎదిగిందన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఎంతో ప్రకాశవంతంగా కనిపిస్తోందని అంతర్జాతీయ సంస్థలు, ఆర్థికవేత్తలు ప్రశంసలు కురిపిస్తున్నారని ఆయన చెప్పారు. ప్రపంచ ఆర్థికవృద్ధికి దాదాపు 16 శాతం మేరకు భారతదేశం సాయపడుతోందన్నారు. భారత్—అమెరికా మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు స్తంభించాయన్న వార్తల నడుమ ట్రంప్ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఐతే వ్యవసాయ, పాడిపరిశ్రమ రంగాలకు చెందిన ఉత్పత్తులపై సుంకాల రాయితీలు ఇవ్వాలని, అమెరికా సరుకులకు, కంపెనీలకు భారత్ మార్కెట్లను అందుబాటులోకి తీసుకురావాలని వాణిజ్య చర్చల సందర్భంగా అమెరికా వాణిజ్యబృందం చేసిన కీలక డిమాండ్‌పై స్పందించకుండా భారతదేశ బృందం రైతుల ప్రయోజనాలకు కట్టుబడి కఠినవైఖరి అనుసరించిందని పీయూశ్ గోయల్ పార్లమెంటులో చేసిన ప్రకటనలో ముఖ్యమైన అంశం. భారతదేశం ఇంతవరకూ ఏ ఇతర దేశానికీ వ్యవసాయ, పాడిపరిశ్రమల రంగాలకు చెందిన ఉత్పత్తులపై సుంకాలలో రాయితీలు ఇవ్వలేదు. ఇప్పుడు అమెరికాకు గనుక రాయితీలు ఇస్తే ఇతర దేశాలతో చిక్కులు ఎదురవుతాయన్నది కేంద్ర ప్రభుత్వ వాదనగా ఉంది. ఐతే కార్మికుల శ్రమశక్తి చాలా ఎక్కువగా ఉండే రత్నాలు, మాణిక్యాలు, ఆభరణాలు, వస్త్రాలు, తోలు ఉత్పత్తులు, ప్లాస్టిక్స్, రసాయనాలు, రొయ్యలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటిపళ్ళు వంటి ఇతర ఎగుమతి వస్తువులపై సుంకాల రాయితీలు ఇవ్వాలని భారత్ కూడా అమెరికా ప్రభుత్వాన్ని కోరుతున్నది. దీంతోపాటు ఆటో రంగంలో విడిభాగాలకు కూడా రాయితీలు ఇవ్వాలని అడుగుతోంది. అదేవిధంగా స్టీలు, అల్యూమినియంలపై యాభైశాతం,ఆటోరంగంపై25 శాత ం, రాయితీలను సడలించాలని, అదనపు టారిఫ్‌లను తొలగించాలని భారత్ కోరుతున్నది. ఈ విషయాలపై భారత్—అమెరికా మధ్య ఇప్పటివరకూ ఐదు విడతలుగా వాణిజ్య చర్చలు జరిగాయి.

### బిటిఎ చర్చలు మధ్యలో ఉండగా అర్థాంతరంగా ట్రంప్ నిర్ణయం

ఈ ఏడాది మార్చినెల నుండి రెండు దేశాల మధ్యా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ)పై సంప్రదింపులు జరుగుతున్నాయి. అమెరికా—భారత్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యంలో సరుకులు, సేవలను 2030వ సంవత్సరం నాటికి 500 బిలియన్ డాలర్లు మేరకు పెంచుకోవాలన్నది ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం ఈ ద్వైపాక్షిక వాణిజ్యం 191 బిలియన్ డాలర్లు మేరకే పరిమితమైంది. ఈ విసయాలపై ఇప్పటివరకూ ఐదు విడతల చర్చలు పూర్తయ్యాయి. వాషింగ్టన్‌లో ఐదోవిడత చర్చలు జులై నెలాఖరులోనే భారత్ బృందం పూర్తిచేసుకుని ఢిల్లీకి చేరుకుంది. ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఆరోవిడత చర్చలకోసం ఆగస్టు 25వ తేదీ నుండీ అమెరికా వాణిజ్యమంత్రిత్వశాఖ అధికారులబృందం భారత్‌లో పర్యటించేందుకు కార్యక్రమం ఖరారైంది.నిజానికి ఈ ఏడాది అక్టోబరు—నవంబరు నెలల నాటికి మొదటి దశ బిటిఎ ఒప్పందాన్నిపూర్తిచేయాలనే ఉద్దేశంతో భారత్ ఉంది. ఈ బిటిఎ కు ముందుగా ఒక తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని కూడా రెండు దేశాలు ఎదురుచూస్తున్నాయి. మరో ముఖ్యవిషయం ఏమిటంటే, కొన్ని పారిశ్రామిక వస్తువులపై సుంకాల రాయితీలు ఇవ్వాలని అమెరికా వాణిజ్య బృందం కోరుతున్నది. ఆటోమొబైల్స్ ప్రత్యేకించి విద్యుత్ వాహనాలు, వైన్స్, పెట్రోకెమికల్ ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు, పాడిపరిశ్రమ ఉత్పత్తులు, యాపిల్స్, డ్రై ఫ్రూట్స్, జన్యుపరంగా మార్పులు చేర్పులు చేసిన పంటలపైనా సుంకాల రాయితీలు ఇవ్వాలని అమెరికా కోరుతున్నది. ఈ విధంగా చర్చలు కొనసాగుతున్నదశలో అర్థాంతరంగా ట్రంప్, ఆగస్టు 1వ తేదీ గడువు పేరు చెప్పి భారత్‌పై సుంకాల భారాలు విధించారు. భారతదేశం నుండి అమెరికాకు దిగుమతయ్యే సరుకులపై ఇప్పటివరకూ చాలా తక్కువ టారిఫ్‌లు వసూలు చేస్తున్నామని, కానీ భారత్‌తో అమెరికా చాలా తక్కువ వాణిజ్యం చేసినాగానీ ప్రపంచంలో అందరికంటే చాలా ఎక్కువ టారిఫ్‌లు అమెరికా సరుకులపై వసూలు చేయడం వల్ల తమ దేశ వాణిజ్య లోటు చాలా ఎక్కువగా ఉందని, రెండు దేశాలమధ్య వాణిజ్య సమతౌల్యం లేదని ట్రంప్ వాదిస్తున్నారు. గడువు లోపు ఒప్పందం చేసుకోనందుకు 25 శాత టారిఫ్‌లు, రష్యా నుండి ముడి చమురును, సైనిక పరికరాలను దిగుమతి చేసుకున్నందుకుగాను అనిర్దేశితస్థాయిలో పెనాల్టీలను భారత్‌పై ట్రంప్ విధించారు.

## 2021—-25లో 78 వేల హెక్టార్ల అటవీ భూమి మళ్లింపు

**న్యూఢిల్లీ :** గత నాలుగు సంవత్సరాలలో దేశవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల కోసం 78,100 హెక్టార్లకు పైగా అటవీ భూమిని మళ్లించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కేంద్రం గురువారం రాజ్యసభకు తెలియజేసింది. 2025 ప్రథమార్థంలో12,324.32హెక్టార్ల అటవీ భూమిని మళ్లించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఏప్రిల్ 1, 2021, మార్చి 31, 2025 మధ్య మొత్తం 78,135.84 హెక్టార్లను అటవీయేతర వినియోగానికి ఆమోదించారు. మధ్యప్రదేశ్‌లో త్యధికంగా 17,393.65 హెక్టార్ల అటవీ భూమి ఉండగా, ఒడిశాలో 11,033.08 హెక్టార్లు, అరుణాచల్ ప్రదేశ్ 6561.47, ఉత్తర ప్రదేశ్‌లో 5480.43, ఛత్తీస్‌గఢ్‌లో 4,092.01హెక్టార్ల అటవీభూమి ఉంది. గుజరాత్‌లో 4,959 హెక్టార్ల అటవీ భూమిని మళ్లింపుకు అనుమతి ఇవ్వగా, జార్ఖండ్‌లో 4,431.91 హెక్టార్ల అటవీ భూమిని అటవీయేతర ప్రయోజనాల కోసం మళ్లింపుకు ఆమోదం లభించింది. రాజస్థాన్‌లో 4,180.06 హెక్టార్లు, మహారాష్ట్రలో 3,603.62 హెక్టార్లు, ఉత్తరప్రదేశ్‌లో 5,480.43 మళ్లించారు. ఆంధ్రప్రదేశ్ (1020.63 హెక్టార్లు), కర్ణాటక (1385.38), హిమాచల్ ప్రదేశ్ (1429.84) కూడా అధిక అటవీ అనుమతిఉన్నరాష్ట్రాలలోఉన్నాయి.మణిపూర్‌లో1,720.11హెక్టార్లు, అసోంలో 722.24హెక్టార్లఅటవీఅనుమతి లభించింది. మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, త్రిపురలో కొత్తి మేరకు అటవీ భూమిని వివిధ ప్రాజెక్టుల కోసం మళ్లించారు.ఢిల్లీలో118.59హెక్టార్లు,అండమాన్‌నికోబార్ దీవులు 104.14 హెక్టార్లు, లడాఖ్‌లోహెక్టార్‌కంటే తక్కువ భూమి మళ్లింపుకు ఆమోదం లభించింది.

# స్టార్‌లింక్ శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు

### భారత్‌లో ప్రారంభించడానికి లైసెన్స్ మంజూరు : సింధియా

**న్యూఢిల్లీ :** బిలియనీర్ ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను భారత్‌లో ప్రారంభించడానికి లైసెన్స్ మంజూరు చేశామని కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. స్పెక్ట్రమ్ కేటాయింపు కోసం ఫ్రేమ్‌వర్క్ కూడా సజావుగా అమలులోకి వస్తుందని ప్రకటించారు. దేశంలో మొదటిసెల్యులార్ కాల్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఆ విషయాన్ని తెలిపారు. ‘భారత్‌లో ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించడానికి స్టార్‌లింక్‌కు ఏకీకృత లైసెన్స్ మంజూరు చేశాం. స్పెక్ట్రమ్ కేటాయింపు సహా వివిధ అంశాలపై ఫ్రేమ్‌వర్క్‌లు సిద్ధంగా ఉన్నాయి. సజావుగా అమలులోకి వస్తాయని నిర్ధరిస్తున్నాం‘ అని సింధియా చెప్పారు. గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ డిజిటల్ పరివర్తనలో అసాధారణమైన మార్పును సాధించిందని తెలిపారు. ‘మారుమూల గ్రామాల నుంచి రద్దీగా ఉండే నగరాల వరకు డిజిటల్ యాక్సెస్ పౌరులకు సాధికారత కల్పించింది. విభజనలను తగ్గించింది. సరసమైన, సమ్మిళిత సాంకేతికతలో భారతదేశాన్ని ప్రపంచ నాయకుడిగా మార్చింది మోదీ డిజిటల్ పరివర్తన. దేశంలో టెలిఫోన్ కనెక్షన్లు ఇప్పుడు 1.2 బిలియన్లకు చేరుకున్నాయి. ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్లు దాదాపు 286 శాతం పెరిగి 970 మిలియన్లకు చేరుకున్నాయి’ అని సింధియా తెలిపారు. ‘బ్రాడ్‌బ్యాండ్ వినియోగం 1450 శాతానికి పైగా వృద్ధిని సాధించింది. 2014లో 60 మిలియన్ల నుంచి నేడు 944 మిలియన్లకు పెరిగింది. ముఖ్యంగా మొబైల్ డేటా ధర 96.6 శాతం తగ్గింది. భారత్‌లో జిబి కేవలం రూ.8.9తో సరసమైన డేటాలో లభిస్తుంది. బిఎస్ఎన్ఎల్ పునరుద్ధరణ ఒక పెద్ద ముందడుగు’ అని సింధియా అన్నారు. ‘18 సంవత్సరాలలో మొదటిసారిగా బిఎస్ఎన్ఎల్ 2024—25 ఆర్థిక సంవత్సరంలో వరుసగా రూ.262 కోట్లు, రూ.280 కోట్ల నికర లాభాలను నమోదు చేసింది. వేగవంతమైన 5జి రోల్‌అవుట్ 99.6 శాతం జిల్లాలను కవర్ చేసింది. 4.74 లక్షల 5జి టవర్లు, 300 మిలియన్ల వినియోగదారులను కలిగి ఉంది. ప్రపంచంలోనే అత్యధిక తలసరి 5జి వినియోగం (నెలకు 32 జిబి) భారత్‌దే. 6జి పేటెంట్ దాఖలులో కూడా మొదటి ఆరు దేశాలలో ఒకటి. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం కింద పెట్టుబడులు రూ. 4,305 కోట్లకు చేరుకున్నాయి. దీని ఫలితంగా రూ. 85,391 కోట్ల అమ్మకాలు, 28,000 కంటే ఎక్కువ ఉద్యోగాలు వచ్చాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి దాదాపు మూడు రెట్లు పెరిగి 282 మిలియన్ల డాలర్ల నుంచి 710 మిలియన్ల డాలర్లకు చేరుకుంది‘ అని మంత్రి సింధియా చెప్పారు.

## ఢిల్లీ-లండన్ ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య

### ప్రయాణికుల భద్రత, శ్రేయస్సుకే అధిక ప్రాధాన్యత

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ విమానాశ్రయం నుంచి లండన్ వెళ్లాల్సిన ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో పైలెట్లు నిలిపివేశారు. గురువారం ఢిల్లీ విమానాశ్రయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎఐ 2017 ఎయిరిండియా విమానంలో టెక్నికల్ ఎర్రర్ అనే అనుమానంతో సిబ్బంది నిలిపివేసి, ప్రామాణిక విధానాలను అనుసరించి ముందు జాగ్రత్త తనిఖీలు నిర్వహించారు ’జూలై 31న ఢిల్లీ నుంచి లండన్‌కు వెళ్లాల్సిన విమానంలో సాంకేతిక సమస్య ఉందనే అనుమానం రావడంతో కాక్‌పిట్ సిబ్బంది నిలిపివేశారు. ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలను అనుసరించి ముందు జాగ్రత్త తనిఖీల కోసం విమానాన్ని తిరిగి తీసుకువచ్చారుఋూ అని ఎయిరిండియా ప్రతినిధి తెలిపారు. అలాగే ప్రయాణికులను వీలైనంత త్వరగా లండన్‌కు తరలించేందుకు ప్రత్యామ్నాయ విమానాన్ని సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఆలస్యం వల్ల కలిగే అసౌకర్యాన్ని తగ్గించడానికి ఎయిరిండియా సిబ్బంది ప్రయాణికులకు అన్ని రకాల మద్దతును, సంరక్షణను అందిస్తున్నారని సంస్థ ప్రతినిధి తెలిపారు. ప్రయాణీకుల భద్రత, శ్రేయస్సు తమకు అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ విమానాన్ని వీలైనంత త్వరగా సిద్ధం చేస్తామని తెలిపారు.

ప్రజాపక్షం
శుక్రవారం, 01 ఆగస్టు

# స్పీకరే 'సుప్రీం'

పార్టీ ఫిరాయింపులపై సుప్రీం కోర్టు గురువారం నాడు కీలక ఆదేశాలిచ్చింది. పార్టీ మారిన శాసనసభ్యులపై అనర్హత పిటిషన్‌ల మీద నిర్ణయాధికారం స్పీకర్‌దేనని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని పదవ షెడ్యూలులో ఫిరాయించిన వారిపై అనర్హత విధింపుపై పేర్కొన్న ఆరవ నిబంధనను సమర్థించింది. దీని ప్రకారం అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే అధికారం సంబంధిత చట్ట సభ చైర్మన్ లేదా స్పీకర్‌కు మాత్రమే ఉంటుందని పునరుద్ఘాటించింది. వీరు తీసుకున్న నిర్ణయంపై మాత్రమే న్యాయ సమీక్షకు వీలవుతుందని పేర్కొంది. తెలంగాణకు చెందిన పార్టీ మారిన పది మంది శాసనసభ్యులపైఅనర్హత వేయాలని కోరుతూ బిఆర్‌ఎస్ శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, కె.పి.వివేకానంద్‌లు సుప్రీం కోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్‌ఎల్‌పి)పై గురువారం తీర్పు వచ్చింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్, అగస్టీన్ జార్జ్ మాసీహ్‌ల ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. తమ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎంఎల్‌ఎలపై తక్షణమే అనర్హత వేటు వేయాలని ఎస్‌ఎల్‌పి వేసిన వారు పేర్కొన్నారు. వారు కోరుకున్నది జరగకపోయినా, మూడు నెలల్లోగా వారిపై శాసనసభ స్పీకర్ వద్ద నున్న అనర్హత పిటిషన్‌లను పరిష్కరించాలని మాత్రం అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. పది మందీ ఎలాంటి కారణాలు చూపి జాప్యం చేయవద్దని కూడా స్పష్టం చేసింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు వేటికవే సుప్రీం కోర్టు తమకు అనుకూలంగా తీర్పునిచ్చిందని చెప్పుకుంటున్నప్పటికీ, వాస్తవంలో ఇరు పక్షాలకు ఊరట లభించే అంశాలు అందులో ఉన్నాయి. అనర్హత పిటిషన్‌లపై స్పీకర్‌దే సర్వాధికారమని, ఆయన నిర్ణయం వెలువరించే వరకు న్యాయస్థానాల జోక్యం సాధ్యం కాదని చెప్పడం అధికార పక్షానికి స్వాంతన. అలాగే, అనర్హులుగా ప్రకటించడం తమ చేతిలో లేనప్పటికీ, ఆ పిటిషన్‌లను సాధ్యమైనంత త్వరగా, మూడు నెలల్లో పరిష్కరించాలని స్పీకర్‌కు సూచించడం ప్రతిపక్షానికి ఉపశమనం. ఏదైమైనప్పటికీ, ఈ ఆదేశాల ద్వారా పార్టీ ఫిరాయించిన ఎంఎల్‌ఏలు, ఎంపిలను అనర్హులుగా ప్రకటించే అంశం మరొకసారి చర్చకు వచ్చింది. పార్టీ ఫిరాయింపులనేది నిజంగా అనైతికమే. అయితే, తెలంగాణలో ఫిరాయింపులకు పురుడుపోసి, పెద్ద చేసిన టిఆర్‌ఎస్ / బిఆర్‌ఎస్ ఇప్పుడు తన దాకా వచ్చేసరికి హాహాకారాలు పెడుతున్నది. టిఆర్‌ఎస్ వరుసగా గెలిచిన 2014,2018 ఎన్నికల తరువాత ఇతర పార్టీల నుంచి 41 మంది ఎంఎల్‌ఏలను తమ పార్టీలోకి చేర్చుకుంది. దీనికి ఇతర పార్టీల శాసనమండలి సభ్యులు అదనం. పదేళ్ళలో ఒక దఫాలో శాసనసభలో ప్రతిపక్షాన్ని నామమాత్రం చేసి, రెండవ సారి ప్రతిపక్ష హోదాను కూడా కాంగ్రెస్ నుంచి లాక్కొని ప్రజాస్వామ్యాన్నే మంటగలిపిన వైనం, మొదటి మంత్రివర్గంలోనే ఏకంగా టిడిపి ఎంఎల్‌ఏ తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించిన ఉదంతం తెలంగాణ ప్రజల స్మృతిపథం నుంచి చెరిగిపోలేదు. కాంగ్రెస్ మొదలు సిపిఐ వరకు అన్ని పార్టీలు కూడా ఇందుకు బాధితులే. టిఆర్‌ఎస్ అధికార అత్యాశకు పార్టీలకు పార్టీలే మాయమయ్యాయి. టిడిపి, బిఎస్‌పి, వైసిపి వంటి పార్టీలు కనపడకుండా పోయాయి. ఎంఎల్‌ఎల ఫిరాయింపులకు ప్రోత్సాహమే పదేళ్ళ నిరంకుశ పాలనకు బాటలు వేసింది. అలాంటి పార్టీ ఇప్పుడు తనదాకా వచ్చే సరికి తత్వం బోధపడింది. ఫిరాయింపులు ఎవరు చేసినా ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. కానీ, గడిచిన పదేళ్ళలో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో సగభాగమైన ప్రతిపక్షాన్ని మింగేసి, తమకు అడ్డేలేకుండా వ్యవస్థలన్నిటినీ కబళించిన అధికార పక్షాలను ప్రజలంతా చూస్తున్నారు. తరువాత వచ్చే పార్టీలను కూడా ఫిరాయింపులు చేసుకోకపోతే తమ మనుగడే కష్టమనే భావనలోకి నెట్టేయడమే నేటి తాజా ఫిరాయింపులకు బాటలు వేసిందని చెప్పొచ్చు. రాజ్యాంగంలో ఫిరాయింపులపై అనర్హత విషయంలో స్పష్టమైన నిర్దేశకాలు ఉన్నప్పటికీ, అది అమలు చేయడంలోనే తిరకాసు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చెప్పినట్లు మంచి రాజ్యాంగం, చెడు రాజ్యాంగమని ఉండదని, మంచి పాలకుని చేతిలో చెడు రాజ్యంగమైనా మంచిగానే ఉంటుందని, చెడు పాలకుని చేతిలో మంచి రాజ్యాంగమైన చెడుగా మారుతుందనేది అనర్హత విషయానికి కూడా సరిపోలుతుంది. చట్టంలోని చిన్న చిన్న లొసుగుల ఆధారంగా అధికార పార్టీలు ఫిరాయింపులను అనుకూలంగా మలుచుకోవటం చేస్తున్నాయి. అందుకు స్పీకర్ వ్యవస్థను కూడా ప్రభావితం చేయటం నిస్సందేహం. ముఖ్యంగా కేంద్రంలో బిజెపి అధికారం అనుభవిస్తున్న దశాబ్ద కాలంలో ఫిరాయింపులు ఎన్ని చొక్కాలు మార్చిందో అందరికీ తెలిసిందే. న్యాయస్థానం కేవలం నియమ నిబంధనలు, చట్టాల కోణంలోనే ఈ అంశాన్ని చూస్తుందే తప్ప వాటి వెనుక రాజకీయాలను పరిగణనలోకి తీసుకోవడం సాధ్యం కాదు. అందుకే ఫిరాయింపులపై మార్పు రావాలంటే ఎన్నికల రాజకీయాల సమూల మార్పే శరణ్యం.


# బిసిల చుట్టూ తెలంగాణ రాజకీయం



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

'అసాధ్యమైన సవాళ్ళను అంగీకరించకపోతే మానవాళికి అలాంటివారి గొప్పతనం ఎన్నటికీ తెలిసేది కాదు. అసాధ్యం మాత్రమే మనిషిని అత్యున్నత శిఖరాలకు తీసుకువెళుతుంది. సూపర్ మాన్‌ను చేస్తుంది. పాత ఆలోచనలను, పాము తన కుబుసం విడిచిన విధంగా విడిచి వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు సాగాలి. మీకు ఎటువంటి లక్ష్యం లేకపోతే మీరెక్కడ ఉన్నారో అక్కడే ఉండిపోతారు' అని ప్రసిద్ధ తత్వవేత్త ఫ్రెడరిక్ నీషే అన్నాడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేబట్టినప్పుడు, ఇక తన లక్ష్యం నెరవేరినట్టుగా రిలాక్స్ అయిన దాఖలాలు లేవు. సిఎంగా పరిపాలనపైనా, కాంగ్రెస్ పార్టీపైనా తన ముద్ర వేయడానికి నిరంతరం కసరత్తు చేస్తున్నారు. అధ్యయనం చేస్తున్నారు.పార్టీ హైకమాండ్ పెట్టుకున్న టార్గెట్ 'కులగణన'ను విజయవంతంగా పూర్తి చేసి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకోగలిగారు. తెలంగాణ రాజకీయం తన చుట్టూ తాను తిరుగుతూ బిసిల చుట్టూ తిరుగుతోంది. ఇందుకు కారణం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఆయన ఒక్క సారిగా తెలంగాణ రాజకీయ దిశను బిసిల వైపునకు తిప్పారు. సూటిగా చెప్పవలసివస్తే, తెలంగాణ రాజకీయాలను రేవంత్ అవలీలగా హైజాక్ చేశారు. గడచిన కొన్ని నెలలుగా రాష్ట్రంలోని సమస్యలన్నీ వెనక్కి వెళ్లిపోయాయి. రేవంత్ ఒక ప్రణాళిక ప్రకారమే బిసిల అంశాన్ని ముందుకు నెట్టారు.ఆ అంశం మినహా మరో అంశమేదీ ఇపుడు చర్చల్లో లేదు.పత్రికల్లో, ప్రసార మాధ్యమాల్లో బిసి రిజర్వేషన్లకు సంబంధించిన వార్తలు, వ్యాఖ్యానాలు, విశ్లేషణలు, విమర్శలు తప్ప మిగతా వార్తలకు ప్రాధాన్యం లేకుండా పోయింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ బిసిల అంశమే ఎజండా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖరారు చేసేశారు. మిగతా రాజకీయ పక్షాలన్నీ ఆ ఎజండా కేంద్రంగానే తిరుగుతున్నాయి. ఇది అంత సులభంగా జరిగే పని కాదు. రేవంత్ రెడ్డి కసి, పట్టుదల కారణంగానే జాతీయ స్థాయిలోనూ బిసిల అంశమే ఎజండాగా మారినట్టు పరిణామాలు కనిపిస్తున్నవి. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలవుతాయా, కావా అనే చర్చ పూర్తిగా సాంకేతికమైనది. రాజకీయంగా ఈ వ్యవహారంలో రేవంత్ రెడ్డి పై చేయి సాధించారు. బిఆర్‌ఎస్, బిజెపి వెనుకబడిపోయాయి. దేశ ప్రజల్లో అత్యధిక జనాభా గల వెనుకబడిన కులాల ప్రజలు దశాబ్దాలుగా అన్యాయానికి గురవుతున్నారు. అన్ని రంగాల్లో తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించి పోరాడటంలో కూడా అత్యంత వెనుకబడి పాయారు. అన్యాయానికి గురవుతున్నామనే స్పృహ కూడా సరిగా లేకుండాపోయి పరవంచనకు, పరాయీకరణకు అత్యధికంగా గురవుతున్నారు. ప్రాంతీయస్థాయిలో రెడ్లు, వెలమల పరవంచనకు, జాతీయ స్థాయిలో బ్రాహ్మణ, బనియా పాలకుల నయవంచనకు గురవుతున్నారు. మండల్ ఉద్యమాన్ని, అద్వానీ కమండల్ ఉద్యమంగా మార్చినందున ఈ పాలక కులాల చేతిలో బిసిలు పరాయీకరణ అవుతున్నారు. బిసి నాయకులు పదే పదే ఆ పరవంచకులనే ఎందుకు ఆశ్రయిస్తున్నారు? పరాయీకరణకు ఎందుకు గురవుతున్నారు? సొంత చైతన్యంతో ప్రత్యామ్నాయ సామాజిక రాజకీయ శక్తిగా బిసి శిబిరాన్ని మార్చటంలో ఎందుకు విఫలమవుతున్నారు? అనే ప్రశ్నలు మేధావుల నుంచి వస్తున్నవి.


బిసిల స్వయంకృత వైఫల్యం వల్లనే ఈ పరిస్థితి తలెత్తింది. 1.బిసిలలో బిసి స్పృహ సరిగా లేకపోవటం, 2.బిసి కులాలు ఉమ్మడి బి.సి చైతన్యంతో ఒక తాటిమీదకు రాలేకపోవటం.3.బిసిలలో ఐక్యత లేకపోవటం.ఈ మూడు కారణాలే బిసిల స్వయంకృత వైఫల్యానికి దారితీస్తున్నాయన్న విశ్లేషణలున్నవి. బిసిల మధ్య ఐక్యత సాధించాలంటే ముందుగా వారు తమలో తాము ఉన్న భేద భావాలను పక్కన పెట్టి, పరస్పరం గౌరవించుకోవలసి ఉన్నది. అందరూ ఒకే లక్ష్యం కలిగి ఉండాలి.ఒక సామాజిక సమూహంగా, వారి హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడానికి కలిసి పని చేయాలి. బిసిలు వివిధ కులాలు, మతాలు,ప్రాంతాలకు చెందిన వారు కావచ్చు. కానీ, వారు ఒకే సామాజిక సమూహంగా ఉండాలి. బిసిలు తమ హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడానికి కలిసి పని చేయాలి. ఒక్కొక్కరు తమతమ పని మాత్రమే చేస్తే, అది సాధించలేరు. బిసిలు సమాజంలో మార్పు కోసం పోరాడాలి. వారు తమ హక్కులను సాధించడానికి, వారి పిల్లలకు మంచి భవిష్యత్తును అందించడానికి పోరాడాలి. బిసిలు తమ హక్కుల గురించి, సమాజంలో వారి పాత్ర గురించి అవగాహన పెంచుకోవాలి.వారు తమ హక్కుల గురించి తెలుసుకోవడం ద్వారా, వారు వాటిని సాధించడానికి ప్రయత్నించగలరు.బిసిలు విద్యను ప్రోత్సహించాలి.విద్య ద్వారా, వారు తమ జీవితాలను మెరుగుపరుచుకోవచ్చు. సమాజంలో తమ పాత్రను మరింత సమర్థవంతంగా పోషించగలరు. బిసిలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలి.వారు తమ హక్కుల కోసం పోరాడాలి. వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచుకోవాలి. బిసిలు ప్రభుత్వంతో కలిసి పని చేయాలి.వారు తమ హక్కుల కోసం పోరాడాలి. ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలి. బిసిలు సామాజిక సంస్థలతో సంబంధాలు ఏర్పరచుకోవాలి.వారు సామాజిక సంస్థల ద్వారా తమ హక్కుల కోసం పోరాడవలసి ఉన్నది. 'బిసిలు తలుచుకుంటే బిజెపి పవర్ కట్ అవుతుంది.ఇక ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి కూడా రాజాలదు'' అని ప్రొఫెసర్ కంచ ఐలయ్య ఢిల్లీలోని టల్కటోరా స్టేడియంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన భాగీదారి న్యాయ సమ్మేళనంలో అన్నారు. ఒబిసిలు, దళితులు, ఆదివాసీలకు స్వేచ్ఛను ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి హరించాయని ఐలయ్య ఆరోపించారు.11 ఏండ్ల బిజెపి పాలనలో బిసిలు బానిసలుగా మారారని ప్రధాని మోదీ లాంటి నేతల వల్లే కుల వ్యవస్థ నుంచి ప్రజలు స్వేచ్ఛను పొందలేకపోయారని విమర్శించారు. అణచివేతకు గురైన కింది స్థాయి కులాల దీనస్థితిని భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ చూశారని ఐలయ్య తెలిపారు. రాహుల్ తోనే ఒబిసిలకు స్వేచ్ఛ లభిస్తుందని ఐలయ్య అభిప్రాయపడ్డారు. ఒబిసిలు, దళితులు, ఆదివాసీల కోసం పోరాడుతున్న రాహుల్ మరో మార్టిన్ లూథర్ కింగ్ అని ఆయన అభివర్ణించారు.'కులగణన' రిపోర్టును స్టడీ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీకి కంచ ఐలయ్య వైస్ చైర్మన్‌గా ఉన్నారు. తెలంగాణలో 56 శాతం మంది బిసిలు ఉన్నట్టు ఈ సర్వేలో తేలింది.వాళ్లకు రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వనుంది. ఈ విషయంలో తెలంగాణ ఓబిసిలు విజయం సాధించారు.అయితే, కేవలం 9.9 శాతంగా ఉన్న ఒసిలు మాత్రం 10 శాతం ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పొందుతున్నారు.దేశంలో అత్యధిక ఓటర్లు బిసి కులాల వారే అనే విషయం ప్రతి రాజకీయ నాయకుడికి తెలుసు. కానీ వారికి రాజ్యాధికారం ఇవ్వడానికి మాత్రం అంగీకరించరు.బిసి కుల గణన విషయంలో ప్రజలను మభ్యపెడుతూ తప్పుదోవ పట్టించి వారిని మరిపించి మురిపించే ప్రయత్నం చేయడం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికి బిసి కుల గణన కలగానే మిగిలిపోయింది. స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపునిచ్చిన బిసి కులాలకు రాజ్యాధికారం కలగానే మిగిలిపోయింది.దేశ జనాభాలో 75 శాతం బిసిలు ఉన్నా వారికి సరైన రాజ్యాధికారం లేకపోవడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది.



మన దేశంలో 1931లో తొలిసారిగా జనాభా లెక్కల సేకరణ ప్రారంభమైంది.ఆ సమయంలో మన దేశానికి అన్ని అధికారాలు లేవు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రతి పదేళ్లకోసారి జనాభా గణన చేపట్టాలని అంగీకరించారు. అయితే జనాభా లెక్కల ప్రక్రియ కొనసాగుతుండగా కుల గణన అంశం చర్చకు రాకపోవడం బాధాకరమైన విషయం. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల జనగణన సేకరణ చేపడుతున్నారు తప్పా, 70 యేండ్లు గడిచినా, నేటికీ బిసి కుల గణన చేపట్టడం లేదు. వీరి గణన వివరాలు చేపట్టాలని సుప్రీంకోర్టు, బిసి కమిషన్ ఎన్నోసార్లు చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు జాప్యం చేస్తున్నాయన్నదనేది ఇప్పటికి అంతుచిక్కని ప్రశ్న. బిసి జనగణనను వ్యతిరేకిస్తూ వచ్చిన బిజెపి ఎట్టకేలకు తలవొగింది. 2026 జనాభా లెక్కల సేకరణతో పాటు బిసి జనగణన చేపడతామని మోదీ ప్రకటించింది. అగ్రవర్ణాల ఆధిపత్యంతో అణచివేతకు గురవుతున్న బిసిలంతా ఒకే గొంతుకతో రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని పలు బిసి సంఘాలు సంకేతాలిస్తున్నాయి. రానున్న ఎన్నికల్లో బిసిల సత్తా చాటేందుకు కులాల వారీగా రాజకీయ పోరుబాట పట్టే సంఘాలు ఇప్పటి నుంచే సమావేశమవుతున్నాయి.లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు వచ్చినపుడు మాత్రమే బిసిలకు రాజ్యాధికారం అంశం, బిసి కుల గణన విషయం తెరపైకి వస్తున్నాయి.ఎన్నికల తర్వాత ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్నారు.మళ్ళీ ఐదేండ్ల తర్వాత ఏదో ఒక ఆశ చూపి ఓట్లు దండుకుంటున్నారన్న విమర్శలున్నవి. తెలంగాణలో బిసి రిజర్వేషన్ల వ్యవహారంలో క్రెడిట్ గేమ్ నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆ ఖ్యాతి దక్కకుండా బిజెపి, బిఆర్‌ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది.ఆగస్టు 8 న కరీంనగర్ లో బిసిల భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు మాజీమంత్రి, సీనియర్ బిఆర్‌ఎస్ నాయకుడు తలసాని శ్రీనివాస యాదవ్ ప్రకటించారు.ఈ ప్రకటనకు ముందు ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో సుదీర్ఘంగా చర్చలు జరిపారు.''మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ బిసిలను మోసం చేస్తూ వస్తోంది. బిఆర్‌ఎస్ పార్టీ తరపున త్వరలోనే బిసి ప్రతినిధుల బృందం రాష్ట్రపతిని కలవనుంది. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్‌లకు చట్టబద్ధత కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి.ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చింది. పారదర్శకత లేకుండా కులగణన జరిపి,హడావుడిగా అసెంబ్లీలో ప్రభుత్వం బిల్లును పెట్టింది.రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగానే ఆర్డినెన్స్ తీసుకొస్తామనడం రాజ్యాంగ విరుద్ధం.9వ షెడ్యూల్‌లో చేర్చితేనే చట్టబద్ధత లభిస్తుందని అసెంబ్లీలో మా పార్టీ స్పష్టం చేసింది'' అని తలసాని చెప్పారు. మరోవైపు 'తెలంగాణ జాగృతి'అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ కవిత తన పోరాట కార్యాచరణను విడిగా ప్రకటించారు. ఆమెకు బిఆర్‌ఎస్‌కు మధ్య సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి.''25 వేల మంది బిసిలు ప్రజాప్రతినిధులు అయ్యే వరకు తెలంగాణ జాగృతి పోరాడుతుంది.బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే రాజకీయ అవకాశాలు దక్కని కులాలకు సబ్ కోటా ఇవ్వాలి.వార్డు మెంబర్ నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ వరకు 25 వేల మంది బిసి బిడ్డలకు రాజకీయ పదవులు దక్కితే అందులో సగం పదవులు ఆడ బిడ్డలకు వస్తాయి.బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలి.''అని ఆమె చెప్పారు. కాగా కాంగ్రెస్ పార్టీ తమ బిసి ఎజండాతో ఈనెల 5,6 తేదీల్లో ఢిల్లీలో ఆందోళన కార్యక్రమం ప్రకటించింది. అసెంబ్లీ ఆమోదించిన బిసి రిజర్వేషన్ చట్టాలను రాజ్యాంగం 9వ షెడ్యూల్లో చేర్చటం, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ ఆర్డినెన్స్‌కు క్లియరెన్స్ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచనుంది.

# అమ్మ పాలను మించిన అమృతం లేదు

'తల్లికి మించిన దైవం లేదు. అమ్మ పాలకు మించిన అమృతం లేదు.' నవమాసాలు గర్భంలో ఉండి, అమ్మ నుండి అందుకున్న తొలి వరం కమ్మనైన క్షీరం. మన దేశంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయి. ఈ సంవత్సరం థీమ్ 'తల్లిపాలు ఇవ్వడానికి ప్రాధాన్యత ఇవ్వడం. స్థిరమైన మద్దతు వ్యవస్థలను సృష్టించడం.'ఈ థీమ్ తల్లిపాలు ఇవ్వడాన్ని ఆచరణాత్మకంగా, అందరి తల్లులకు అందుబాటులో ఉండేలా చేయడానికి దీర్ఘకాలిక, సమానమైన మద్దతు వ్యవస్థలను ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. 'పిల్లలు ఆరోగ్యవంతులుగా పెరిగి అభివృద్ధి చెందడానికి తల్లిపాలు సరైనవని' ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యుహెచ్ఒ), యునిసెఫ్, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలు సిఫార్సు చేస్తున్నాయి. 'ఆరోగ్యంగా ఉంటే అడవిలోనైనా ఆనందంగా బ్రతికేవచ్చు' అన్నట్లు తల్లి పాలు తాగడం నుండే బిడ్డ ఆరోగ్యం ఆరంభం అవుతుంది. తల్లి పాలివ్వడం అనేది తనకు, తన బిడ్డకు, ప్రపంచానికి తల్లి నుండి లభించే తొలి బహుమతి. ఇది ఎల్లప్పుడూ అందరికీ సులభం కానప్పటికీ ఇది ఎల్లప్పుడూ విలువైనదే. తల్లిపాలు శిశువుకు ప్రకృతి ఇచ్చే సహజ సిద్ధమైన టీకా. ఇవి సహజమైన, పునరుత్పాదక ఆహారం, వ్యర్థాలు, కాలుష్యం లేని వనరు. బిడ్డకు ఈ పాలు ఎంతో శ్రేష్ఠమే కాక, పౌష్టికాహారం కూడా. శిశువుకు తల్లి పాలకు మించిన ఆహారం లేదు, ఉండదు, ఉండబోదు కూడా. ఇవి ప్రోటీన్లు, విటమిన్లు, పిండి పదార్థాలు, కాల్షియం, పొటాషియం, ఖనిజాలు, సూక్ష్మ పోషకాలు అవసరమైన మేరకు పుష్కలంగా ఉండటం వలన పిల్లలు తగినంత బరువు పెరుగుతారు. వీటిలో శక్తివంతమైన ప్రతిరోధకాలు ఉండటం వల్ల అంటువ్యాధులు, వైరల్ ఇన్ఫెక్షన్లు, అలర్జీలు, ఆస్తమా, చెవి సంబంధిత వ్యాధులు, సెప్సిస్, న్యుమోనియా, డయేరియాల నుండి శిశువును కాపాడతాయి. ఇందులో ఉండే ఫ్యాటీ యాసిడ్స్ బిడ్డ మెదడు పెరుగుదలకు దోహదం చేయడం వలన తెలివితేటలు పెరుగుతాయి. అంతేకాదు, అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌యాక్టివిటీ డిజార్డర్‌ని అభివృద్ధి చేసే అవకాశాలను తగ్గించడమే కాక నరాల అభివృద్ధిపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. తల్లిపాలు తేలికగా జీర్ణమవడం వలన మలబద్ధకం సమస్యలు రాకుండా కాపాడతాయి. భవిష్యత్తులో స్థూలకాయం, అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధి రాకుండా ఇవి ఒక రక్షణ కవచంలా పనిచేస్తాయి. 2015–16 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే4 ప్రకారం, 6 నెలల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ప్రత్యేకంగా తల్లిపాలు ఇచ్చే వారు 54.9 శాతం ఉండగా, 2019–21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే5 వచ్చేసరికి అది 63.7 శాతానికి పెరిగింది. ఇందులో గ్రామీణులు 65.1 శాతం, పట్టణవాసులు 59.6 శాతం ఇది ఎంతో శుభపరిణామం. బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లి పాలు ప్రారంభించాలి.




ప్రసవం అయిన వెంటనే మొదటి అరగంట నుండి ఒక గంట వ్యవధిలో తల్లి పాలలో కొలొస్ట్రమ్ ఉంటుంది. ఈ పాలు ఎంత తొందరగా త్రాగించడం మొదలుపెడితే అంత మంచిది. ఇది బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధులనుండి దూరంగా ఉంచుతుంది. శిశువు జీవితంలోని మొదటి నెలలకు అవసరమైన శక్తిని, పోషకాలను తల్లిపాలు అందిస్తాయి. బిడ్డకు ఆరు నెలలు పూర్తయ్యేవరకూ తల్లిపాలు మాత్రమే పట్టాలి. ఈ ఆరు నెలలు చాలా కీలకం. ఆరు నెలల తర్వాత అనువైన కుటుంబ ఆహారాన్ని అదనంగా ప్రారంభించాలి. తల్లిపాలు రెండు సంవత్సరాల వయస్సు వరకు లేదా వీలైనంత కాలం ఇవ్వాలి. తల్లి పాలల్లో ఎనభై శాతం కంటే ఎక్కువ నీరు ఉంటుంది. తల్లి తన బిడ్డకు దాహం వేస్తున్నట్లు అనిపించినప్పుడల్లా పాలివ్వవచ్చు. వేడి వాతావరణంలో కూడా ఆరు నెలల వయస్సు లోపు పిల్లలకు నీరు అవసరం లేదు. ఆరు నెలల తరువాత తల్లి పాలతో పాటు పరిపూర్ణమైన ఆహారాన్ని అందించడం మొదలు పెట్టవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసింది. డాక్టర్ సలహా మేరకు విటమిన్లు, మినరల్స్, సిరప్‌లను ఇవ్వొచ్చు. అదనపు ఆహారంతో పాటు కనీసం రెండేళ్లు తల్లి పాలు పట్టాలి. తలికి, పాలు తాగే బిడ్డకు ఎలాంటి సమస్య రానంత వరకూ, తల్లి మరల గర్భంతో ఉన్నా కూడా బిడ్డకు పాలు ఇవ్వవచ్చు. ఆ తరువాత తల్లీ బిడ్డలకు ఇష్టమైనంతవరకూ తల్లిపాలు పెట్టవచ్చు.

తల్లి పాలు మాత్రమే తాగే పిల్లలు ప్రాణాంతక వ్యాధులతో మరణించే అవకాశం తక్కువ అని అంతర్జాతీయ నివేదికలు చెబుతున్నాయి. ఈ విధంగా తల్లి పాలు కొనసాగించకపోవడం వలన కలిగే నష్టాలపై మన దేశంలో జరిపిన అంతర్జాతీయ అధ్యయనంలో, ప్రతి సంవత్సరం నీళ్ల విరేచనాలు, న్యుమోనియా లతో సుమారు ఒక లక్ష మంది 5 సంవత్సరాలలోపు పిల్లలు మరణిస్తున్నారు. ప్రతి ఏటా 34.7 కోట్ల మంది పిల్లలు నీళ్ల విరోచనాలకు, 0.24 కోట్ల మంది పిల్లలు న్యుమోనియా జబ్బులకు, 40,382 మంది పిల్లలు స్థూలకాయానికి లోనవుతున్నారు. బిడ్డకు పాలివ్వడం వలన తల్లికి కూడా లాభాలున్నాయి. ప్రసవంలో తల్లి బరువు ఎక్కువ పెరుగుతుంది. పాలివ్వడం వలన బరువు తగ్గుతారు. రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, రక్తపోటు, టైప్ 2 మధుమేహం వంటి రోగాలు భవిష్యత్తులో రాకుండా అడ్డుకుంటాయి. ప్రతి ఏటా 7,000 మంది తల్లులు రొమ్ము క్యాన్సర్, 1,700 మంది అండాశయ క్యాన్సర్, 87,000 మంది మధుమేహం బారిన పడుతున్నారు. పిల్లలు పుట్టిన తరువాత తమ శిశువులకు పాలిచ్చే తల్లులు ఎక్కువగా ఉండే దేశం క్రొయేషియా. ఇక్కడ 98 శాతం మంది తల్లులు తమ బిడ్డలకు పాలిస్తున్నారు. ఇంకా రువాండా, చిలీ, బురుండి వంటి దేశాలలో 80 శాతం కంటే ఎక్కువ మంది తల్లులు తమ పిల్లలకు పాలిస్తున్నారు. ప్రకృతి ప్రసాదించిన గాలినే పీల్చుతాం. ప్రకృతి అందించిన నీటినే త్రాగుతాం. వీటికి ప్రత్యామ్నాయంగా ఇంకేమైనా తీసుకోగలమా? అలానే తల్లి పాలకు కూడా ఇంకో ప్రత్యామ్నాయం లేదు. విదేశాల నుండి తీసుకొచ్చిన పాల పొడులు కూడా అమ్మ పాలకు మించిపోవు. తల్లులందరూ బాగా ఆలోచించాలి. పిల్లలకు పెద్దయిన తరువాత ఆస్తులు, అంతస్తులు, డబ్బు ఇవ్వాలనుకుంటారు. కానీ వాటి కంటే పిల్లలకు ఇచ్చే మొదటి ఆస్తి తల్లిపాలే అన్న విషయం గుర్తెరగాలి. కొన్ని పరిస్థితులలో, అనగా ఉద్యోగరీత్యా బయట పనులు చేయడం వలన తల్లులు తమ శిశువుకు పాలు అందివ్వలేరు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారికి ప్రసవానంతర సెలవులు ఇస్తున్నారు. అలానే ప్రైవేటు రంగంలో కూడా కనీసం ఆరు మాసాలు వేతనంతో కూడిన సెలవివ్వాలి. పాలిచ్చే అమ్మ పొలం పనులకు, కూలీ పనులకు ఆ ఆరు మాసాలు వెళ్లకుండా ఇంటిలోని యజమానులు, కుటుంబసభ్యులు సహకరించాలి.

కింజరాపు అమరావతి,
82472 86357

# తొక్కిసలాటలో నలిగిపోతున్న జీవితాలు

హరిద్వార్‌లోని ప్రసిద్ధ మానసా దేవి ఆలయం వద్ద తొక్కిసలాటలో ఆరుగురు భక్తుల ప్రాణాలు పోవడం 28 మంది గాయాలు కావడం దురదృష్టం అనుకోవాలా లేక మానవ తప్పిదంతా భావించాలా? మెట్లపై కరెంట్ షాక్ తగిలిందన్న ప్రచారంతో తోపు లాట తొక్కిసలాటగా మారింది. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ సానుభూతి వ్యక్తపరుస్తూ అందరూ క్షేమముగా ఉండాలని మనసాదేవిని ప్రార్థించడంలో ఆయన హేతుబద్ధత, విజ్ఞతకు కొలమానం. ప్రార్థనా మందిరాలలో ఆధ్యాత్మిక కేంద్రాలలో తొక్కిసలాటలో భక్తులు ఎందుకు ప్రాణాలు కోల్పోతున్నారు?. ఇది మానవ తప్పిదమే కదా? ఎవరి ప్రాణాలు వారే కాపాడుకోవాలి? మనుషులు చేసిన దేవుళ్ళు మాత్రం ఏమిచేస్తారు?. తరతరాల నుండి సంక్రమించిన పద్ధతులు, సంస్కారం 'తాంబూలాలు ఇచ్చాము తన్నుక చావండి' అన్న చందంగా ఉంది. స్మార్ట్ కాలంలో నాగరిక పద్ధతులు అవలంబించాలే కానీ మా పూర్వీకులు పాటించారు మేము పాటిస్తాం అన్న సెంటిమెంట్ ఉండకూడదు. ఇంకెంత కాలం ఈ తొక్కిసలాట ప్రాణాలతో చెలగాటం, వేల మంది ప్రాణాలు పోయినా ఇంకా దర్శనం కొరకు ఎగబడతారా ? దేవుడు సర్వాంతర్యామి అని తెలుసుకదా అక్కడికే పోవడం ఎందుకు కొంచెం ఆలోచించండి పుణ్యం కావాలంటే అనాథలకు, అంగవికలాంగులకు, విధివంచితులకు సహాయం చేసి సంతోషించండి. దానిలోనే దైవత్వం దాగి ఉంది అని తెలుసుకోండి. దర్శనాలు జీవితాన్ని పొడిగించాలి కాని మరింత చిన్నదిగా చెయకుడదు. మేధావులు కొంచమైనా తాత్విక దృష్టితో శాస్త్రీయ దృక్పథంతో మనోభావాలు దెబ్బతినకుండా కులమతాలకు అతీతంగా పునరాలోచించాలి. సినిమా పిచ్చి అభిమానంతో తొక్కిసలాట అవసరమా ?,' భక్తి ఉన్మాదముతో తొక్కుడు బిళ్ళఆట'లా ? మానవత్వం నలిగిపోవాల్సిందేనా ? సినిమా యాక్టర్స్ క్రికెట్ స్టార్స్, బాబాలు, స్వామీజీలు, అందరు విలాసవంతమైన జీవితం తో రాజులా బతుకుతున్నారు. చివరికి ప్రాణాలు పోగొట్టుకునేది గుడ్డిగా నమ్మే భక్తులు, నెత్తిన పెట్టుకునే అభిమానులు మాత్రమే ఇంకెప్పుడు మారే ది యువత హేతుబద్ధంగా అన్ని కోణాలలో దృష్టి మరల్చాలి. అప్పుడే నిప్పులాంటి నిజాలు బయటకు వస్తాయి. తొక్కిసలాట చరిత్ర చూసి అయినా ఉన్నతాధికారులు భద్రతా చర్యలు తీసుకోవాలి. వారి నిర్లక్ష్యానికి అమాయకులు బలి కావద్దు దేవాలయాలలో మోగించే గంటలు మరణమృదంగాలు కాకూడదు 'చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్నటు' దేవుళ్ల పేరు చెప్పి వ్యాపారాలు చేసే వాళ్ళు కోకొల్లలు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలి కాని భక్తి పేర ప్రాణాలమీదికి తెచ్చుకోవడం అవి వివేకమే అవుతుంది. అన్నింటికన్నా మన ప్రాణమే మిన్న అందుకే అన్నారు 'బతికుంటే బలుసాకు తినొచ్చు' అని. రాజకీయ కోణంలో చూస్తే రాష్ట్రాల జనాభా పెరిగితే లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల సంఖ్య కూడా పెరుగుతాయని తద్వారా కేంద్రంలో ఒత్తిడి తీసుకుని వచ్చి అభివృద్ధి కోసం నిధులు రాబట్టవచ్చని పాలకుల అభిప్రాయం. అందుకనే ఎక్కువ మందిని కనాలని యువతను ప్రోత్సహిస్తున్నారు. మరో దిక్కు దేవుళ్ల పుణ్యమా అని తొక్కిసలాటలో జనం ప్రాణాలు కోల్పోతున్నారు. పవిత్రభారత దేశంలో తొక్కిసలాట విజయోత్సవాలు ఎలా జరుపుకుంటున్నాయో ఒక్క సారి చూద్దాం రండి.


- పయాగలో 2013 ఫిబ్రవరి 10న జరిగిన కుంభమేళా సందర్భంగా రైల్వే స్టేషన్‌కు లక్షల మంది రావడంతో 40 మంది చనిపోగా 45 మంది గాయపడ్డారు
- కేరళలోని పల్నాడు లో 2011 జనవరి 14న 100 మంది చని పోయారు.
- రాజస్థాన్ చాముండి దేవి ఆలయంలో 2008 సెప్టెంబర్ 30 రోజున రెండు వందల ఇరవై మంది చనిపోయారు
- మహారాష్ట్రలోని మాందేర్ దేవి ఆలయంలో 25 జనవరి 25న దాదాపు 340 మంది చనిపోయారు
- మహారాష్ట్ర నాసిక్ 2003 ఆగస్టు 39 మంది చనిపోయారు 125 మంది గాయపడ్డారు
- ఆర్‌సిబి జట్టు విజయోత్సవ ర్యాలీ తర్వాత బెంగళూరులోని చిన్నస్వామి క్రికెట్ స్టేడియంలో సన్మాన ఏర్పాటు చేశారు. ఆర్‌సిబి జట్టును చూసేందుకు లక్షల మంది జనం స్టేడియం లోకి దూసుకెళ్లడంతో పదిమంది చనిపోయారు
- జనవరి 8 తేదీన 2025 సంవత్సరంలో తిరుపతిలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం టికెట్ కోసం పోపడగా ఆరుగురు మరణించారు, డజన్ల కొద్ది భక్తులు గాయపడ్డారు
- హైదరాబాద్ సంధ్య థియేటర్‌లో పుష్ప 2 ప్రదర్శితమవుతున్న సమయంలో జరిగిన తొక్కిసలాటలో 35 ఏళ్ల మహిళ మరణించగా ఒక బాలుడు గాయపడ్డాడు

ఇలా చెప్పు కొంటూ పోతే మన భారతీయుడు అనే వాడు క్రమేణా మాయమై పోతున్నాడు. ఈ సందర్భముగా ఒక ఉద్యమం చెలరేగవలసిన అవస రం ఉంది అన్పిస్తుంది . 'తొక్కిసలాట నుండి కాపాడండి. మనుషులను బతికించండి' ('ధక్కా ముక్కీ సే బచావో లో గోంకి జాన్ బచావో'). య హ జ నతా కె దిల్ కి బాత్ హై. సోషల్ మీడియాలో లో కం పోకడ దృశ్యాలు చూస్తుంటే రక్త సంబంధాలు , తోటి మనిషిని ప్రేమించే గుణం. మానవత్వం, నీతి నిజాయితీ మంటకలిసి పోతున్నాయి. మరో వైపు భక్తి పేరిట తొక్కిసలాటలో అసువులు బాస్తున్నారు. ఇది విమర్శ కాదు అవహేళన అసలే కాదు మనిషి మనిషిగా బతుకాలనే ఆరాటం, ఆందోళన కలిగించే విషయం మాత్రమే. అందరు ఆలోచించాల్సిన తరుణం. ఇంకొక వైపు రాజకీయ నాయకులు అధికారం కొరకు కీచులాడు కొంటూ ప్రజా సంక్షేమం గాలికి వదిలిపెట్టారు. ఇకనైనా పరిమితులు మారాలి. ప్రభుత్వం ప్రమాదాలు ముందే పసిగట్టి భద్రతా ఏర్పాట్లు చేయాలి, ప్రజలలో చైతన్యం రావాలి, మూఢనమ్మకాలు వీడాలి, జన సమూహంలోకి ఎగబడవద్దు ఆ దిశ గా అందరం కలసి అడుగులు వేద్దాం . మానవత్వం చిగురులు తొడిగేలా చేద్దాం. సంపూర్ణ జీవితం గడుపుదాం.ఆ రోజులు వస్తాయని ఆశిద్దాం

లేఖ

# ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధికి పలు కారణాలు !

క్యాన్సర్ వ్యాధి అంటేనే భయపడతాం. క్యాన్సర్ వ్యాధికి పూర్తి చికిత్స పద్ధతులు లేవవి కంపించి పోతాం. క్యాన్సర్ వ్యాధుల్లో విస్తృతమైనదిగానే కాకుండా ప్రాణాంతకమైనదిగా ఊపిరితిత్తుల లేదా లంగ్ క్యాన్సర్‌ను గుర్తించారు. తొలుత వ్యాధి లక్షణాలు కనుపించకపోవడంతో అంతిమ దశలో నిర్ధారణ జరిగి ప్రాణాంతక దుస్థితికి చేరుతుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్ పట్ల అవగాహన కొరవడడం, ఆలస్యంగా రోగ నిర్ధారణ జరగడం, నివారణ మార్గాలను ప్రచారం చేయడం, ఈ వ్యాధి పట్ల పలు అపోహలు చక్కర్లు కొట్టడంతో దీని పట్ల సంపూర్ణ కనీస జ్ఞానం కలిపించడానికి ప్రతి ఏట 01 ఆగష్టు రోజున ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినం (వరల్ లంగ్ క్యాన్సర్ డే) పాటించడం 2012 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినం 2025 ఇతివృత్తంగా యునైటెడ్ బై యూనిక్ అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. ఊపిరితిత్తుల కణజాలం అపరిమితంగా, నియంత్రణ కోల్పోయి పెరడంతో గడ్డలు ఏర్పడడాన్ని లంగ్ క్యాన్సర్ అని పిలుస్తూ, ఈ గడ్డలు ఇతర శరీర భాగాలకు వ్యాపించడం కూడా గమనించారు. ప్రపంచవ్యాప్తంగా పలు రకాలైన క్యాన్సర్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వల్లనే అధిక మరణాలు నమోదు అవుతున్నాయి. ఊ పిరితిత్తుల క్యాన్సర్ వ్యాధికి ప్రధాన కారణం స్మోకింగ్ లేదా పొగ తాగడాన్ని గుర్తించారు. ఫస్ట్ హాండ్ లేదా సెకండ్ హాండ్ స్మోకింగ్ లేదా ప్రత్యక్ష, పరోక్షంగా పొగ తాగడంతో పాటు పలు ఇతర కారణాల వల్ల కూడా లంగ్ క్యాన్సర్ రావచ్చు. దీర్ఘకాలం పాటు కలుషి త గాలి పోల్చడం, పని ప్రదేశంలో ఆజ్‌బెస్టాస్/డిజిల్/సిలికా/ఆర్సనిక్/రెడాన్ వాయువులను పీల్చడం, జన్యుపరంగా తల్లి తండ్రుల నుంచి పిల్లలకు సోకడం లాంటి కారణాలతో కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్ రావచ్చు. ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధిగ్రస్థుల్లో దగ్గు, ఛా తి నొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శ్వాస ఆడకపోవ డం, దగ్గినపుడు రక్తం పడడం, అలసిపోవడం, బలహీనత, గొంతు బొంగురు పోవడం లేదా కఠ స్వరం మారడం, మెడ వాపు, ఎముకల నొప్పి, న్యుమోనియా, బ్రాంకైటిస్ లాంటి పలు రోగ లక్షణాలు బయట పడతాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి నిర్ధారణకు ఎక్స్‌రే, సిటీ స్కాన్, పిఇటిసిటీ స్కాన్, బ్రాంకోస్కోపీ, బయాప్సీ, స్పూ టమ్ సైటాలజీ లాంటి పరీక్షలు చేస్తారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స మార్గాల్లో సర్జరీ, కీమోథెరపీ, రేడియోథెరపీ, ఇమ్యూనోథెరపీ, పలు అత్యాధునిక డిజిటల్ టెక్నిక్స్‌ను వినియోగిస్తున్నారు. పొగ తాగడం ప్రధాన కారణంగా గుర్తించబడిన ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి పొగ తాగని వ్యక్తులకు కూడా రావచ్చు. పొగ తాగడమనే దురవాటుకు దూరంగా ఉండడంతో పాటు త్వరగా తొలి దశలోనే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం, కలుషిత గాలి పేల్చకుండా చూసుకోవడం, పని ప్రదేశంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం లాం టి జాగ్రత్తలు తీసుకోవాలి. తొలి దశలో గుర్తించి ఊపిరితిత్తుల క్యా న్సర్ వ్యాధిని చికిత్సతో నయం చేయవచ్చు. వ్యాధి నిర్ధారణ అయి న సందర్భంలో తగిన చికిత్సలు తీసుకోవాలి. క్యాన్సర్ అంటే సత్వ ర మరణం కాదని, క్యాన్సర్‌కు కూడా చికిత్స ఉందని ధైర్యంగా ఎదుర్కొని వైద్యం చేయించుకోవాలి.



## ఓపెన్ టెన్త్ ,ఇంటర్ పరీక్షలకు ఫీజు చెల్లింపు గడువు ఆగస్టు 5

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**తెలంగాణ సార్వత్రిక పాఠశాల సొసైటీ టాస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2025లో నిర్వహించనున్న పదవ,ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఫీజులు ఆగస్టు ఐదు లోపు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చని నిర్మల్ డీఈవో పి.రామారావు,జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ముదారపు పరమేశ్వర్ తెలిపారు.25 రూపాయల అపరాధ రుసుముతో ఆగస్టు 10 వరకు,50 రూపాయల అపరాధ రుసుముతో ఆగస్టు 15 వరకు,తత్కాల్ పద్ధతి కింద ఆగస్టు 18 వరకు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.ఈ పరీక్ష రాసే అభ్యర్థులు తమ ఫీజును మీసేవ ద్వారా గాని,టీజీ ఆన్లైన్ ద్వారా గాని,ఓపెన్ స్కూల్ సొసైటీ వెబ్సైట్ ద్వారా గాని చెల్లించవచ్చని పేర్కొన్నారు.చాలన్ ద్వారా కాని,డిడి ద్వారా గాని ఫీజు చెల్లించినచో అంగీకరించ బడదని తెలియజేశారు.మిగతా వివరాలకు అభ్యర్థులు తమ సమీప టాస్ అధ్యయన కేంద్రాల్లో గాని,జిల్లా టాస్ సమన్వయకర్తను గాని సంప్రదించాలని సూచించారు.

## ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



**ప్రజాపక్షం/భైంసా :**బాసర మండల కేంద్రంలోని రూ.16 లక్షలతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి ఉప కేంద్రాలను నిర్మిస్తామన్నారు.ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని,ఈ క్రమంలో స్థానిక ప్రజలకు మరింత వేగవంతమైన మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## మంత్రి లెటర్ ప్యాడ్‌తో ఫేక్ డ్రామా

### పోతనపల్లిలో భూమి కేటాయింపుపై కలకలం

**ప్రజాపక్షం/భీమారం / మంచిర్యాల:**మంత్రి అనుచరుడిగా పరిచయం చేసుకున్న వ్యక్తి ఫేక్ లెటర్ ప్యాడ్‌తో భూమి కేటాయించేందుకు యత్నం చేయడంతో పోతనపల్లిలో కలకలం రేగింది. మంచిర్యాల జిల్లా భీమారం మండలంలోని ముంపు గ్రామమైన పోతనపల్లిలో ఈ ఘటన గురువారం వెలుగుచూసింది. శ్రీనివాస్ అనే కాంగ్రెస్ కార్యకర్త ఓ మహిళ పేరు మీద మంత్రి లెటర్ ప్యాడ్ తీసుకొచ్చి ఆమెకు రెండు గుంటల భూమి కేటాయించాలంటూ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. అయితే ఈ మహిళకు గ్రామంతో ఎలాంటి సంబంధం లేదని గుర్తించిన స్థానికులు దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ వ్యవహారంపై అనుమానం వచ్చిన గ్రామస్తులు నేరుగా మంత్రిని సంప్రదించగా ఇది తనకు సంబంధం లేని విషయం అని మంత్రి స్పష్టం చేశారు. వెంటనే శ్రీనివాస్ అక్కడి నుంచి పరారయ్యారు.

## రైతు సమస్యల పరిష్కారానికి ఆత్మ కృషి

### పార్టీ కోసం తన పని చేసిన వారికి నామినేటెడ్ పదవులు: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ప్రజాపక్షం/ఖానాపూర్:**కొత్త పద్ధతిలు అవలంబిస్తు వ్యవసాయ అంతర్ పంటలపై రైతులు మొగ్గు చూపాలని,ఆయిల్ వంటి పంటలతో ఎక్కువ లాభాలు వస్తాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టి.పి.సి.సి కార్యదర్శి రాంభూపాల్ పాల్గొన్నారు.గురువారం ఖానాపూర్ మార్కెట కమిటీ కార్యాలయ ఆవరణలో ఖానాపూర్ వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్ని ఆత్మ చైర్మన్ గా గాడ్పు సత్యనారాయణ(తోట సత్యం) ను అగ్రికల్చర్ అధికారిని సూజతచే ప్రమాణ స్వీకారం చేయించారు.అనతరం 20 మంది డైరెక్టర్లను అలాగే 4 గురు ఆత్మ ఉద్యోగులు ఉన్నారు.దీనితో మొత్తం 25 మందిని ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు పండించే పంటలకు అవసరమైన యాంత్రిక పరికరాలను వివిధ సబ్సిడీలపై అందజేస్తున్నా వ్యవసాయ పనిముట్లను అందించేందుకు కార్యవర్గం చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు రైతులకు విషయాలు తెలియజేస్తూ వారికి కష్ట నష్టాలు కలగకుండా రైతులతో మమేకమై ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఆత్మ అధికారులతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్,వైస్ చైర్మన్ మజీద్,మాజీ మున్సిపల్ చైర్మన్‌లు,మాజీ ప్రజా ప్రతినిధులు మండల పట్టణ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు మందమర్రి విద్యార్థులు ఎంపిక



**ప్రజాపక్షం/మందమర్రి:** మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన హైదరాబాద్ కృష్ణవేణి టాలెంట్ హై స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. జూలై 28న లక్షెట్టిపేట్‌లోని మహాత్మా జ్యోతిబాపులే పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో వారు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 300మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 16 జావెలిన్ త్రోలో దురిశెట్టి నిశాంత్, అండర్14 కిడ్స్ జావెలిన్ త్రోతో పాటు హెప్తత్లాన్ విభాగంలో షహబాజ్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. వీరిద్దరూ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సిఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ విద్యార్థులను సన్మానించి, ఆటలతో అభివృద్ధి సాధించవచ్చు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆశిస్తున్నాం అన్నారు. ఆటలతో విద్యార్థులు జీవితం లో ఎదగొచ్చని సూచించారు. కోచ్ రాం వేణును ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాం వేణు, ప్రధానోపాధ్యాయురాలు గుణవతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**జిల్లాలో ప్రస్తుత వానకాలం సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. మోపాల్ మండల కేంద్రంలని సహకార సంఘం ఎరువుల గోడౌన్‌ను కలెక్టర్ తనిఖీ చేసి గిడ్డంగిలో రికార్డులలో పేర్కొన్న విధంగా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. ఎరువుల విక్రయాలను ఈపాస్ ద్వారా నిర్వహిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. స్టాక్ కొంత మిగిలి ఉన్నప్పుడే ఇండెంట్ సమర్పించి ఎరువులను గోడౌన్‌కు తెప్పించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కాగా ఎరువుల నిల్వలతో కూడిన వివరాలను స్టాక్ బోర్డుపై తప్పనరిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామన్నారు. యూరి యా ఇతర ఎరువుల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావల్సిన అవసరం లేదని కలెక్టర్ భరోసా కల్పించారు.

## పత్తి ,పెసర పంటలపై అవగాహన



**ప్రజాపక్షం/రేగోడ్:**రేగోడు మండల కేంద్రంలోని జిగిర్యాల గ్రామంలో పత్తి పెసరి మినుములు సోయ చికుడి పంటల పంటలను పరిశీలించారు అనంతరం వా రు మాట్లాడుతూ నేత్రజాన ఎరువులను సరైన మోతాదు లో వేయాలని లేదంటే పురుగులు ఎక్కువగా అవుతాయాని అన్నారు మొ క్కజొన్న రక్షణ తెల్ల దోమల్‌లకు మందు పిచికారి చేయాలని సూచించా రు తెల దోమల్ మందు పిచికారి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో వ్యసాయగా శాఖ విధికారి మహేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు

# బడి బస్సుల కింద చిన్నారులు ఛిద్రం

ఫిట్‌నెస్ లేని వాహనాలు , అనర్హ డ్రైవర్లు
విద్యార్థుల ప్రాణాలకు
మరింత అపాయం అంటున్న ప్రజలు



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్:**విద్యార్థుల రక్షణ పట్ల పాఠశాలల నిర్లక్ష్యం ఘోరమైన పరిణామాలకు దారితీస్తోంది. నాణ్యమైన విద్య పేరుతో పేరెన్నే పాఠశాలలు బడి బస్సుల నిర్వహణలో మాత్రం ఏ మాత్రం శ్రద్ధ వహించడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని స్కూల్ ఆటో బోల్తాపడి విద్యార్థులు గాయపడిన ఘటన, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం అంబటిపల్లిలో మూడేళ్ల బాలిక స్కూల్ బస్ కింద పడి మృతి చెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ప్రతి ఉదయం స్కూల్ బస్సు స్టార్ట్ అవుతుందంటే తల్లిదండ్రుల గుండెల్లో పిల్లల క్షేమంపై గుబులు మొదలవుతుంది.

**మరణమృదంగంగా బడి బస్సు ప్రయాణం**

చదువుకోటానికి వెళ్తున్న చిన్నారి బస్సు కింద నలిగిపోవడం విషాదం. కాలం చెల్లిన వాహనాలు, ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్న బస్సులు, అనుభవం లేని డ్రైవర్ల వల్ల బడి బస్సులు ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. డ్రైవర్లు మద్యం సేవించి వాహనం నడపడం, బ్రేకుల వంటి కీలక వ్యవస్థలు పనిచేయకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న స్కూల్ యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. చిన్నారుల ప్రాణాలతో చెలగాటమాడే యాజమాన్యాలపై నిఘా పెంచాలని, డ్రైవర్ల ఆరోగ్యం, శిక్షణపై ఎలాంటి దృష్టి లేకుండా నియామకాలు జరపడం ప్రమాదాలకు కారణమవుతుందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

**భద్రత లేని బస్సుల బాధ్యత ఎవరిది?**

తల్లిదండ్రులు బస్సు రుసుము ఆలస్యం లేకుండా చెల్లిస్తున్నా అదే బస్సుల్లో తమ పిల్లల ప్రాణాలు పోతుంటే బాధ్యత ఎవరిది? ప్రతి రోజూ బస్సు స్టార్టయ్యే ముందు డ్రైవర్ మద్యం సేవించాడో లేదో పరీక్షించడం, వాహనానికి ఫిట్‌నెస్ ఉన్నదో లేదో తనిఖీ చేయడం యాజమాన్యం బాధ్యత అయినప్పటికీ ఇలాంటి నిబంధనలు పాటించకపోవడం ప్రమాదాలకు దారి తీస్తుంది. పిల్లల భద్రత విషయంలో విద్యా శాఖ, ఆర్‌టిఏ, ట్రాఫిక్ శాఖలు చురుకుగా వ్యవహరించాలని, ఫిట్‌నెస్ లేని బస్సులు, అనర్హ డ్రైవర్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంగిస్తున్న విద్యా సంస్థలపై ఉక్కుపాదం మోపాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు పసి పిల్లల ప్రాణాలు బలిగొంటున్నబడిబస్సులపై తనిఖీలు చేపట్టి ప్రమాదాల కు చోటు లేకుండా చూడాలని ప్రజలు వేడుకుంటున్నా రు.

## అద్దె గదిలో సైబర్ మోసాల కేంద్రం

నలుగురు అరెస్ట్, పెద్ద ఎత్తున సిమ్‌లు, పరికరాలు స్వాధీనం
మంచిర్యాల డిసిపి ఎ. భాస్కర్



**ప్రజాపక్షం/మంచిర్యాలటౌన్:**మంచిర్యాల జిల్లాజన్నారం ప్రాంతంలో అద్దె గదిని కేంద్రంగా చేసుకుని సైబర్ మోసాలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేశామని, వీరిలో అంతర్జాతీయ నెట్‌వర్క్ ఉన్నట్లు గుర్తించామని మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్ తెలిపారు. జూలై 30న టిజి సియస్‌బి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్, రామగుండం పోలీసుల సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఈ మోసాల కేంద్రం పట్టుబడిందని వెల్లడించారు. జన్నారం రాఘవేంద్ర థియేటర్ సమీపంలోని ఇంటిలో అనుమానాస్పదంగా ఇంటర్నెట్ డివైజులు పనిచేస్తున్నాయని లభించిన సమాచారం మేరకు స్థానిక పోలీస్, సైబర్ క్రైమ్ బృందం, టెలికాం శాఖ అధికారులు కలిసి సోదాలు నిర్వహించగా సైబర్ మోసాలకు పాల్పడుతున్న నింధితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా డిసిపి భాస్కర్ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. దర్యాప్తులో తేలిన వివరాల ప్రకారం, పాలవల్సల సాయి కృష్ణ అలియాస్ జాక్ అనే వ్యక్తి కాంబోడియాలోని రెస్టారెంట్‌లో పని చేస్తున్న బాపయ్య అనే వ్యక్తిని టెలిగ్రామ్, వాట్సాప్ ద్వారా సంప్రదించి జన్నారం ప్రాంతంలో అద్దె గదిని ఏర్పాటు చేయించాడని, ఆ గదిలో సిమ్ ప్యానెల్‌లు, నెట్ కనెక్షన్లు, ల్యాప్‌టాప్, మోడెంలు, ఇన్వర్టర్ వంటి పరికరాలు ఏర్పాటు చేసి మోసాలకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. జాక్ సూచనలతో బాపయ్య, అతని తమ్ముడు మధుకర్, బావ గోట్ల రాజేష్‌తో కలిసి ఈ కేంద్రాన్ని అమర్చినట్లు, అనంతరం ఆన్‌లైన్ బెట్టింగ్‌లలో నష్టపోయిన యాండ్రాపు కామేష్‌ను మోసం ద్వారా వచ్చే డబ్బుల్లో వాటా ఇస్తానని ఆశ చూపించి ఇందులో భాగస్వామిగా మార్చినట్లు వివరించారు. వీరు నకిలీ ఆధార్‌లతో వందల సంఖ్యలో సిమ్ కార్డులు సేకరించి, వాటిని సిం ప్యానల్ ద్వారా వినియోగించి వివిధ దేశాలకు కాల్స్ ట్రాన్స్‌ఫర్ చేసే వ్యవస్థను అమలు చేసినట్లు తెలుస్తోంది. మొత్తం 262 సిమ్ కార్డులు (జియో, ఎయిర్ టెల్, విఐ), డి లింక్ ప్యానెల్‌లు, హెచ్‌పి ల్యాప్‌టాప్, మోడంలు, మొబైళ్లతో పాటు పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై జన్నారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ కేసులో నేషనల్, ఇంటర్నేషనల్ కాల్ లింకులు ఉన్నందున లోతైన విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా చేపట్టిన ఎసిపి ఆర్. ప్రకాష్, సైబర్ క్రైమ్ డిఎస్‌పి వెంకట రమణ రెడ్డి, సిఐ రమణమూర్తి, టెలికాం శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ అలెన్ అనురాగ్, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, ఎస్ఐలు అనూష (జన్నారం), సురేష్ (లక్షెట్టిపేట), తహసీన్‌ఉద్దీన్ (దండేపల్లి)లను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డిసిపి భాస్కర్‌లు అభినందించారు.

## రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ: కలెక్టర్



**ప్రజాపక్షం/తానూర్ :**రేషన్ కార్డ్ జారీ నిరంతర ప్రక్రియని,అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నా రు.గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎమ్మె ల్యే పవార్ రామారావు పటేల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..నూతన రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం వచ్చే నెల నుంచి సన్నబియ్యం అందిచనుందని అన్నారు.రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోని వారుంటే దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.మండలంలో మొత్తం 1853 రేషన్ కార్డులు మంజూరు అయ్యాయన్నారు.అనంతరం ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్‌మాట్లాడుతూ..మండలంలో నిఝరి(బి),మహాలింగి,గ్రామాలలో చిన్న వం తెనల కారణంగా వర్షం వచ్చినప్పుడు ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడం జరుగుతుందని,సంబంధిత ప్రిన్సిపాల్ సెక్రెటరీకు విన్నవించి,నూతన బ్రిడ్జి నిర్మించి సమస్య, తీర్చాలని,మండల కేంద్రంలోని రైతు వేదిక దగ్గరలో ఉన్న ఆరు ఎకరాలో గల ప్లాట్లను రాజకీయాలకు అతీతంగా నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి పట్టాలు ఇప్పించగలరని,కలెక్టర్ ను సభాముఖంగా ఎమ్మెల్యే తెలియజేశారు.గత ప్రభుత్వ పాలనలో పదేళ్ల కాలం నుంచి రేషన్ కార్డులు లేక ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు పేదలకు అర్హులైన వారికి అందేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,ఆర్డిఓ కోమల్ రెడ్డి,డీఎస్ఓ రాజేందర్,తహసీల్దార్ మహేందర్‌నాథ్,ఎంపీడీవో నసురుద్దీన్,మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస రావు,సొసైటీ చైర్మన్ నాగనాథ్,పలు శాఖల అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ రేషన్‌కార్డులు: కలెక్టర్



**ప్రజాపక్షం / జైనూర్ :**అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. గురువారం జైనూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివాహం అయినవారు, పిల్లల పేర్లను నమోదు చేసుకోవాలనుకుంటే మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేయాలని, తహసీల్దార్, సిబ్బంది క్షేత్ర స్థాయిలో విచారించి అర్హులకు కార్డులు మంజూరు చేస్తారని తెలిపారు. జైనూర్ మండలానికి 913 కొత్త రేషన్ కార్డులు, 1,595 మంది పేర్ల నమోదు పూర్తయిందని వివరించారు. సన్న బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో చేయూత పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్ వృద్ధులు ఇబ్బంది పడకుండా తపాలా శాఖ సౌకర్యవంతంగా పింఛన్ పంపిణీ చేయాలని, నీడ, త్రాగునీటి వసతి ఉండేలా చూడాలని, ఎక్కువసేపు వేచిచూడకుండా త్వరగా పంపిణీ చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, తహసీల్దార్ అడా బిర్మావ్, మాకామండల అధికారి లోకేశ్వర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, పౌరసరఫరాల శాఖ అధికారి సాదక్, రెవెన్యూ సిబ్బంది, డిపిఎం శేషరావు, పంచాయతీ కార్యదర్శి, తపాలా సిబ్బంది పాల్గొన్నారుపాల్గొన్నారు.

## మీనాక్షీ నటరాజ్ పాదయాత్ర ఏర్పాట్లు పరిశీలన

### వైద్య ఆర్యోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/సంగారెడ్డి:** ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ ఆందోల్ నియోజకవర్గంలో పాద యాత్ర నే పథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్‌రాజనర్సి ంహ ఆందోల్‌లో పర్యటించారు. జోగిపేటలో ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు ,కార్యకర్తలతో సమావేశమైయారు. మీనాక్షి నటరాజన్ పర్యటన చే పట్టనున్న పాద యాత్ర ,శ్రమదానం ,కార్యకర్తల సమావేశం వంటి కార్యక్రమాలకు సం బందించిన అంశాలపై నాయకులతో చర్చించి పలు సూచనలను ,సలహాలను చేశారు. మండల పరిధిలోని సంగు పేట వద్ద 1న కాంగ్రెస్ పార్టీ జెండాను ఎ గురవేసిన తరువాత పాదయాత్ర ప్రారంభమవుతుందని జోగి పేటలోని పార్టీ కా ర్యాలయం వరకు పాద యాత్ర కొనసాగుతుందన్నారు. దారి పొడువున ఫ్లెక్సీ లు ,ఆర్చీలు ,కమాన్‌లతో పాటు అక్కడక్కడ హైడ్రోజన్ బెలూన్లను ఏర్పాటు చేయాలన్నారు. పాద యాత్రలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు ,నాయకులు ,ప్రజలు స్వచ్ఛందగా తరలిరావాలని ఆయన సూచించారు. ఆగస్టు 1వ తేదిన ఆమె జోగిపేటలోని డాక్టర్ అద్దంకి వీరన్న ఇంట్లో బస చేయనున్న సందర్భంగా ఆ ఇం టిని ఆయన పరిశీలించారు. 2వ తేదిన ఉదయం పట్టణం పలు చోట్లలో శ్రమ దా నం కార్యక్రమం నిర్వహించి మధ్యాహ్నా ం సంగుపేట వద్ద నున్న లక్ష్మి దేవి గార్డెన్స్‌లో కార్యకర్తలతో సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు. మీనాక్షి నటరాజన్ పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కార్యకర్తలకు నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్ ,జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్ జగన్మోహన్ రెడ్డి , మాజీ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్‌లు ,సోసైటీ చైర్మన్ జిఆర్ నరేందర్ రెడ్డి, వైస్‌చైర్మన్ హనుమాండ్లు, నాయకులు ,యూత్ విభాగం నాయకు లులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరే రోగులకు మెరుగైన వైద్య సేవలు :కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం /సంగారెడ్డి:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరే పేషంటకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్య వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కంది మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా? అందరూ విధులకు హాజరయ్యారా. అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను సిబ్బంది హాజరు వివరాలను క్షేత్రస్థాయిలో ఆరోగ్య సర్వే నివేదికల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోజు వచ్చే ఓపి పేషంట్ల సంఖ్య ఇన్‌పేసెంట్, ఔట్ పెషెంటు వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. అలాగే రోగులకు ఇచ్చే మందుల చీటీలను అర్థమయ్యే రీతిలో వ్రాయాలని సూచించారు. ఆసుపత్రిలో ఉన్న బెడ్ల సంఖ్య నెలవారీగా జరిగే డెలివరీల గణంకాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మెడిసిన్స్ అందుబాటులో ఉండేలాచూడాలని మందుల కొరత లేకుండా ముందుగానే సరఫరా చేసుకోవాలన్నారు. వై ద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సమయంలో చికిత్స అందించాలని స్పష్టం గా తెలిపారు. తనిఖీల సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో కూడా కలెక్టర్ మాట్లాడారు. వారికి అందుతున్న వైద్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మంచి వైద్య ం అందించేందుకు ప్రభుత్వ యాంత్రాంగం ని బద్ధతతో పనిచేయాలని ఆమె తెలిపారు. ఈతనిఖీ లో స్థానికవైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నా రు.

## మా భూమిలో అక్రమ నిర్మాణాలు

ఫిర్యాదు చేసినా మొద్దు నిద్రలో అధికారులు



**ప్రజాపక్షం/ఆర్మూర్ :**మాభూమి మాకు దక్కకుంటే చావే శరణ్యం అంటూ కుటు ంబ సభ్యులు కన్నీరయ్యారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్ భవనంలోగురువారం బో ధిగల ప్రశాంత్ విలేకరుల సమావేశం ని ర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెర్కిట్ గ్రామంలో గల సర్వే నెంబరు 202/3 గల ఐదు గుంటల భూమి మా యొక్క తాత 1964 నుండి 2025 వరకు మా ఆధీనంలో ఉంది. మాకు తెలియకుం డా తీగల నర్సారెడ్డి, జాన్కంపేట పద్మరెడ్డి అనే ఇద్దరు ఆక్రమణ చేసి మా భూమిలో నూతన గృహాలు నిర్మిస్తున్నారని, ఇంటి నిర్మాణంపై ఆర్‌డిఒ, తహసీల్దార్ మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాకలి ఐలమ్మ వారసులం అగ్రకులాలు రజకులపై దౌర్జన్యం చేసి భూమిని లాక్కుంటే అడ్డుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కలేదని, స్థానిక ఎమ్మె ల్యే పైడి రాకేష్ రెడ్డికిరాతపూర్వకంగా వి నతి పత్రం అందించినా స్పందించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణ దారులు, ఏంచేసుకుంటారో చేసుకో అధికారులందరు మావోళ్లే నేను అందరిని మేనేజ్ చేసుకుంటా నీతో ఏమి కాదని అంటూ భయబ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రశాంత్ ఆరోపించారు. మా పేదకుటుంబానికి ఐదు గుంటల భూమి ఆ సరే నిలిచిందని బోధిగల ప్రశాంత్ తల్లి కన్నీ రు కార్చారు. అగ్రకులాలు కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఇళ్ళను ప్రభుత్వ అధికారులువెంటనేఆపివేయాలని,తమకుటుంబానికిన్యాయం చేయాలని కోరారు. బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గుండెగాం పునరావాస సమస్యపై మానవ హక్కుల వేదిక జోక్యం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**బైంసా మండలంలోని గడ్డెన్న ప్రాజెక్టు ముంపునకు గురైన గుండెగాం గ్రామం ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పునరావాస సమస్య మ రోసారి తెరపైకి వచ్చింది.ఈ దీర్ఘకాలిక సమస్యపై మా నవ హక్కుల వేదిక కన్వీనర్ సరస్వతి తీవ్ర ఆవేదన వ్య క్తం చేస్తూ,గుండెగాం గ్రామస్తులకు తక్షణమే న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**గత ప్రభుత్వ హామీలు,ప్రస్తుత కష్టాలు..**గత

ప్రభుత్వ హయాంలో గుండెగాం గ్రామానికి పునరావాసం కల్పించేందుకు రూ.100 కోట్ల బడ్జెట్‌ను కేటాయి ంచి హామీ ఇచ్చారని గ్రామస్తులు గుర్తు చేస్తున్నా రు.అయితే,ఆ హామీ నేటికీ కార్యరూపం దాల్చకపోవడ ంతో ప్రజల నిరీక్షణ కొనసాగుతూనే ఉంది.ప్రసుతం గ్రామంలోని పలు కుటుంబాలు ప్రభుత్వం కేటియించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్నాయి.ఇక్కడి కరెం టు అధికారులు విద్యుత్ బిల్లులు వసూలు చేస్తుండటంతో,ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతు న్న ప్రజలకు ఇది అదనపు భారంగా మారింది.వి ద్యుత్ బిల్లుల భారం నుండి తమకు ఉపశమనం కల్పించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

**వర్షాకాలంలో బాధలు వర్ణనాతీతం..**

ముఖ్యంగా వర్షాకాలంలో గుండెగాం ప్రజల కష్టాలు వర్ణనాతీరం,ప్రాథమిక సౌకర్యాలు లేక,భవిష్యత్తుపై అగమ్యగోచరంగా ఉన్న ప్రజల పరిస్థితిని చూసి సరస్వతి తీ వ్ర ఆవేదన వ్యక్తం చేశారు.వారి బాధలు విని నాకు చా లా బాధగా అనిపించింది.వారికి అన్ని విధాలుగా సా యం చేస్తానని మాటి చ్చాను,అని ఆమె తెలిపారు.

## యువ న్యాయవాదులు కోచింగ్‌ను వినియోగించుకోవాలి

ప్రజాపక్షం/ముత్తారం/మంథని : కోచింగ్ ను యువ న్యాయ వాదులు వినియోగించుకోవాలనిమంథని బార్ అసోసియేషన్‌లో టిపిసిసి లీగల్ సెల్ కన్వీనర్ ఎం.వరలక్ష్మి అన్నారు. గురువారం మంథని బార్ అసోసియేషన్‌లో టిపిసిసి లీగల్ సెల్ కన్వీనర్ ఎం.వరలక్ష్మి ఆధ్వర్యంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరీక్ష హాజరు కానున్న యువ న్యాయ వాదులకు ఫ్రీ ఆన్లైన్ గైడెన్స్ కు సంబందించిన పోస్టర్, బ్రోచర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కోచింగ్ ను యువ న్యాయ వాదులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుల కె.వి.ఎల్.ఎన్ హరిబాబు, సింగరేణి సంస్థ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ సి.రమణ్ కుమార్ రెడ్డి, లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ బండ మాధురి, న్యాయవాదులు డి.విజయ్ కుమార్,ఆర్ల నాగరాజు,శశిభూషణ్ కాచె, షభానా, వ్యాస్ కుమార్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహనిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాపక్షం / సారంగాపూర్ : జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం కోనాపూర్ గ్రామంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారులు భూమిపూజ చేస్తున్న స్థలాలను గురువారం మాజీ మంత్రివర్యులు, తాటిపర్తి జీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోకుల జమున రాజిరెడ్డి, రాయికల్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహిందర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ టీచర్, సూపర్‌వైజర్ సస్పెన్షన్

### గంగాధర సిడిపిఒకు షోకాజ్ నోటీసు జారీ

ప్రజాపక్షం/గంగాధర:విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అంగన్‌వాడీ టీచర్, సూపర్ వైజర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చేశారు. గంగాధర సిడిపివో నర్సింగారాణికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. జులై 30న చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం గదిలో ఆట వస్తువులు ఉంచి తాళం వేయడం, పిల్లలు ఉపయోగించిన వాష్ రూంలకు అంగన్‌వాడీ పనివేళల్లో తాళం వేసి ఉంచడం, పిల్లల హాజరు తక్కువగా నమోదవడం, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి కారణాలతో రుక్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.స్వరూపను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యలు నిర్వహించాల్సిన సూపర్‌వైజర్ కె.శశికుమారిని విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం, పర్యవేక్షణ లోపం కారణంగా సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ లోపం కారణంగా గంగాధర ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపివో నర్సింగారాణికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే పర్యవేక్షణ లోపిసతే సంబంధిత అంగన్‌వాడీ టీచర్లు, పర్యవేక్షకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

## హుండీ చోరీ కేసులో మూడేళ్ల జైలు శిక్ష



ప్రజాపక్షం / ధర్మపురి: ఆలయంలోని హుండీని పగుల గొట్టి చోరీకి పాల్పడ్డ నిందితునికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష, వేయి రూపాయల జరిమానా విధిస్తూ ధర్మపురి జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏగి జానకి గురువారం తీర్పునిచ్చారు. ధర్మపురి ఎస్ఐ పులిచెర్ల ఉదయ్ కుమార్ వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని నేరేళ్ల సాంబశివ దేవాలయంలో 4 మార్చి 2025 రోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సీసి కెమెరాలను ధ్వంసం చేసి హుండీని బద్దలు చేసి చోరీకి పాల్పడగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరిపిన ధర్మపురి ఎస్సై ఉదయ్ కుమార్ సిబ్బందితో దొంగతనం చేసిన నిందితుడు ఉబ్బిడి అలియాస్ విబ్బిడి శేఖర్‌ను గుర్తించి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు కానిస్టేబుల్ మహేష్ సాక్షులను ప్రవేశపెట్టగా పిపి రాజేష్ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో నిందితుడు విబ్బిడి శేఖర్‌కు మూడేళ్ల జైలు, వేయి రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి జానకి తీర్పు వెలువరించారు.

## పింఛన్ ఇప్పిస్తానని పుస్తెల తాడు చోరీ



ప్రజాపక్షం / ధర్మపురి : పెన్షన్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి వృద్ధురాలి మెడలో ఉన్న పుస్తెల తాడు ఎత్తుకెళ్లిన సంఘటన ధర్మపురిలో గురువారం పట్టపగలు చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నేరేళ్ల గ్రామానికి చెందిన అయ్యోరి పోశవ్వ అనే వృద్ధురాలు గురువారం ధర్మపురిలోని గోదావరి స్నానానికై నేరేళ్ల వద్ద బస్సు ఎక్కింది. అదే బస్సులో ఉన్న అగంతకుడు ఒంటరిగా బస్సెక్కిన వృద్ధురాలిని గమనించి నేరేళ్ల నుండి ధర్మపురి వరకు ఫాలో అయ్యాడు. ధర్మపురిలో వృద్ధురాలు బస్సు దిగి కూరగాయల మార్కెట్ వరకు కాలినడకన వెళ్లింది. అక్కడి నుండి ఫాలో అవుతున్న మోసగాడు వృద్ధురాలితో మాట కలుపుతూ అవ్వా నీకు పెన్షన్ వస్తుందా, రాకుంటే నేను ఇప్పిస్తాను.. నేను నేరేళ్ల గ్రామ కార్యదర్శిని, నీకు పెన్షన్ వచ్చేలా చేస్తానని మాయమాటలు చెప్పి నమ్మించి నందీ కూడలి పక్కనున్న సందిలోకి తీసుకెళ్లాడు. అవ్వా నీ మెడలో ఉన్న పుస్తెల తాడు ఒక్కసారి తీసివ్వు, అది వేరే ఆమె మెడలో వేసి ఫోటో తీసి తిరిగి ఇస్తాను అని అడగ్గా, మోసగాని మాటలు నమ్మిన వృద్ధురాలు మెడలో ఉన్న పుస్తెల తాడు తీసి ఇచ్చింది. అంతే అక్కడి నుండి జారుకుని మోసగాడు కనిపించకుండా పోయాడు. అరగంట వరకు ఎదురు చూసిన వృద్ధురాలు చివరకు మోసపోయానని గమనించి లబోదిబోమంటూ ఏడుస్తూ జరిగిన సంఘటనపై పోలీసులకు పిర్యాదు చేసింది.

## ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తి చేసుకోవాలి: కలెక్టర్



ప్రజాపక్షం/సిద్దిపేట:ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి అబ్దిదారులకు సూచించారు.గురువారం చిన్నకోడూర్ మండలాన్ని వారు అకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సంధర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.అనంతరం ఎంపిడివో కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రగతిపై ఎంపిడివో జనార్ధన్‌తో సమీక్షించి మండల మొత్తంలో 521 గాను 300 నిర్మాణం ప్రారంభించడం జరిగిందని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న 17 ఇండ్లకు గాను 15 ఇండ్ల నిర్మాణంతో పాటు మిగతా ఇండ్ల నిర్మాణాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని అన్నారు.అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు.సిబ్బందితో మాట్లాడి ఆసుపత్రి ల్యాబ్‌లో ఎలాంటి పరీక్షలు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రోగులతో మట్లాడి ప్రభుత్వా ఆసుపత్రిలోనే వైదద్యం చేయించుకోవాలని అన్నారు.అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తుల డిస్పోజల్ ప్రటతిని పరిశీలించారు.అనంతరం స్థానిక పోస్ట్ ఆఫీస్‌ను సందర్శించి ముఖం గుర్తింపు ద్వారా అందజేస్తున్న పించన్ పద్ధతిని పరిశీలించారు.సాంకేతిక సమస్యల ఇబ్బంది లేకుండా పించన్ దారులకు నిర్ణీత సమయంలో పించన్ అందేలా చర్యలు తీసుకోవాలని పోస్ట్ మాస్టర్‌కు సూచించారు.వీరి వెంట వివిధ శాఖల అధికారులున్నారు.

## సుప్రీంకోర్టు అనర్హత సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం: పల్లా

ప్రజాపక్షం/చేర్యాల: గురువారం సుప్రీంకోర్టులో జరిగిన అనర్హత వేటు విషయమై పార్టీ ఫిరాయించిన పదిమంది ఎమ్మెల్యేలపై కోర్టు మూడు నెలల స్పీకర్ స్పం దించాలని పార్టీ వారిపై వేటు వేయాలని కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు.స్పీకర్ ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని పార్లమెంటరీ వ్యవస్థ కాపాడాలని నేను నిర్ణయం తీసుకుంటారని కోరారు.

# కొత్త రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్



ప్రజాపక్షం/గొల్లపల్లి : గత పది సంవత్సరాల బిఆర్ ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీలను అమలు పరుస్తున్నాడని ప్రస్తుతం కొత్త రేషన్ కార్డు రానివారు ఇబ్బందులు పడవలసిన పనిలేదని, రేషన్ కార్డులలో పేర్లు నమోదు కాని వారు మీ సేవలో లేదంటే ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోవాలని రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు.గురువారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని ముస్కు శ్యామ్ సుందర్ రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మండలానికి సంబంధించి మంజూరైన 1658 కొత్త తెల్ల రేషన్ కార్డులను మంత్రి లక్ష్మ ణ్ కుమార్ , జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌తో కలిసి అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 67 మంది లబ్ధిదారులకు రూ.67లక్షల విలువగల కళ్యాణ ల, షాదీ ముబారక్ చెక్కులు, ముఖ్యమంత్రి సహా య నిధి కింద 65మంది లబ్ధిదారులకు రూ .18 లక్షల 41 వేలు విలువగల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రేషన్ కార్డుల ఊసే లేకుండా పేదోళ్ల పొట్ట కొట్టారన్నారు. రాష్ట్రంలో ఒక్క రేషన్ కార్డు సైతం ఇవ్వకుండా నియంత పరిపాలన కొనసాగించారన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వడమే కాకుండా పేదోడి కడుపు నింపాలన్న సంకల్పంతో ప్రతి మనిషికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేసిన ఘనత సి ఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చే స్తూ ప్రజా సంక్షేమం దిశగా పాలన సాగిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల కోసమే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అని మాయ మాటలు చెప్పి చేతులు దులుపుకున్నారని, కానీ మా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేశామని అన్నారు. ఇంకాఎవరైనా అర్హులు ఉంటే వారికి కూడా తప్పకుండా రెండో దశలో ఇల్లు మంజూరు చేస్తామని అర్హులైన ప్రతి ఒక్కరికి సం క్షేమ పథకాలు అందజేసే హామీ నాది అని అన్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ కొత్తగా పెళ్లి అయిన వారు పిల్లలు పుట్టిన వారు కొత్త రేషన్ కార్డులు కొరకు దరఖాస్తు చేసుకున్న వారందరిలో అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డులు మంజూరు చేశామని నూతన రేషన్ కార్డుల దరఖాస్తు నిరంతర ప్రక్రియ అని, కార్డు లేని వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆర్‌డిఒ మధుసూదన్, డిఎస్‌ఒ జితేందర్ రెడ్డి, తహసీల్దార్ వరందన్, ఆర్‌ఐలు జీవన్, అనూష, ఎంపిడిఒ రామ్ రెడ్డి, ఎంపిఓ సురేష్ రెడ్డి, ఎఎంసి చైర్మన్ బీమా సంతోష్, వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు నిశాంత్‌రెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్‌పార్టీనాయకులుతదితరులుపాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు



ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని, గత పదేళ్లుగా ఎదురుచూస్తున్న రేషన్‌కార్డుల కల నెరవేరుతుందని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్ తెలిపారు. గురువారం జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలోని బుగ్గారం మండలంలో పోచమ్మ ఫంక్షన్‌హాల్‌లో అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌తో కలిసి పంపిణీ చేశారు. అదేవిధంగా 21 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలోని మండల పరిధిలో రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. అలాగే రేషన్‌కార్డు రానివారు కంగారుపడాల్సిన పనిలేదని, రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియని, లేదంటే ప్రజాపాలనలో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ దిశగా చేసిన మరో గొప్ప అడుగు అని పలువురు పేర్కొంటున్నారు. తద్వారా పేద కుటుంబాలు ప్రభుత్వ ప్రోత్సాహక పథకాల నుండి లబ్ధి పొందే అవకాశం కలుగనుందన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూధన్, బిసి వెల్ఫేర్ అధికారి సునీత, డిఎస్‌ఒ జితేంధర్‌రెడ్డి, మండల తహసీల్దార్, ఎంపిడిఒ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం

### జిల్లా సెక్టోరల్ అధికారి సత్యనారాయణ



ప్రజాపక్షం/జగిత్యాల: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా సెక్టోరల్ అధికారి చిప్ప సత్యనారాయణ సూచించారు. గురువారం జగిత్యాల బుగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట కార్మికులు మధ్యాహ్న భోజనంకు సంబంధించిన వంట సిలిండర్ పొయ్యిపైన మాత్రమే వండాలని అన్నారు. వంట సమయంలో శుచి శుభ్రత పాటించాలని అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడగాలని విద్యార్థులకు సూచించారు. మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి, సిఆర్‌పి పురుషోత్తం పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు

### కల్లెడ పిహెచ్‌సిని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ సత్య ప్రసాద్



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రిలో వైద్య సేవలను గురించి నేరుగా పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎన్ని ఓ.పి.లను చూస్తున్నారు అని వైద్యులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం సీజనల్ వ్యాధులు పై అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రం ఆవరణంలో పేషంట్ల గదులలో శుభ్రంగా ఉండేలా చూడాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఓ.పి సేవలు, రికార్డ్స్, ల్యాబ్ రికార్డ్స్, మెడికల్ ఫార్మసి రిజిస్టర్ పరిశీలించి డాక్టర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని చుట్టుపక్కల ఖాళీ ప్లేస్ ఆవరణంలో పిచ్చి మొక్కలు ముళ్ల చెట్లు తొలగించి వెంటనే శానిటేషన్ చేపించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రమోద్ కుమార్, కల్లెడ పిహెచ్ సెంటర్ డాక్టర్ సౌజన్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ నాటికి టిబి పరీక్ష నిర్వహణ లక్ష్యాలు పూర్తి

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : నవంబర్ నాటికి టిబి పరీక్ష నిర్వహణ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాలకుర్తి మండలం బసంత్ నగర్‌లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో ఉన్న వార్డులు, ల్యాబ్‌లను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ టిబి వ్యాధి వచ్చే అవకాశం ఉన్న వల్న రేబుల్ (టిబి వ్యాధి సోకే అవకాశం ఉన్న) జనాభా ను గుర్తించి నవంబర్‌లోపు వారి స్క్రినింగ్, వ్యాధి నిర్ధారణ పరీక్షల నిర్వహణ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్‌సిడి సర్వే ద్వారా గుర్తించిన మధుమేహం, బిపి వ్యాధిగ్రస్తులు మందులు సరిగ్గా వాడుతున్నారో లేదో రెగ్యులర్ ఫాలో అప్ చేయాలని అన్నారు. ల్యాబ్‌లో పరీక్ష ఫలితాలు సకాలంలో అందించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం పెద్దపల్లి శాంతి నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనం వండే కిచెన్ ఏరియా, తరగతి గదులను పరిశీలించారు. పిల్లలకు కనీస విద్యా ప్రమాణాలు అందే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల ఎదుగుదల రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట వైద్య అధికారులు డాక్టర్ సరళి, డాక్టర్ లక్ష్మీ భవానీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నియమాలు పాటించాలి : కలెక్టర్ హైమవతి




ప్రజాపక్షం/సిద్దిపేట: జిల్లాలో వివిధ రోడ్లపై ప్రయాణిస్తున్న ప్రతి వాహనదారుని ప్రాణాలు ముఖ్యమని జిల్లా కలెక్టర్ హైమవతి అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని భద్రత కమిటీ, మత్తు పదార్థాల వినియోగ నివారణకు సంబంధిం చి అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీ కా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రాజీవ్ రహదారి వెంబడి ఆతి ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న కొన్ని బ్లాక్ స్పాట్ లో గుర్తించిన ఎడల వాటికి సంబంధించిన ఎస్టిమేట్ వేసి అన్ని డాక్యుమెంట్లు తయారు చేయాలని సూచించారు. రోడ్డుపై చెట్ల కొమ్మలు అడ్డు వస్తున్నాయని వాటిని తొలగించాలని ఆదేశించారు. జిల్లాలో మత్తు పదార్థాల అక్రమ రవాణా ఆరికట్టడానికి అందరూ అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. వలస కార్మికులు మత్తు పదార్థాలు వాడకుండా అక్రమ రవాణా చేయకుండా తరుచూ పరిశీలించాలని సూచించారు. పాఠశాల, కళాశాల చుట్టూ 100 యాడ్స్ పరిధిలో దుకాణాల్లో పొగాకు, మ త్తు పదార్థాలు విక్రయించినట్లయితే వెంటనే పో లీసు అధికారులకు తెలిపాలని డిఈవోకు సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.

# ఉన్నత విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం

### జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారత బృందం




ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జిల్లా మహిళాభివృది, శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారత బృందం నిర్వహిస్తున్న భేటీ బచావో బేటి పడావో ఆధ్వర్యంలో అంకురం కార్యక్రమంలో భాగంగా గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని సంగంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలోని పిల్లలకి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ సాధికారత కేంద్రం బృందం మాట్లాడుతూ లింగ సమానత్వం, లింగ వివక్షత, మగ పిల్లలకి లింగ సమానత్వం ప్రాముఖ్యత, పని ప్రదేశంలో లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం మరియు పరిష్కార) చట్టం 2013 మానసిక ఆరోగ్యం గురించి, చదువులలో అధిక ఒత్తిడిని ఎలా జయించాలి అనేదాన్ని గురించి ఋతు పరిశుభ్రతపై అవగాహన, భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం గురించి వివరించాలన్నారు. ప్రతి బాలికను చదివించాలని, శ్రద్ధగా చదువుకోవాలని విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమని తెలిపారు. ఆడపిల్లలకి ఉన్నత విద్యా చదివించడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించడం జరిగిందని ఆడపిల్లలపైన వివక్షత, ఆడపిల్లల యొక్క ప్రాముఖ్యత హక్కులు చట్టాలు, మహిళ హక్కులు, రక్షణల గురించి ఆడపిల్లలు భవిష్యత్తులో ఎలా ఎదగాలి, పోక్సో చట్టం, చైల్డ్ హెల్ప్ లైన్ సర్వీసెస్, సఖి అందించే సేవలు, సైబర్ నేరాలు, వాటి వలన కలిగే అనర్థాల నుండి ఎలా బయటపడాలి అని వివరించడం జరిగిందని, సఖి మహిళ హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098,సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930 గురించి వివరించమని, షి టీమ్ నెంబర్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ గురించి చెప్పడం జరిగిందని మహిళ సాధికారత కేంద్రం బృందం తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ రవీందర్, జిల్లా మహిళా సాధికారత కేంద్ర బృందం, జెండర్ స్పెషలిస్ట్ స్వప్న, గౌతమి, షి టీమ్ మెంబర్ పిసి మంజుల,తేజస్ ఫౌండేషన్ మెంబర్ రాధ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ నుంచి కిన్నెర మల్లవ్వ సస్పెన్షన్

### సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ నగరంలోని పద్మనగర్ కు చెందిన కిన్నెర మల్లవ్వను సంవత్సరం పాటు సిపిఐ పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బుధవారం జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం కార్యవర్గ సభ్యుడు బత్తుల బాబు అధ్యక్షతన జరిగిందని, ముఖ్యఅతిధులుగా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి వెంకట స్వామిలు హాజరైనారని పంజాల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా ఆహ్వానిత కార్యవర్గ సభ్యురాలుగా,భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలుగా పని చేస్తున్న కిన్నెర మల్లవ్వ పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి,పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుందనే ఆరోపణలు రావడంతో విచారణ కమిటీ వేయడం జరిగిందని, కమిటి విచారణ చేసి జిల్లా పార్టీకి అందించడంతో రిపోర్టును కార్యవర్గ సమావేశంలో చర్చించి సభ్యుల ఏకాభిప్రాయం మేరకు మల్లవ్వను సంవత్సరం పాటు పార్టీ నుండి సస్పెండ్ చేయడం జరిగిందని శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటి నుండి పార్టీ కార్యకర్తలు, నాయకులు మల్లవ్వను పార్టీ నాయకురాలిగా గుర్తించ వద్దని పార్టీ శ్రేణులకు సూచించారు.

## రేషన్ కార్డులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు చేపట్టారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, అడిషనల్ కలెక్టర్ బిఎస్‌లతతో కలిసి హాజరయ్యారు. అనంతరం లబ్దిదారులకు ఎమ్మెల్యే అదనపు కలెక్టర్ రేషన్ కార్డులను పం పిణీ చేశారు. ఆర్డీవో శ్రీనివాస్, తహశీల్దార్ వర ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, రెవెన్యూ అధికారులు, బిఆర్ఎస్ నాయకులు లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా మున్సిపాలిటీ అభివృద్ధి పనులు

ప్రజాపక్షం / ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి పురపాలక పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు కమిషనర్ ఎం. శ్రీనివాస్ రావు తెలిపారు. రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ చొరవతో పట్టణంలో టియుఎఫ్‌ఐడిసి నిధుల ద్వారా రూ.లు 12.80 కోట్లు మంజూరు కాగా ఇందులో భాగంగా వివిధ వార్డులలో రూ.లు 9కోట్ల 15లక్షలతో సిసి రోడ్లు, సిసి డ్రైనేజీల పనులు ముమ్మరంగా సాగుతున్నాయని కమిషనర్ తెలిపారు. రూ.లు 50లక్షలతో కమలాపూర్ ఇందిరమ్మ కాలనీలో ఆర్చ్, చిల్డ్రన్స్ పార్కు పనులు పూర్తి కాగా, రోడ్ల పనులు జరుగుతున్నాయని అన్నారు. పట్టణంలో తాగునీటి సమస్యలకు ముగింపు పలుకుతూ అమృత్ 2 ద్వారా రూ.లు 23 కోట్లు మంజూరు కాగా 6,7 లక్షల లీటర్ల నీటి సామర్థ్యంతో నిర్మిస్తున్న రెండునీటి ట్యాంకులు 25కిలోమీటర్ల మేర పైపు లైన్ల పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. పట్టణంలో మురుగునీటి శుద్దీకరణ కేంద్రం కోసం 25 కోట్ల 40లక్షలు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. వీటితో పాటు మంత్రి అడ్లూరి ఆదేశాలతో పట్టణంలో జంక్షన్ల అభివృద్ధి, సుందరీకరణ పనులు, సెంట్రల్ డివైడర్, లైటింగ్‌లకై ప్రతిపాదనలు తీసుకుని అంచనాలు తయారు చేస్తున్నట్లు కమిషనర్ శ్రీనివాస్ రావు తెలిపారు.



# క్రీడ

## ప్రీక్వార్టర్స్‌కు ఆయుష్, తరుణ్

మకావు: భారత యువ షట్లర్ ఆయుష్‌శెట్టి, హైదరాబాదీ ఆటగాడు తరుణ్ మన్నెపల్లి మకావు ఓపెన్ బీడబ్ల్యూఎఫ్ సూపర్ 300 టోర్నీలో ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. బుధవారం జరిగిన మొదటి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 31వ ర్యాంకర్ ఆయుష్.. 21–10, 21–11తో హువాంగ్ యు కై (చైనీస్ తైఫీ)పై అలవోక విజయం సాధించాడు. తరుణ్.. 21–19, 21–13తో భారత్‌కే చెందిన మన్‌రాజ్‌ను ఓడించాడు. స్టార్ షట్లర్ లక్ష్య సేన్.. 21–8, 21–14తో జియోన్ (దక్షిణ కొరియా)ను చిత్తుచేశాడు. మరో మ్యాచ్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్.. 21–18, 15–21, 16–21తో ఇండోనేషియా షట్లర్ మర్సిల్లినొ చేతిలో ఓడగా కిరణ్ జార్జి, శంకర్ సుబ్రహ్మణ్యన్, కరుణాకరన్ తొలి రౌండ్‌కే వెనుదిరిగారు. మహిళల సింగిల్స్‌లో రక్షిత రామ్‌రాజ్ ప్రిక్వార్టర్స్‌కు చేరగా ఆకర్షి కశ్యప్, ఉన్నతి హుడా, అన్మోల్ ఖర్బ్, అనుపమ ఉపాధ్యాయ.. మొదటి రౌండ్‌కే ఇంటిబాట పట్టారు.



## భారత్ బాయ్‌కాట్.. ఫైనల్‌కు పాక్!





వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్(డబ్ల్యూసీఎల్) 2025 టోర్నీలో ఇండియా ఛాంపియన్స్ పోరాటం ముగిసింది. అసాధారణ ప్రదర్శనతో సెమీఫైనల్‌కు అర్హత సాధించిన యువరాజ్ సింగ్ సారథ్యంలోని ఇండియా ఛాంపియన్స్.. టేబుల్ టాపర్ అయిన పాకిస్థాన్‌తో ఆడేందుకు నిరాకరించింది. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఎట్టి పరిస్థితుల్లో పాకిస్థాన్‌తో ఆడమని భారత దిగ్గజ ఆటగాళ్లు స్పష్టం చేశారు. దాంతో ఈ మ్యాచ్‌ను రద్దు చేసిన నిర్వాహకులు పాకిస్థాన్ ఛాంపియన్స్ ఫైనల్‌కు వెళ్లినట్లు ప్రకటించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటనను విడుదల చేశారు.




'ప్రపంచంలో సానుకూల మార్పును తీసుకొచ్చే శక్తి క్రీడలకు ఉంటుందని మేం ఎప్పుడూ నమ్ముతాం. అయితే ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించడం కూడా ముఖ్యమే. ఏదైనా మేం ప్రేక్షకుల కోసమే చేస్తాం. సెమీఫైనల్ నుంచి తప్పుకున్న ఇండియా ఛాంపియన్స్ నిర్ణయాన్ని మేం గౌరవిస్తాం. అదే విధంగా పాకిస్థాన్ ఛాంపియన్స్ పట్ల కూడా మాకు అదే స్థాయి గౌరవం ఉంది. అన్ని విషయాలను పరిగణలోకి తీసుకొని ఇండియా ఛాంపియన్స్, పాకిస్థాన్ ఛాంపియన్స్ మధ్య జరగాల్సిన సెమీఫైనల్ మ్యాచ్‌ను రద్దు చేశాం. ఫలితంగా పాకిస్థాన్ ఛాంపియన్స్ ఫైనల్‌కు అర్హత సాధించింది.'అని డబ్ల్యూసీఎల్ తమ ప్రకటనలో పేర్కొంది.మరోవైపు లీగ్ దశలో పాకిస్థాన్‌తో మ్యాచ్ రద్దు చేసుకున్న భారత ఆటగాళ్లు.. సెమీస్‌లో కూడా ఆడమని చెప్పారు. పాక్‌తో ఫైనల్ ఆడాల్సి వచ్చినా ఈ నిర్ణయమే తీసుకునేవాళ్లమని స్పష్టం చేశారు. తమ దేశం కంటే ఏదీ ముఖ్యం కాదన్నారు. 'మేం పాకిస్థాన్‌తో ఆడటం లేదు. మాకు ఎప్పుడైనా సరే దేశం ముఖ్యం. దేశం కోసం ఇలాంటి కఠిన నిర్ణయాలను తీసుకోవడానికి ఏ మాత్రం సంకోచించం. భారత జట్టు సభ్యులుగా మేం ఎప్పుడూ గర్వపడుతూనే ఉంటాం. ఎలాంటి పరిస్థితుల్లోనూ మా దేశ ప్రజలను నిరాశపర్చం. దేశం కోసమే మేం సెమీస్‌కు చేరుకున్న తర్వాత మ్యాచ్‌ను రద్దు చేసుకున్నాం. ఒకవేళ ఫైనల్‌కు చేరి అక్కడ పాక్‌తో ఆడాల్సి వచ్చినా ఇదే నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. మేమంతా ఒకేమాటపై నిలబడతాం.'అని ఇండియా ఛాంపియన్స్‌లోని ఓ ఆటగాడు తెలిపాడు.

**ఆసియా కప్‌లో ఆడుతారా?**

ఇండియా ఛాంపియన్స్ నిర్ణయంతో ఆసియాకప్‌పై తీవ్ర చర్చ జరుగుతుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో యూఏఈ వేదికగా ఆసియా కప్ జరగనుంది. ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో భారత్ ఆడుతుందా? అనే చర్చ జోరుగా సాగుతోంది. తాజాగా భారత సీనియర్ ఆటగాళ్లు పాకిస్థాన్‌తో మ్యాచ్ రద్దు చేసుకోవడంతో బీసీసీఐ కూడా ఇలానే మ్యాచ్‌లను బహిష్కరించాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. దేశం కంటే ఏది ముఖ్యం కాదని సూచిస్తున్నారు. పాక్‌తో మ్యాచ్ ఆడకుంటే భారత్‌కు వచ్చే నష్టం ఏం లేదు, కానీ ఆ జట్టు క్రికెట్ బోర్డు తీవ్రంగా నష్టపోనుంది.




## అయిదో టెస్టు భారత్ ఓపెనర్‌లు 'ఔట్'

**ఓవల్:** ఇంగ్లండ్‌తో జరుగుతున్న అయిదో టెస్టులో.. ఇండియా ఫస్ట్ ఇన్నింగ్స్‌లో తొలి రోజు భోజన విరామ సమయానికి రెండు వికెట్లు కోల్పోయి 72 రన్స్ చేసింది. తొలుత టాస్ గెలిచిన ఇంగ్లండ్.. ఫీల్డింగ్ ఎంచుకున్నది. అయితే ఓపెనర్ జైస్వాల్ కేవలం రెండు రన్స్‌కే నిష్క్రమించాడు. ఆ తర్వాత కేఎల్ రాహుల్ ఔటయ్యాడు. ఇద్దరు ఓపెనర్లను కోల్పోయిన తర్వాత.. ప్రస్తుతం ఇండియా నిలకడగా ఆడుతోంది.

క్రీజ్‌లో కెప్టెన్ గిల్, సాయి సుదర్శన్ ఉన్నారు. ఆ ఇద్దరూ నిలదొక్కుకునే ప్రయత్నం చేశారు. వాస్తవానికి భోజన విరామ సమయానికి కొంచం ముందే ఓవల్ మైదానంలో వర్షం కురిసింది. దీంతో లంచ్ తీసుకున్నారు. భోజన విరామ సమయానికి సాయిసుదర్శన్ 25, గిల్ 15 రన్స్‌తో క్రీజ్‌లో ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్లు క్రిస్ వోక్స్, గస్ అట్కిన్‌సన్ భారత బ్యాటర్లను కట్టడి చేశారు. ఇక జోష్ టంగ్, జేమీ ఓవర్టన్‌లు.. తమ లెన్త్ రాబట్టేందుకు ఇబ్బందిపడ్డారు.

# ఫోకస్


## అనుబంధ పరిశ్రమలపై దృష్టి..





మనది వ్యవసాయ ప్రధాన్యం ఉన్న దేశమైనప్పటికీ, వివిధ కారణాలతో సామాన్య రైతు ఆర్థికంగా ఎదగలేకపోతున్నాడు. వ్యవసాయంలో ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని కేంద్రంలో అధికారానికి రాక ముందు ఎన్నికల హామీ ఇచ్చిన బిజెపి, వరుసగా మూడోసారి పగ్గాలు చేపట్టినప్పటికీ, ఆ దిశగా అడుగులు వేయలేదు. ఈ నేపథ్యంలో, రైతులే ఆదాయ మార్గాలను పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ప్రస్తుత కాలంలో ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. అతివృష్టి, అనావృష్టి కారణంగా విపరీతమైన నష్టం వాటిల్లుతున్నది. నకిలీ విత్తనాలు, చీడపీడల సమస్య ఉండనే ఉంది. ఈ అడ్డంకులను అధిగమిస్తూ, రైతు ఆదాయ వనరులను పెంచుకోవడానికి, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలపై దృష్టి పెట్టకతప్పదు. ఇప్పుడు ఈ పరిశ్రమలను పట్టించుకోవడం లేదనికాదు... కానీ, ఇంతకంటే ఎక్కువగా ఈ పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవాలి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు అంటే వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన ప్రాసెసింగ్, నిల్వ, ప్యాకేజింగ్, రవాణా, మార్కెటింగ్, ఉత్పత్తి ఆధారిత సేవలు, తదితర రంగాలు. ఇవి వ్యవసాయ రంగానికి విలువను జోడించడమే కాకుండా, గ్రామీణ ఉపాధి, ఆదాయ వృద్ధికి కీలకంగా పనిచేస్తాయి.

భారతదేశంలో వ్యవసాయ రంగానికి అనుబంధ పరిశ్రమలు ముఖ్యమైన స్థానం దక్కించుకున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులకు విలువను జోడించడం, రైతులకు అదనపు ఆదాయ మార్గాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు చేరువ కావడం. వంటివి వ్యవసాయ అనుబంధ పరిశ్రమల లక్ష్యాలు. వీటిలో ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు మొదటి స్థానాన్ని ఆక్రమిస్తాయి. ధాన్యం, గోధుమ, మొక్కజొన్న, పప్పులు, నూనె గింజలు మొదలైన వాటిని ప్రాసెస్ చేయడం మొదటిది. పాలు, మాంసం, గుడ్లు, పండ్లు, కూరగాయలు ప్రాసెసింగ్ కూడా ఇదే జాబితాలోకి వస్తుంది. ప్యాకేజ్డ్ ఫుడ్స్, స్నాక్స్, పికిల్స్, జ్యూస్ తయారీ సైతం ఫుడ్ ప్రాసెసింగ్‌లో భాగమే. ప్రాసెసింగ్‌ను వెన్నంటే పాల పరిశ్రమ ఉంటుంది. పాల సేకరణ, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, పెరుగు, వెన్న, చీజ్, గోరుముద్ద, ఐస్‌క్రీమ్ తయారీ ఈ విభాగంలో ఉంటాయి. మన దేశంలో ప్రపంచంలోనే అత్యధిక పాల ఉత్పత్తి చేసే దేశంగా కొనసాగుతున్నది. అనాదిగా వస్తున్న మరో అనుబంధ పరిశ్రమగా పశుపోషణ, పౌల్ట్రీని పేర్కోవచ్చు. పశువుల పెంపకం, పశు ఆహారం తయారీ, గుడ్లు, చికెన్, మటన్ ఉత్పత్తి, పశు ఉత్పత్తుల ప్రాసెసింగ్, మార్కెటింగ్ ఈ పరిశ్రమలో కీలక విభాగాలు.





**చాలా మంది మత్స్య సంపదను వ్యవసాయ అనుబంధ పరిశ్రమగా చూడరు. కానీ, పత్స్య పరిశ్రమ కూడా వ్యవసాయ అనుబంధ పరిశ్రమే. చేపల పెంపకం, ప్రాసెసింగ్, ఎగుమతితోపాటు రొయ్యలు, ఇతర జలజీవుల ఉత్పత్తి ఇందులో కీలకమైన విభాగాలు. దేశ స్థూల ఉత్పత్తిలో మత్స్య సంపద కీలక వాటా కలిగి ఉంది. అదే విధంగా నార పరిశ్రమను కూడా వ్యవసాల అనుబంధ పరిశ్రమగా చూడకపోవడాన్ని చాలా ప్రాంతాల్లో గమనించవచ్చు. నిజానికి ఇది కూడా అత్యంత ప్రభావమంతమైన అనుబంధ పరిశ్రమే. ఇందులో పత్తి, జూట్, కొబ్బరి నార, బనానా ఫైబర్ ప్రాసెసింగ్, వస్త్ర పరిశ్రమలకు ముడి పదార్థాల ఉత్పత్తి ప్రధాన భూమిక పోషిస్తాయి. వ్యసాయానికి అనుబంధంగా తేనె, గుమ్మడికాయ, పూల ఉత్పత్తులను జత చేయవచ్చు. ఇందులో తేనె తయారీ, ప్యాకేజింగ్, మార్కెటింగ్, అదే విధంగా పూల సాగు, ఎగుమతి భాగమై ఉంటాయి.**

### ప్రభుత్వ విధులు

వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదల,సాంకేతిక అభివృద్ధి, యాంత్రీకరణ, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, మార్కెట్ డిమాండ్ పెరుగుదల, ఎగుమతి అవకాశాలు వ్యవసాయ అనుబంధ పరిశ్రమల వృద్ధికి కారణాలు. రైతులకు శిక్షణ, సాంకేతిక సహాయం అందించడం, మార్కెట్ లింకేజెస్, రవాణా సౌకర్యాలు కల్పించడం, ప్రాసెసింగ్ యూనిట్లకు రుణాలు, సబ్సిడీలు ఇవ్వడం, ఎగుమతులను ప్రోత్సహించడం వంటివి ప్రభుత్వ విధులుగా చెప్పుకోవాలి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమల విస్తరణకు సానుకూల వాతావరణం ఉన్నప్పటికీ, ప్రతికూలతలు, సమస్యలు, సవాళ్లు కూడా లేకపోలేదు. మౌలిక వసతుల లోపం (కోల్డ్ స్టోరేజ్, రవాణా), మార్కెట్ సమాచారం లోపం, పెట్టుబడి సమస్యలు, సాంకేతిక పరిజ్ఞానం లోపం, చిన్న రైతులకు ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనలో సమస్యలు వంటివి రైతు లు ఎదుర్కొంటున్న అడ్డంకుల్లో ప్రధానమైనవి. వీటి ని పరిష్కిరంచడానికి, సాంకేతికతను గ్రామీణ స్థా యికి విస్తరించాలి. రైతు ఉత్పత్తిదారుల సంఘా లు, సహకార సంఘాలను బలోపేతం చేయాలి. ప్రభుత్వ,ప్రైవేట్ భాగస్వామ్యాలను పెంచాలి. మార్కెట్ లింకేజెస్ మెరుగుపరచాలి. శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలి. ఇలాంటి చర్యలు తీసుకున్నప్పుడు వ్యవసాయ అనుబంధ పరిశ్రమల భవిష్యత్తు ఉజ్వం గా ఉంటుంది. ఇటీవల కాలంలో విలువ ఆధారిత ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది. ఎగుమతులకు అవకాశాలు విస్తరిస్తున్నాయి. సాంకేతికత, డిజిటలైజేషన్ వల్ల మార్కెట్ లింకేజెస్ మెరుగుపడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, ఆదాయ వృద్ధికి మరింత అవకాశాలు ఉన్నాయి. ఏదిఏమైనా, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు భారతదేశ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంలో, గ్రామీణ అభివృద్ధికి దోహదపడడంలో, రైతులకు విలువను జోడించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. సాంకేతికత, ప్రభుత్వ ప్రోత్సాహం, మార్కెట్ అవకాశాల ద్వారా ఈ రంగం మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి.



# గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ ధ్వజం**

ప్రజాపక్షం/బాన్సువాడ : రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ విమర్శించారు. బుధవారం బాన్సువాడ పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నాలుగో మహాసభలకు పశ్య పద్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత తలసరి ఆదాయం రెట్టింపు అయితే ప్రజల కొనుగోలు శక్తి ఎందుకు పెరగలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. మోదీ పాలనలో సంపద అంతా కార్పొరేట్ శక్తులైన అంబానీ, ఆదానీల వద్దే కేంద్రీకృతం అయిందని, అందుకే పేదల బతుకులు మారలేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతు పెట్టినటువంటి పెట్టుబడికి రెట్టింపు ఖర్చు ఇచ్చినప్పుడే మద్దతు ధర ఇచ్చినట్టు అవుతుందని, దీనిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతులు వ్యవసాయానికి దూరమై ఆహార కొరత ముప్పు ఏర్పడే ప్రమాదం వుందన్నారు. దేశంలో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి, వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న వీరోచిత విప్లవాల చరిత్ర కలిగిన శ్రమ జీవుల పార్టీ సిపిఐ అన్నారు. దశాబ్దాలుగా ప్రజాసమస్యలపై అలుపెరుగని పోరాటాలను సిపిఐ నిర్వహించిందన్నారు. ప్రజా ప్రయోజనాలకే కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల పాటు నిలబడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద బడుగు బలహీన వర్గాలు, కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతున్న సిపిఐని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయవలసిన అవసరముందని, అందుకు పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని పశ్య పద్మ పిలుపు నిచ్చారు. మహాసభలో ప్రజా సమస్యల పరిష్కారానికి చేయాల్సిన ఉద్యమాలపై కార్యచరణ రూపొం దిస్తామని తెలిపారు. స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలు గుర్తించి, వాటిపై పోరాటాలతో పార్టీపట్ల స్థానిక ప్రజల్లో ఆదరణ లభిస్తుందన్నారు. అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దుబాస్ రాములు, దశరథ్, శంకర్, అశోక్ గౌడ్, గంగమని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# నిరాహార దీక్షలకు సిపిఐ మద్దతు

ప్రజాపక్షం/నిజామాబాద్ : మధ్యాహ్న భోజన కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరాహార దీక్షలకు పూర్తి మద్దతు తెలియజేస్తున్నామని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో ధర్నా శిబిరాన్నుద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అరకొర నిధులు ఇవ్వటంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న నిర్వాహకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. జిల్లాలో మ ధ్యాహ్న భోజన కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించడంలో అధికారుల నిరల్క్ష్యం ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజన కార్మికుల వేతన బకాయిలు, బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయులు ఓమయ్య, స్రవంతి, సాయమ్మ, పద్మ, గంగామణి, ప్రమీల, బాబాయి, రమ్య, చిన్నుబాయి, సత్యనారాయణ పాల్గొన్నారు.




# 'మధ్యాహ్న' కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలి



**ఎఐటియుసి డిమాండ్**

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం చెల్లించి సమస్యలు పరిష్కరించకుంటే నిరాహార దీక్షలు, నిరవధిక సమ్మెలు చేపడతామని మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి జగిత్యాల జిల్లా ఇన్‌చార్జ్ వెన్న మహేష్ ఆధ్వర్యంలో గురువారం ఎఒకు, జగిత్యాల జిల్లా విద్యాధికారి రాముకి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు మధ్యాహ్న భోజనం వర్కర్స్‌కు రూ.10 వేల వేతనం చెల్లించి సమస్యలు పరిష్కరించకుంటే ఆగస్టు 6,7 తేదీల్లో జిల్లా కేంద్రాలలో నిరాహార దీక్షలు చేపడతామని, సెప్టెంబర్ 1 నుండి నిరవధిక సమ్మె చేపడతామన్నారు. మెను ప్రకారం ఒక్క విద్యార్థికి రూ.25 లు రూపాయలు ఇవ్వాలి లేదా గ్యాస్, కోడిగుడ్లు నిత్యావసర సరుకులు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. వారి వెంట సంఘం నాయకులు ఎస్.పద్మ, జి.శారద, ఎ.రాధ, కె.సరస్వతి, ఎండి.సంషీర్, దేవదాస్, ఎం.కిరణ్ పాల్గొన్నారు.

**ఆదిలాబాద్ :** మధ్యాహ్న భోజన కార్మికుల రిలే నిరాహార దీక్షలు ఈ నెల 4న నిర్వహించనున్నట్లు ఎఐటియుసి రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో రాములు మాట్లాడుతూ ఎండిఎం కార్మికుల పెండింగ్ బిల్లులు, కోడిగుడ్డు బిల్లులు, జీతాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వం స్పందన లేక పోవడంతో రిలే దీక్షలకు చేపట్టనున్నామన్నారు. కార్మికులందరికి పిఎఫ్, ఇఎస్ఐలతో పాటు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్మికులు లక్ష్మి, రాంబాయి, శ్రీదేవి, పుష్ప, యస్వంత్‌రావు, ఉష పాల్గొన్నారు.




# ఫీజులు విడుదల చేయకపోతే చదువులు సాగేదెలా..?

**ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి**

**చలో కలెక్టరేట్, నగరంలో భారీ ర్యాలీ**

ప్రజాపక్షం/కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం బోధనా రుసుములు, ఉపకార వేతనాలను విడుదల చేయకపోతే విద్యార్థులు చదవుకునేదెలా అని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజాపాలన వచ్చిన విద్యారంగంలో మార్పేమి లేదని ఆయన ఆరోపించారు. ఎఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు., ప్రభుత్వం మారిన పాలన మాత్రం అలాగే ఉందన్నారు. విద్యార్థుల పట్ల వివక్ష చూపిన ప్రభుత్వాలు మనుగడ సాగించలేవన్నారు. పెండింగ్ ఉపకార వేతనాలు ప్రొఫెషనల్ రూ.2000 కోట్లు, నాన్ ప్రొఫెషనల్ రూ.4000 కోట్లు ఉన్నాయని, 2021–22 ప్రభుత్వం విడుదల చేసిన బకాయిలు 30 శాతం 2022–23లో 20 శాతం, 2023–24, 2024–25,2025–26 లకు సంబంధించిన మొత్తం బకాయిలు పెండింగ్ ఉండటంతో ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు పలుమార్లు బంద్ నిర్వహించిన ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని విమర్శించారు. పేద విద్యార్థులపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతోందన్నారు. గత నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాలకు చెందిన విద్యార్థులు ఎక్కువ శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువుతున్నారన్నారు. మొత్తం రూ.8158 వేల కోట్ల రూపాయలు పెండింగ్ బకాయిలు ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ 19 నెలల పాలనలో విద్యార్థులకు ఒరింగేందేమి లేదని, ప్రజా పాలనలో వ్యిద్యార్థుల సమస్యలు పేరుకు పోయాయన్నారు. సంక్షేమ గురుకుల హాస్టల్లో పుడ్‌పాయిజన్ అవుతున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, విద్యార్థులను పరామర్శించడంలేదని, చదువు కోవాల్సిన విద్యార్థులు రోడ్డెక్కి ఉద్యమించే పరిస్థితి తెలంగాణలో వచ్చిందన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని కెటాయించడంతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రతివిద్యార్థికి ఉచితంగా ఆర్టీసీలో రవాణా సౌకర్యం కల్పించాలని, ఉచిత బస్‌పాసులు ఇవ్వాలని, శాతవాహన యూనివర్సిటీ కేంద్రంగా ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని, దీని ద్వారా ఉన్నత విద్య విద్యార్థులకు మరింత అందుబాటులోకి వస్తుందన్నారు. కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంతోనే శాతావాహన యూనివర్సిటీ కేంద్రంగా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు కావడంలేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి మాటలకు చేతలకు పొంతనలేదన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేక విద్యావ్యవస్థ ఆగమవుతుందన్నారు. శాతవాహన యూనివర్సిటీ కేంద్రంగా ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసేవరకు ఎఐఎస్ఎఫ్ పోరాటం ఆగదని, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు కొరకు ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తడి తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయులు విడుదల చేయాలని, లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిల ఇళ్లను ముట్టడిస్తామని మణికంఠరెడ్డి హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారావు వెంకటేశ్, మచ్చ రమేష్‌లు మాట్లాడుతూ జిల్లాకు చెందిన పొన్నం ప్రభాకర్ బిసి సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నా జిల్లాలో ఉన్న సంక్షేమ హస్టళ్లకు సొంత భవనాలు లేవన్నారు. అరకొర వసతులతో అద్దె భవనాలలో కొనసాగుతున్నాయన్నారు. వాటికి వెంటనే సొంత భవనాలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మామిడిపల్లి హేమంత్, కేశబోయిన రాము యాదవ్, కనకం సాగర్, లద్దునూరి విష్ణు, కసిరెడ్డి సందీప్ రెడ్డి, బొల్లి సాయిక్రిష్ణ, బోయిన విష్ణు, శ్రావన్, అశోక్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.








# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## రైలు నుంచి జారిపడి యాతాలకుంట వాసి మృతి

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** మండల పరిధిలోని యాతాలకుంట గ్రామానికి చెందిన దోరేపల్లి కోటయ్య (65) రైలు నుండి జారిపడి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తితే.. యాతాలకుంటకు చెందిన మృతుడు దోరేపల్లి కోటయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెద్ద తిరుపతిలో ఉంటున్న మనుమరాలి ఇంటికి కుమారుడితో కలిసి వెళ్ళి తిరిగి వస్తున్నక్రమంలో టాయిలెట్ కోసం రైలు డోర్ వద్ద వేచిచూస్తుండగా కాలు జారి పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య కుమార్తెల చిన్న వయస్సు లోనే మృతిచెందినట్లు తెలిపారు.






## ఆర్‌టిఐ ప్రజల ప్రాథమిక హక్కు

అధికారులు జవాబుదారీతనంతో మెలగాలి

అవగాహన సదస్సుల్లో కమిషనర్ జోరెడ్డి అయోధ్య

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సమాచార హక్కు ప్రజల ప్రాథమిక హక్కు అని ఆ హక్కును కాపాడేందుకు అధికారులు ప్రజలకు, ప్రభుత్వానికి జవాబుదారీ తనంగా ఉండాలని సమాచారహక్కు చట్టం ప్రధాన కమిషనర్ జోరెడ్డి అయోధ్యారెడ్డి పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ)అమలు పరిస్థితిని సమీక్షించేందుకు ఆయనతో సహా కమిషనర్లు దేవాల భూపాల్, పివి శ్రీనివాస్ గురువారం జిల్లాకు విచ్చేశారు. వీరికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్‌పి రోహిత్‌రాజ్, ట్రైనీ ఐఎఎస్ కలెక్టర్ సౌరబ్‌శర్మ పూలమొక్కలను అందించి ఆహ్వానించారు. పోలీస్ గౌరవ వందనం అందుకున్నారు. ఇందులో భాగంగా ఐఇఒసిలో నిర్వహించిన వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అయోధ్యారెడ్డి మాట్లాడుతూ ఆర్‌టిఐ కమిషనర్‌గా బాధ్యలు చేపట్టిన అనంతరం తొలిసారి ఈ జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. సమాచార హక్కు చట్టం 136 దేశాల్లో అమలవుతోందని, ఇక్కడ కూడా సమర్థవంతంగా అమలువుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 29 ప్రభుత్వ శాఖలకు గానూ 15శాఖలపై ఎటువంటి కేసులు లేకపోవడం హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీసిఇఒ నాగలక్ష్మి, అర్‌డిఒలు మధు, దామోదర్‌రావు తోపాటు అన్ని శాఖల పౌర సమాచారాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాలేరు విద్యాభివృద్ధికి రూ.470 కోట్లు

పేద పిల్లలను మణిరత్నాలుగా తీర్చిదిద్దుతాం : మంత్రి పొంగులేటి





**ప్రజాపక్షం/కూసుమంచి :** పాలేరు నియోజకవర్గంలో విద్యారంగానికి కొత్త ఊపు తెచ్చేందుకు 470కోట్ల రూపాయలను విద్యాభివృద్ధి కోసం కేటాయించామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పేద పిల్లలు చదువులో వెనుకబడకూడదు..వారిని మణిరత్నాలుగా తీర్చి దిద్దడమే మా ప్రభుత్వ సంకల్పంమని స్పష్టం చేశారు. గురువారం ఆయన కూసుమంచి మండలంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**జూనియర్ కళాశాలకు శంకుస్థాపన**

కూసుమంచి పాత జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ భవనాన్ని డిసెంబర్ 31నాటికి పూర్తి చేసి ఈ ఏడాదిలోనే విద్యార్థుల కోసం ప్రారంభిస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చడం నాకు గర్వంగా ఉందని మంత్రి అన్నారు.

**76 మంది బాలికలకు సైకిళ్లు**

పిఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 8వ తరగతి చదువుతున్న 76 మంది బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. పేద పిల్లలకు ప్రయాణ సౌకర్యం లేక చదువులో వెనుకబడకూడదు. గతేడాది 8,9,10వ తరగతుల విద్యార్థినిలు అందరికీ సైకిళ్లు ఇచ్చామని, వచ్చే ఏడాది నుండి జూనియర్ కళాశాలలో చేరుతున్న విద్యార్థినిలకు కూడా సైకిళ్లు అందిస్తామని తెలిపారు.

**కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ :** ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. పేద కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ పథకాలను కొనసాగిస్తున్నామని, భవిష్యత్తులో కూడా పేదల కోసం ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు.

**విద్యారంగానికి రూ.470 కోట్లు**

గడచిన 18 నెలల్లో పాలేరు నియోజకవర్గానికి 470కోట్ల రూపాయల నిధులు విద్యాభివృద్ధికి కేటాయించామని, ఐటిఐ, నైపుణ్య విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ వంటి ప్రాజెక్టులు ఈ ప్రాంతానికి కొత్త శకం తెస్తామని, చదువు అందరికీ చేరేలా ప్రభుత్వ కృషి కొనసాగుతుందని మంత్రి వివరించారు.

**వ్యక్తిగతంగా సహాయం చేస్తానని హామీ**

ప్రభుత్వ సహాయంతో పాటు అవసరమైతే నేను కూడా వ్యక్తిగతంగా సాయం అందించేందుకు పేద విద్యార్థులకు అండగా ఉంటానని, స్కూల్ అభివృద్ధి కోసం అవసరమైతే స్వయంగా నిధులు సమకూరుస్తానని, ప్రతి విద్యార్థి మంచి చదువులు చదివేలా తన వంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

**విమర్శలపై ఘాటు వ్యాఖ్యలు**

పూర్వ ప్రభుత్వ పరిపాలన వల్లే ఈ దౌర్భాగ్య పరిస్థితి వచ్చింది. ఇప్పుడు పిల్లల భవిష్యత్తు కోసం బాధ్యత తీసుకుని, ప్రతి విద్యార్థిని సమాజంలో ఒక ఆభరణంగా తీర్చిదిద్దే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుందని మంత్రి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలు చెందిన ప్రభుత్వ అధికారులు ప్రజలు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. గురువారం ఖమ్మం నగరంలోని పలు డివజన్లలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు మేయర్ పునుకొల్లు నీరజ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశ చరిత్రలోనే ఇందిరమ్మ ఇండ్ల పథకం సువర్ణాక్షరాలతో లఖించదగిందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం జిల్లా అభివృద్ధితో పాటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో ఖమ్మం నగరంలో మున్నేరు వరద ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహారా, త్రీటౌన్ ఏరియా కోఆర్డినేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్, బానాల లక్ష్మణ్, నాయకులు షేక్ ముఖ్తార్, కన్నం ప్రసన్న కృష్ణ, రమేష్ గౌడ్, సూర్యనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.



## దండి సురేష్‌కు మహిళల సన్మానం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** సిపిఐ జిల్లా క్యాదర్శిగా నూతన బాధ్యతలు స్వీకరించిన దండి సురేష్‌ను వరంగల్ క్రాస్‌రోడ్‌లోని అయోధ్యనగర్ 4వ వీధి, వెంకటసాయిసుధానగర్ 5వ వీధి మహిళలు తమ కాలనీలలో గురువారం ఘనంగా సన్మానించుకున్నారు. ఈ సందర్భంగా బొకేలను అందజేసి శాలువాలతో సత్కరించి మెమొంటోలను బహుకరించారు. అనంతరం దండి మాట్లాడుతూ...మహిళలు ఇంత పెద్ద ఎత్తున్న హాజరై తనపై చూపిన అభిమానానికి ధన్యుడినన్నారు. మున్ముందు కూడా మహిళల సహాయసహకారాలు సిపిఐకి ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సమితి సభ్యుడు దండి రంగారావు, ప్రముఖ లాయర్ కత్తి శివకుమారి, మహిళలు జ్వాల, రచన, రత్న, జయశ్రీ, రజిని, రాధిక, ఉపేంద్ర, లక్ష్మి, జూసెట్టి ఉమ, పిన్ని నాగమణి, ఆకుల జానకి, విద్యావతి, నాగలక్ష్మి, స్వప్న, శిరీష, రోజా, ప్రశాంతి, రామా, విజయ, జానకిఐరప్పన్, ఉమా, పిన్ని పద్మ, ఆకుల ప్రశాంతి పాల్గొన్నారు.




## బిసి బిల్లు సాధన కోసం 72 గంటలు నిరాహార దీక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బిసి బిల్లు సాధన కోసం ఆగస్టు నాలుగు నుంచి తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో 72 గంటల పాటు నిరాహార దీక్ష చేపడుతున్నట్లు యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ గుంటు మంజులరాణి తెలిపారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిసి బిల్లు సాధన కోసం కవిత నేతృత్వంలో అందరం ఐక్యమై ఉద్యమించనున్నట్లు తెలిపారు. ఎంఎల్‌సి కవిత పోరాటం ద్వారానే కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు ఆర్డినెన్స్ తెచ్చిందన్నారు. రిజర్వేషన్ ఖరారయ్యాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. బిసి బిల్లు సాధన కోసం ఆగస్టు నాలుగు నుంచి ఏడు వరకు 72 గంటల పాటు హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఎంఎల్‌సి కవిత నేతృత్వంలో నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ఈ దీక్షకు ఖమ్మంజిల్లాలోని బిసిలంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో నాయకురాళ్లు ఎం. భారతి, గట్టు కరుణ, నాగేంధర్, ఉదయ్‌కిరణ్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణకు రూ.2కోట్లు మంజూరు

50 అడుగుల మేర రోడ్డు విస్తరణ

స్వచ్ఛందంగా నిర్మాణాలు తొలగిస్తున్న గృహవాసులు





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామంలో రోడ్డు విస్తరణకు రెండు కోట్ల నిధులు మంజూరు చేశారు. 50 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేపట్టనున్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయించారు. రోడ్డు విస్తరణకు ఇండ్ల నిర్మాణం అడ్డంకిగా మారడంతో గృహవాసులు స్వచ్ఛందంగా నిర్మాణాలను తొలగిస్తున్నారు. ఇటీవల ఆర్‌అండ్‌బి అధికారులు రోడ్డు విస్తరణకు సంబంధించి మార్కింగ్ చేశారు. రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 25 అడుగుల మేర రోడ్డు విస్తరించనున్నారు. రోడ్డుకి ఇరువైపులా 14 అడుగుల నుంచి 15 అడుగుల వరకు గృహ నిర్మాణాలు తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో వైరా రోడ్డు ప్రధాన రహదారి నుంచి గ్రామంలోని వినాయక గుడి వరకు రోడ్డు విస్తరించి డివైడర్, లైటింగ్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు వినాయక గుడి నుంచి సాగర్ కాలువ వరకు రోడ్డు విస్తరించనున్నారు. దీని కోసం రెండు కోట్ల నిధులను కూడా మంజూరు చేశారు. గతంలో రోడ్డు విస్తరించినప్పుడు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విస్తరణ చేపట్టారు. కానీ ఇప్పుడు చేపట్టనున్న రోడ్డు విస్తరణకు గృహ నిర్మాణాలు అడ్డంకిగా మారాయి. గృహవాసులే స్వచ్ఛందంగా అడ్డుగా కట్టడాలను తొలగిస్తున్నారు. దీనితో రోడ్డు విస్తరణకు ఎటువంటి ఇబ్బందులు లేకపోవడంతో అధికారులు కూడా పనులు ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. త్వరలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. రోడ్డు విస్తరణతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గృహవాసులు కూడా స్వచ్ఛందంగా నిర్మాణాలు తొలగించడం సంతోషంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

## సాగర్ నీటితో చెరువులకు జలకళ

రఘునాథపాలెం వరప్రదాయిని మంచుకొండ లిఫ్ట్

సిఎం, మంత్రి తుమ్మల చిత్రపటాలకు క్షీరాభిషేకం



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** సాగర్ నీటితో రఘునాథపాలెం మండల చెరువుల్లో జలకళ సంతరించుకుందని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు తెలిపారు. దశాబ్దాల కాలంగా సాగునీటి కోసం ఎదురు చూసినా మండల ప్రజలకు, రైతులకు మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెరువులకు సాగర్ నీటితో నింపి కలను సాకారం చేశారని తెలిపారు. గురువారం మండల పరిధిలోని బావోజీతండా గ్రామంలోని రేగులకుంట చెరువు అలుగు పారుతున్న సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. గంగమ్మకు పూజలు నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎంసి చైర్మన్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో రూ.66కోట్లతో వి.వెంకటాయపాలెం వద్ద మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారన్నారు. వి.వెంకటాయపాలెం నుంచి సాగర్ నీటిని మంచుకొండ వద్ద ఏర్పాటు చేసిన పంపు హౌస్‌కు తరలించి అక్కడి నుంచి అంతర్గత పైపులైన్ ద్వారా మండల పరిధిలోని 36 చెరువులకు సాగునీటిని అందించేలా చర్యలు చేపట్టారన్నారు.నిర్మాణ పనులు ముగింపుదశకు వచ్చాయని, ఇటీవల ట్రయల్ రన్ కూడా విజయవంతమైందన్నారు. మూడు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సాగునీటితో పాటు తాగునీటి ఇబ్బందులు కూడా తొలగుతాయని, భూగర్భ జలాలు కూడా పెరుగుతాయన్నారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మండల ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, కోటేరు నర్సిరెడ్డి, ఎఎంసి డైరెక్టర్ రెంట్యాల ప్రసాద్, బండి వెంకన్న, చెరుకూరి పూర్ణచందర్ రావు, జంపన్న, దరావత్ రాంకోటి, శంకర్, సుధాకర్, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్లే స్కూల్స్ తరహాలో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి

కమిషనర్ అభిషేక్ అగస్త్య



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కార్పొరేట్ ప్లే స్కూల్స్ తరహాలో అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. గురువారం ఖమ్మం నగరంలోని ఆరవ డివిజన్ రాస్తోగి నగర్ అంగన్ వాడీ కేంద్రాన్ని కమిషనర్ అభిషేక్ అగస్త్య సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆకర్షణీయమైన వాల్ పెయింటింగ్, పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు, భద్రతా చర్యలను పరిశీలించారు. టీచర్లతో మాట్లాడి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, విద్య తదితర అంశాల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ప్లే స్కూల్స్ స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసిన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులకు మరింత ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు.

**యుపిహెచ్‌సి భవన నిర్మాణాన్ని పరిశీలించిన కమిషనర్ :**

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని ట్రంక్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యుపిహెచ్‌సి) భవనాన్ని కమిషనర్ అభిషేక్ అగస్త్య సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. భవన సమీపంలో ఖాళీ ప్రదేశంలో ఉన్న చెత్త మేటలను వెంటనే తొలగించి శుభ్రం చేయాలన్నారు. భవన నిర్మాణ నాణ్యతను అధికారులు పరిశీలించాలని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, ఆరోగ్య శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెరగాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

**ప్రజాపత్రం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రభుత్వాస్పత్రులపై ప్రజలకు నమ్మకం పెరగాలని, అందుకు సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని, ఆరోగ్య కేంద్రాలు గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించిన నాడు ప్రజలు నమ్ముతారని చెప్పారు. అవసరమైన రక్త పరీక్ష కిట్లు, సీజనల్ వ్యాదుల మందురు సిద్ధంగా ఉంచుకుని ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే కీటకజనిత వ్యాధులపై ముందస్తు చర్యలు తీసుకోవాలని, రికార్డుల నిర్వహణ సజావుగా ఉండాలని అన్నారు.

## అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూమ్

# ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

ఖాళీ స్థలాలు ఇచ్చిన పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్ల



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** పట్టణంలోని పాత కొత్తగూడెం ప్రాంతంలో అసంపూర్తిగా నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు పూర్తిచేసి అర్హులైన పేదలకు ఇవ్వాలని, అలాగే అదే పాత కొత్తగూడెంలో పేదలకు పంపిణీ చేసిన ఖాళీ స్థలంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు రాష్ట్ర కమిటీ సభ్యులు ఎజె.రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పాత కొత్తగూడెంలో అసంపూర్తిగా నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు పేదలకు పంపిణీ చేసిన ఖాళీ స్థలాలను సిపిఎం బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం దశల వారీ పోరాట ఫలితంగా ప్రభుత్వం నలభై ఎకరాల ప్రభుత్వ భూమిని కొనుగోలు చేస్తే గత ప్రభుత్వం ఆర్భాటంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టి ఇల్లు పూర్తి అవ్వకుండానే డ్రా తీసి పేదలను మోసంచేసిందని వారు విమర్శించారు. అలాగే దెబ్బైనాలుగు గజాలు ఖాళీ స్థలం పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చిందని, హామీల అమలుకు సమీక్షా సమావేశాలు నిర్వహించడం వల్ల ప్రయోజనంలేదని ఇంటి నిర్మాణం పూర్తవుతుందా లేదా అనే క్షేత్రస్థాయి పరిశీలన ఉండాలని వారు సూచించారు. అలాగే గృహ నిర్మాణ శాఖ మంత్రి పాత డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను సందర్శించి గతంలో లబ్ధిదారులుగా ప్రకటించిన వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకంలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు పూర్తి చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖాళీ స్థలం ఇచ్చిన పేదలకు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేయాలని అక్కడ నివాసం ఉండడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టే వరకు పేదలకు పంచిన ఖాళీ స్థలంలో ఇంటి నిర్మాణానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం లబ్ధిదారులను కలుపుకొని భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ టౌన్ కమిటీ సభ్యులు జునుమాల నగేష్, ఆవుల శ్రీరాములు, నాగకృష్ణ, ప్రమోద్ నాయకులు కొలిపాక వెంకటేశ్వర్లు, మురళి, కుక్కల ముతేష్, బాలకృష్ణ, రాములు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# సకల సౌకర్యాలతో ప్రణాళికలు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వరంగల్ క్రాస్‌రోడ్‌లోని తరుణీ హట్‌లో నిర్మించనున్న సమీకృత మండల ఆఫీస్ సముదాయ నిర్మాణ స్థలం పరిశీలన



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** సకల సౌకర్యాలతో మండల కార్యాల సముదాయ భవన నిర్మాణానికి ప్రణాళిక తయారు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఏదులాపురంమున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో గల తరుణీహాట్ వద్ద నిర్మించనున్న సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణ స్థలాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...నిర్మాణ స్థలాన్ని పూర్తి స్థాయిలో చదును చేయాలని, అనవసరమైన పాతబడిన నిర్మాణాలను పూర్తి స్థాయిలో తొలగించాలని అధికారులకు సూచించారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపిడిఒ, సబ్‌రిజిస్ట్రార్, వ్యవసాయశాఖతో పాటు సంబంధిత కార్యాలయాలు ఒకేచోట ఉండేలా చూడాలని ఆదేశించారు. అంతర్గతంగా 30ఫీట్ల సేఫ్టీ రోడ్డు వేసేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. ఫైర్ సేఫ్టీ సూచనలు పాటిస్తూ నిర్మాణాలు జరగాలన్నారు. కలెక్టర్ దూరిశెట్టి మాట్లాడుతూ...అసరమైన విద్యుత్ సోలార్ ప్యానెల్ ఏర్పాటు సమకూర్చుకునేలా ప్లాన్‌లో భాగస్వామ్యం చేయాలన్నారు.సమీకృత మండల కార్యాలయ సముదాయం వద్ద పార్కింగ్ సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా తాగునీటి సరఫరా కనెక్షన్ తీసుకోవాలన్నారు. ప్రతి ఫ్లోర్‌లో ప్రజల వెయిటింగ్ ఏరియా ఉండాలని, అక్కడ తాగునీటి ట్యాప్ ఉండాలన్నారు.

కార్యాలయాల్లో ఫైల్స్ పెట్టేందుకు స్టోరేజ్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలేరునియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ నరసింహారావు, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ హరినాథ్‌బాబు, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, ఆర్‌ఐ ప్రసాద్, విద్యుత్‌శాఖ ఎడి రామకృష్ణ, ఎఇ జిల్లా ప్రభాకర్‌రావు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, మండల సమితి సభ్యుడు దండి రంగారావు, టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ ధరావత్ రామ్మూర్తి నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, అంబటి సుబ్బారావు, తమ్మినేని నవీన్, భూక్య సురేష్‌నాయక్, అజ్మీరా అశోక్‌నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకట్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వరరావు, పల్లెర్ల పాండయ్య, బానోత్ కిషోర్, హరినాయక్, దివ్య, సిపిఐ సోషల్‌మీడియా ఇన్‌చార్జి రెబ్బగొండ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/ములుగు:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జ్వరంతో వచ్చిన ప్రతి వ్యక్తికి మలేరియా, డెంగ్యూ రక్త పరీక్షలను నిర్వహించి మెరుగైన వైద్యాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పస్రా వైద్యాధికారిణి డాక్టర్ సహానాను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ల్యాబ్ టెక్నీషియన్‌తో రూమును మలేరియా, డెంగ్యూ ఆర్‌డిటి పరీక్షలకు సరిపడా టెస్టు పరికరాలు, ల్యాబ్ రియేజెంట్ ఉన్నాయా అడిగి తెలుసుకొని లేనియెడల సమకూర్చుకోవాలని ల్యాబ్ టెక్నీషియన్‌కు తెలిపారు. అనంతరం మందుల నిల్వల గదిని చూసి వర్షాకాలానికి సరిపడే మందులు అందుబాటులో ఉంచుకోవాలని వాటితో పాటు అత్యవసర మందులైన, పాముకాటు, కుక్క కాటు వ్యాక్సిన్‌లను నిల్వ ఉంచుకోవాలని ఫార్మసిస్టుకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పస్రా వైద్యాధికారిణి డాక్టర్ సుహానా, ఫార్మసిస్ట్ శారద, స్టాఫ్ నర్సులు సంధ్య, రమాదేవి, చంద్రశేఖర్, సిబ్బంది, పాల్గొన్నారు.

## రాష్ట్రంలోనే అత్యుత్తమ క్రీడా పాఠశాల ఏర్పాటు: కడియం



**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి క్రీడా, సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీ పాఠశాలను వరంగల్ లో ఏర్పాటు చేయాలనీ మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్, సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీ పాఠశాల ఏర్పాటు పై హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయి లతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ జాతీయ స్థాయి ప్రమాణాలతో రాష్ట్రంలోనే అత్యుత్తమ క్రీడా పాఠశాలను వరంగల్ లో ఏర్పాటు చేయాలనీ స్పోర్ట్స్ అథారిటీ అధికారులకు సూచించారు. ముందుగా వరంగల్ లో స్పోర్ట్స్, సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీ పాఠశాల ఏర్పాటుకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆగస్టు 15నుండి క్రీడా పాఠశాల ప్రారంభించడానికి అవసరమైన చర్యలను వెంటనే తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో తాత్కాలిక క్రీడా పాఠశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 80మంది విద్యార్థులతో క్రీడా పాఠశాలను ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అందుకు అవసరమైన మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు హాస్టల్ వసతి, ఇండోర్, అవుట్ డోర్ క్రీడలకు కావాల్సిన ఏర్పాట్లు, తరగతి గదులను ఏర్పాటు చేయాలనీ సూచించారు.తాత్కాలికంగానే ఏర్పాటు చేస్తున్న సుమారు 2సంవత్సరాల పాటు విద్యార్థులు ఉండనున్న నేపథ్యంలో పనుల్లో నాణ్యత పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అజీజ్ ఖాన్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, జిల్లా యువజన క్రీడా అధికారులు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటుచేయాలి



**ప్రజాపక్షం/జనగామ:** ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం ఆర్టీఐ దరఖాస్తుకు ఇవ్వాల్సిన సమాచారంపై అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా భూగర్భజల శాఖ పర్యవేక్షకులు ధరంసింగ్ శిక్షణ ఇవ్వగా జిల్లాలోని అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ సమావేశానికి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం నుండి వేతనం పొందుతున్న ప్రతి ఒక్కరు ఆర్టీఐ పరిధిలోకి వస్తారన్నారు. ప్రతి 3 నెలలకు ఒకసారి నివేధికలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు.ఈ శిక్షణ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, కలెక్టర్ కార్యాలయ ఏవో శ్రీకాంత్, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



**ప్రజాపక్షం/తొర్రూరు :** జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. ఆగస్టు 8న మహబూబాబాద్‌లో జరిగే ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా మహాసభల కరపత్రాలను గురువారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి లకావత్ యాదగిరినాయక్‌తో కలిసి ఝాన్సీరెడ్డి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ జర్నలిజం అనేది ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలన్నారు. వార్తల సేకరణలో, వాటిని ప్రచురించడంలో జర్నలిస్టుల కృషి మరువలేనిదన్నారు. తెలంగాణలో 18వేల మంది అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్నారని, త్వరలోనే కొత్త అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మాజీ సర్పంచ్, గిరిజన జేఏసీ రాష్ట్ర చైర్మన్ ధరావత్ రాజేశ్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, జర్నలిస్టు జిలకర రాజు, గిరిజన నాయకులు బానోతు అభిరామ్, అజ్మీర రమేశ్, బానోతు సాగర్, బానోతు వీరన్న, గోపి, సురేందర్, సంతోశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అండర్ బ్రిడ్జి పాదచారులకు నిత్యం నరకం



**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం జరిగిన నాటి నుండి నేటి వరకు చిరు జల్లులకు సైతం అండర్ బ్రిడ్జి కింద నీరు చేరి పాదచారులకు నిత్యం తీవ్రమైన ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బురద నీటిలో అవతల నుండి ఇటు అటు వైపు , వెళ్లే పాదచారులు బురద నీటిలో నడుచుకుంటూ వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షం కురిస్తే మోకాళ్ళ లోతు నీటిలో వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఎలాగోలాగా వెళ్లాలనే పాదచారుల ప్రయత్నంలో ద్విచక్ర వాహనలు, కారు, ఆటోలు, జీబ్ లు అతీ వేగంగా వెళ్లడంతో బురద నీరు పాదచారులపై పడడంతో వాహనదారులకు పాదచారులకు నిత్యం గొడవలు జరుగుతున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. రాత్రి వేళల్లో బురద నీటిలో విష సర్పాలు సంచరిస్తున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. ప్రభుత్వాలు మారిన, అధికారులు మారిన, ప్రజా ప్రతినిధులు మారిన, సమస్య మాత్రం అలాగే ఉంది. పాదచారులకు శాశ్వత పరిష్కారం చూపలేని స్థితిలో సంబంధితులు ఉండడం విచార కరంగా ఉంది.

# విద్యారంగ బలోపేతం దిశగా సర్కార్ చర్యలు

**ప్రజాపక్షం/ములుగు:** విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి, క్లాస్ రూమ్‌లను పరిశీలించి విద్యార్థినిలతో తెలుగు, ఇంగ్లీష్, హింది సబ్జెక్టుల వారీగా వివరాలు అడిగి తెలుసుకొని, తెలుగు, ఇంగ్లీష్‌పై పట్టు ఉండాలని, విద్యార్థులతో తెలుగు చదివించారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకొని పోటీతత్వంలో ముందుకు వెళ్ళాలని అన్నారు. మీరు మంచిగా చదువుకొని మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులతో కలసి మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వర్షాకాలం కావడంతో పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. అనంతరం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అన్ని తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యా బోధన, డిజిటల్ క్లాస్ నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. 3వ తరగతి విద్యార్థిని డిజిటల్ స్క్రీన్‌లో ఇంగ్లీష్ పదాలను చదువుతుండగా కలెక్టర్ వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## స్మార్ట్ సిటీ మిషన్ గడువును జూన్ 2026 వరకు పొడిగించాలి

### వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజాప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని స్మార్ట్ సిటీ పనులు పూర్తయ్యే వరకు మిషన్ గడువు పెంచాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్ లో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గ్రేటర్ వరంగల్, కరీంనగర్ నగరాల్లో ఇంకా పూర్తి కాకపోయిన పనుల గురించి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వరంగల్ నగరంలో కొన్ని పనులు పూర్తయ్యే లోపు స్మార్ట్ సిటీ మిషన్ గడువు ముగిసి పోయిందని దీంతో నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు అందడంలేదన్నారు. ఈ నేపథ్యంలో స్మార్ట్ సిటీ మిషన్ గడువును జూన్ 2026 వరకు పొడిగించాలని అన్నారు. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి టోకెన్ సాహు రాతపూర్వక సమాధానంలో వివరాలు వెల్లడించారు. స్మార్ట్ సిటీస్ మిషన్ ఇప్పటికే మార్చి 31, 2025న ముగిసిందని, ఇకపై పొడిగింపు ఉండదని తెలిపారు. ఇంకా మిగిలిన పనులను ప్రతి నగరంలో ఉన్న ప్రత్యేక సంస్థలు (ఎస్పీవి) ద్వారానే పూర్తి చేయాలని తెలిపారు.ప్రస్తుతానికి గ్రేటర్ వరంగల్‌లో రూ.1,800 కోట్లలో రూ.1,386 కోట్ల విలువైన 119 పనులు పూర్తయ్యాయి. ఇంకా రూ.415 కోట్లతో 40 పనులు జరుగుతున్నాయని, కరీంనగర్‌లో రూ.1,094 కోట్లలో రూ.979 కోట్ల విలువైన 49 పనులు పూర్తయ్యాయి. రూ.115 కోట్లతో 12 పనులు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు.

## విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** విద్యార్థులకు హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్ గ్రామంలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ఆసుపత్రికి వచ్చే రోజుల సంఖ్యతో పాటు, ఆసుపత్రి పరిసరాలు, ల్యాబ్, ఫార్మసీలను పరిశీలించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడే సమావేశం నిర్వహించి ఏఎన్ఎంలు ,ఆశా వర్కర్లతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఆస్పత్రి లో సరిపడా మందులు నిల్వ ఉంచుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా లాంటి ప్రాణాంతకమైన వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. జ్వరం ప్రబలిన ప్రాంతాలల్లో వైద్య క్యాంపు లు నిర్వహిస్తూ వ్యాధుల ను అరికట్టాలని తెలిపారు. ప్రబలిన వ్యాధులపై అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ముఖ్యంగా వివిధ గ్రామాలలోని పాఠశాలలు, గురుకుల పాఠశాలలో విద్యార్థులను పరీక్షించి ప్రతి విద్యార్థి ఆధార్ కార్డు నెంబర్ ఆధారంగా విద్యార్థి యొక్క హెల్త్ ప్రొఫైల్ ను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న గాజుల స్వాతికి చెందిన ఇందిరమ్మ ఇల్లు ను పరిశీలించి త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుకను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, డా॥ ప్రమోద్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపిఒ నాగరాజు, ప్రధానోపాధ్యాయులు మంజుల, రాజు, పంచాయతీ సెక్రెటరీ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** మండలంలోని అక్కరాజుపల్లి క్రాస్ వద్ద వాహనాలు తనికీ చేస్తుండగా జనగామ నుండి హుస్నాబాద్ వైపు వెళ్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన సంతోష్ పాండా, అతని స్నేహితుడు శివరాం డాక్వ ఇద్దరు వ్యక్తుల నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీన పరుచుకున్నామని సీఐ అబ్బయ్య తెలిపారు. మండల కేంద్రంలో ఎస్ఐ శ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గంజాయి విలువ రూ.5లక్షల వరకు ఉంటుందన్నారు. వీరిలో శివరాం డాక్వా పారిపోయాడని, ఇద్దరిపై కేసు నమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నామన్నారు. ఒకరిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజయ్య, పోలీస్ సిబ్బంది కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**ప్రజాపక్షం/పరకాల :** దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.గురువారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన మాచబోయిన ఓదేమ్మకు వీల్ చైర్ ను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. శారీరక లోపాలను అధిగమించి నేడు దివ్యాంగుల సైతం అన్ని రంగాల్లో దూసుకొని వెళ్తున్నారని తెలిపారు. ఆత్మవిశ్వాసానికి ప్రతీక దివ్యంగులని అన్నారు. నియోజకవర్గంలోని దివ్యాంగుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు

## ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని సిపిఐ వినతి



**ప్రజాపక్షం/కాజీపేట:** ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కాజీపేట్ మండల తాసిల్దార్ కు భారత కమ్యూనిస్టు పార్టీ కాజీపేట మండల సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ పాల్గొని మాట్లాడుతూ 31వ డివిజన్లోని న్యూ శాయంపేట లోని 579 సర్వేనెంబర్ గల ప్రభుత్వ భూమిలో 39 ఎకరాలు భూకబ్జా జరుగుతున్నదని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఐ నాయకులు ప్రభుత్వ భూమి పరిరక్షించాలని కాజీపేట తహసిల్దార్ ను కోరామని, లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని మద్దెల ఎల్లేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు మునిగాల బిక్షపతి, మండల కార్యదర్శి మాలోతు శంకర్ నాయక్, కాజీపేట్ మండల సమితి కార్యవర్గ సభ్యులు రాస మల్ల కుమార్, రీల్ పూర్ణ చందర్, ధర్మ సాగర్ మండల కార్యదర్శి కొట్టే వెంకటేష్, వల్లపు సారయ్య, సాయి పేట కొమురయ్య, రాజయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత విషయంలో రాజీ లేదు

### ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీపడదని ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 6వ డివిజన్ లష్కర్ బజార్ లో నిర్మాణం చేసిన సఖి కేంద్రం (సఖి వన్ స్టాఫ్ సెంటర్)ని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వం సఖి కేంద్రాల ఏర్పాటును చేపట్టిందన్నారు. ఇక్కడ మహిళలకు మానసిక, శారీరక, న్యాయ సహాయం ఒకే చోట అందించబడుతుందని, మహిళల హక్కులను కాపాడటానికి ఇది శక్తివంతమైన వేదిక అవుతుంది అని అన్నారు.మహిళలు సఖి కేంద్రాన్ని ధైర్యంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం చివరిలో సఖి కేంద్రంలోని సదుపాయాలను పరిశీలించిన ఎమ్మెల్యే, సిబ్బందిని అభినందించారు.మహిళలకు పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంలో రాజీ పడదని పేర్కొన్నారు.హనుమకొండ జిల్లా కేంద్రంలో అన్ని విధాలుగా అనుకూల వాతావరణంలో ఏర్పాటు చేయడం శుభపరిణామం అని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

## ములుకనూరు సహకార సంఘం సేవలు భేష్

### కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** ములుకనూరు మహిళా సహకార సంఘం ద్వారా నిర్వహిస్తున్న పాల డెయిరీ నిర్వహణ, అదేవిధంగా ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం అందిస్తున్న సేవలు బాగున్నాయని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని ములుకనూరు మహిళా సహకార పాల సంఘం (డెయిరీ), ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘంను హనుమకొండ జిల్లా కలెక్టర్ సందర్శించారు.పాల డియిరీని సందర్శించిన కలెక్టర్ మహిళా సహకార సంఘం ఆధ్వర్యంలో డెయిరీ ఎప్పుడు ప్రారంభించారు, ఎంత పెట్టుబడి, ఎలాంటి వనరులతో ప్రారంభించారు, గ్రామాలలో పాల సేకరణ ఎలా చేస్తారని, సేకరించిన పాల క్వాలిటీని ఎలా పరీక్షిస్తారని, రవాణా సదుపాయాలు, ప్రాసెసింగ్ ఏ విధంగా చేస్తుంటారని, రోజువారీగా ఎన్ని వేల లీటర్ల పాల సేకరణ జరుగుతుందని, మహిళా సంఘాల ప్రతినిధులకు ఎంత ప్రయోజనం కలుగుతుందని, ఏయే ప్రోడక్ట్లకు లాభాలు వస్తుంటాయని డెయిరీ జీఎం భాస్కర్ రెడ్డిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డెయిరీలో గ్రామాల వారీగా సేకరించిన పాలను ఏ విధంగా పాశ్చరైజేషన్, శీతలీకరణ, పాల ప్యాకెట్ల తయారీ భాగాలు, రవాణా వాహనాలను కలెక్టర్ పరిశీలించి వాటిని గురించిన వివరాలను జిఎం భాస్కర్ రెడ్డి ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డి ఆర్ డి ఓ మేన శ్రీను, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, మహిళా సహకార సంఘం డైరెక్టర్లు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎరుకల అభివృద్ధికి కృషి

### ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/తొర్రూరు :** పాలకుర్తి నియోజకవర్గంలో ఉన్న ఎరుకుల కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి 29వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయ సాయిలు, పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్‌తో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలు సమాన హక్కులు పొందాలని, ఎరుకల వర్గం అభివృద్ధికి, హక్కుల సాధనకు పని చేస్తున్న ఈ పోరాట సమితి కృషి ప్రశంసనీయమన్నారు. ఎరుకల సామాజిక, ఆర్థిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సంఘం నాయకులు సురేశ్, వెంకన్న, అంజమ్మ, ఎల్లయ్య, సోమనర్సయ్య, సంపత్, ఉప్పలయ్య, మధు, యాకయ్య, కృష్ణయ్య, యాదగిరి, సోమయ్య, వీరేందర్, నగేశ్, సతీశ్, ఉపేందర్, కృష్ణ, రామచంద్రు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ వృత్తిలో నైపుణ్యం సాధించేందుకు డ్యూటీ మీట్‌లు దోహదం

### తెలంగాణ పోలీస్ అకాడమీ డైరక్టర్ అభిలాష బిస్త్




**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పోలీస్ అధికారులు తమ వృత్తిలో నెపుణ్యం సాధించేందుకుగా పోలీస్ డ్యూటీ మీట్‌లు ఎంతగానో దొహదపడుతాయని తెలంగాణ పోలీస్ అకాడమీ డెరక్టర్ అభిలాష్ బిస్త్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధ్వర్యంలో పిటిసి మామూనూర్ వేదికగా ఎర్పాటు రెండవ తెలంగా పోలీస్ డ్యూటీ మీట్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డెరక్టర్ అభిలాష్ బిస్త్, అడిషినల్ డీజీపి మహేష్ భగవత్ ఈ డ్యూటీ మీట్‌ను ప్రారంభించారు. గురువారం నుండి మూడు రోజుల పాటు జరగన్న ఈ తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్‌లో రాష్ట్రంలో ఏడు జోన్లతో పాటు సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్లు, సిఐడి ఇంతెలిజెన్స్,యాంటీ నార్కోటిక్ బ్యూరో,సైబర్ సెక్యూరిటీ వింగ్, జిఆర్‌పి, ఐటీఅండ్‌టి, అక్టోపస్, గ్రేహౌండ్స్ విభాగాలకు చెందిన సూమారు నాలుగు వందలకుపైగా పోలీస్ అధికారులు, సిబ్బంది సైటిఫిక్ ఎయిడ్, యాంటీ సబటేజ్ చెక్,కంప్యూటర్,డాగ్ స్క్వాడ్, ప్రోపెషనల్ ఫోటోగ్రఫీ, వీడియో గ్రఫీలకు సంబంధించిన 25 విభాగాల్లో పోటీ పడనున్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా ఈ పోటీల్లో పాల్గోన్న పోలీస్ అధికారులు నిర్వహించిన అనంతరం క్రీడాలో ముఖ్య అతిధి చేతుల మీదుగా డ్యూటీ మీట్ జెండాను ఎగురు వేసారు. ఈ కార్యక్రమములో సిఐడి డీఐజీ నారాయణ నాయక్, ఏస్పీ రాంరెడ్డి, డిసిపిలు అంకిత్‌కుమార్, షేఖ్ సలీమా, రాజమహేంద్రనాయక్, పిటిసి ప్రిన్స్‌పాల్ పూజ, కమాండెట్లు రాంకుమార్, రామకృష్ణతో పాటు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# రీల్


## 'రా చిలకా' మెలోడీ సాంగ్

రాన్యా, ప్రియాంక ఆచార్, జగపతి బాబు ప్రధాన పాత్రల్లో తరుణ్ కిషోర్ సుధీర్ నిర్మాణంలో పునీత్ రంగస్వామి తెరకెక్కించిన చిత్రం 'ఎలుమలై'. నరసింహా నాయక్ (రాజు గౌడ) సమర్పణలో తరుణ్ సుధీర్ క్రియేటివ్స్, దీశ ఆర్ట్ స్టూడియోస్ బ్యానర్లపై యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఓ మెలోడీ సాంగ్‌ను రిలీజ్ చేశారు. సిద్ శ్రీరామ్ ఆలపించిన 'రా చిలకా' అనే పాట విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటకు డి. ఇమ్మాన్ బాణీలు అందించారు. ఈ చిత్రం తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో ఏక కాలంలో విడుదల కానుంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన విడుదల తేదిని ప్రకటించనున్నారు. రాన్యా, ప్రియాంక ఆచార్, జగపతి బాబు, నాగభరణ, కిషోర్ కుమార్, సర్దార్ సత్య, జగప్ప తదితరులు నటించారు. ఈ చిత్రానికి నిర్మాత : తరుణ్ సుధీర్, సహ నిర్మాత : అట్లాంట నాగేంద్ర, దర్శకుడు : పునీత్ రంగస్వామి, సినిమాటోగ్రఫీ: అద్వైత గురుమూర్తి, ఎడిటింగ్: కె.ఎం. ప్రకాష్, డైలాగ్స్: నాగార్జున శర్మ, పునీత్ రంగస్వామి






## 'కూలీ' నుంచి పవర్‌హౌస్ సాంగ్




సూపర్ స్టార్ రజనీకాంత్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'కూలీ'కి లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రతిష్టాత్మక సన్ పిక్చర్స్ బ్యానర్ నిర్మించిన కూలీలో నాగార్జున , బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్‌ఖాన్ మరో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు.ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్లు, టీజర్లు, సాంగ్స్ సినిమాపై భారీ క్రేజ్‌ను నెలకొల్పాయి. 'చికిటు', మోనికా సాంగ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. తాజాగా కూలీ నుంచి పవర్‌హౌస్ సాంగ్ రిలీజ్ చేశారు. రాక్ స్టార్ అనిరుధ్ ఈ పాటని పవర్ ప్యాక్డ్ సెన్సేషనల్ నెంబర్ కంపోజ్ చేశారు.రాంబాబు గోసాల రాసిన లిరిక్స్ సూపర్ స్టార్ రజనీ ఇమేజ్ కి పర్ఫెక్ట్ గా ఫిట్ అయ్యాయి. డి. సురేష్ బాబు, దిల్ రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఏషియన్ మల్టీప్లెక్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కూలీ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతీ హాసన్, మహేంద్రన్ వంటి ప్రముఖులు కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కలానిధి మారన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. అనిరుధ్ సంగీతం, గిరీష్ గంగాధరన్ సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ ఫిలోమిన్ రాజ్ పని చేశారు. ఈ చిత్రం 2025 ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది.

## హృతిక్, కియారా ఊపిరి ఊయలలాగా'



యష్ రాజ్ ఫిలమ్స్ నిర్మించిన 'వార్ 2' నుంచి ఒక సాంగ్ విడుదల అయింది. హృతిక్ రోషన్, కియారా అద్వానీలపై తీసిన ఈ రొమాంటిక్ పాట ' ఊపిరి ఊయలలాగా' ఇప్పుడు సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. 'బ్రహ్మాస్త్ర' లోని బ్లాక్‌బస్టర్ పాట 'కేసరియా' పాటని కంపోజ్ చేసిన టీం ఈ రొమాంటిక్ సాంగ్ రూపొందించారు. హిందీలో ఈ పాటకు ప్రీతమ్ బాణీలు అందించగా, అమితాబ్ భట్టాచార్య సాహిత్యం అందాంచారు. అరిజిత్ సింగ్ ఈ పాటను పాడారు. తెలుగులో ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించారు. తెలుగులో ఈ పాటను శాశ్వత్ సింగ్, నిఖితా గాంధీ ఆలపించారు. హృతిక్, కియారా కెమిస్ట్రీ, పాటను తెరకెక్కించిన విధానం, లోకేషన్స్ అన్నీ కూడా అధ్భుతంగా ఉన్నాయి. కియారా పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేసిన ఈ పాట అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ఆదిత్య చోప్రా నిర్మించిన 'వార్ 2' ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషలలో విడుదల కానుంది.

## విజయ్ దేవరకొండ కింగ్‌డమ్‌గా మెరిశాడు




విజయ్ దేవరకొండకు బలమైన వాణిజ్య విరామం అవసరం, ఇప్పుడు అతను కింగ్‌డమ్‌తో తిరిగి వచ్చాడు. జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రం దాని ప్రచార సామగ్రి కారణంగా గణనీయమైన సంచలనాన్ని సృష్టించింది. ఈ పాత్ర కోసం విజయ్ పూర్తిగా రూపాంతరం చెందాడు. ప్రదర్శన శరీరాకృతి పరంగా. భాగ్యశ్రీ బోర్సే మహిళా కథానాయికగా నటించగా, సత్య దేవ్ విజయ్ సోదరుడి పాత్రను పోషించాడు. అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూర్చారు. సూర్యదేవర నాగ వంశీ సౌజన్య నిర్మించిన కింగ్‌డమ్ అధిక బడ్జెట్ ప్రాజెక్ట్.

**కథ:** స్వాతంత్ర్యానికి పూర్వం, శ్రీకాకుళం సమీపంలోని ఒక గ్రామంలో కథ ప్రారంభమవుతుంది, అక్కడ బ్రిటిష్ అధికారులు గిరిజన ప్రజలపై కాల్పులు జరుపుతారు. వారి రాజు యుద్ధంలో మరణిస్తాడు కానీ, వెళ్ళే ముందు, ఒక రోజు ఒక నాయకుడు వారికి మార్గనిర్దేశం చేయడానికి తిరిగి వస్తాడని ఒక యువకుడికి చెబుతాడు. బతికి ఉన్న తెగ శ్రీలంకలోని ఒక మారుమూల ద్వీపానికి పారిపోయి, ఆ వాగ్దానం చేసిన రక్షకుడి కోసం వేచి ఉంటుంది.దెబ్బై సంవత్సరాల తరువాత, కానిస్టేబుల్ సూరి (విజయ్ దేవరకొండ) వారి బాల్యంలో తప్పిపోయిన తన సోదరుడిని కనుగొనే లక్ష్యంతో ఉన్నాడు. శ్రీలంకలో ఒక రహస్య ఆపరేషన్ కోసం ఉన్నత పోలీసు అధికారులు అతన్ని చేర్చుకుంటారు, అక్కడ డ్రగ్ ముఠా గిరిజన సమాజాన్ని దోపిడీ చేస్తోంది. తన సోదరుడు శివ (సత్య దేవ్) ముఠాతో సంబంధం కలిగి ఉన్నాడని అతను అతన్ని తిరిగి తీసుకురాగలడని ఆశించి సూరి అంగీకరిస్తాడు.శిక్షణ పొంది శ్రీలంకకు పంపబడిన సూరికి స్థానిక వైద్యురాలు (భాగ్యశ్రీ బోర్సే) నుండి సహాయం అందుతుంది, రహస్య భారతీయ నిఘా ఏజెంట్. శ్రీలంకలో ఏమి జరుగుతుంది? సూరి శివను తిరిగి తీసుకురాగలిగాడా? స్థానిక నేరస్థుడు మురుగన్ (వెంకటేష్ వీపీ) ఆపరేషన్ గురించి తెలుసుకున్న తర్వాత ఎలాంటి పాత్ర పోషిస్తాడు? తెలుసుకోవడానికి, మీరు కింగ్‌డమ్ చూడవలసి ఉంటుంది.

**విశ్లేషణ:** దర్శకుడు గౌతమ్ తిన్ననూరి బలం అతని మునుపటి చిత్రాలలో చూసినట్లుగా భావోద్వేగంతో నడిచే కథలను చెప్పగల సామర్థ్యంలో ఉంది. కింగ్‌డమ్‌తో, అతను సోదరభావం, గిరిజన స్థానభ్రంశం రహస్య మిషన్లు వంటి ఇతివృత్తాలను అన్వేషిస్తాడు. ఈ చిత్రం 1920లలో బలమైన చారిత్రక సెటప్‌తో ప్రారంభమవుతుంది, 1990లలో కానిస్టేబుల్ సూరి తన తప్పిపోయిన సోదరుడి కోసం వెతుకుతున్నాడు, పాత ఛాయాచిత్రాన్ని మాత్రమే కలిగి ఉన్నాడు. అతను స్థానిక చిత్రకారుడిని తన సోదరుడిని నవీకరించబడిన వ్యంగ్య చిత్రాన్ని రూపొందించమని అడుగుతాడు, అతను 18 సంవత్సరాల తర్వాత ఎలా ఉంటాడో ఊహించుకుంటాడు.18 ఏళ్ల తర్వాత అతను ఎలా ఉంటాడో ఊహించుకోవడం.సినిమా మొదటి సగం ఆకర్షణీయంగా ఉంటుంది, మురుగన్ క్రూరత్వాన్ని సమర్థవంతంగా స్థాపించారు. అయితే, సినిమా ద్వితీయార్థంలో తడబడుతుంది. దర్శకుడు వేగం, భావోద్వేగ లోతును కొనసాగించడంలో విఫలమవుతాడు. దర్శకుడు విరోధి మురుగన్ తెగలపై అతని ప్రతీకార చర్యపై దృష్టిని మళ్లిస్తాడు, సోదరులతో కూడిన ప్రధాన కథాంశాన్ని విస్మరిస్తాడు.

ఒక సన్నివేశంలో, శివుడు విలన్ చేతిలో బాధపడుతుండగా, సూరి డాక్టర్ తో సమయం గడుపుతున్నట్లు చూపించారు ఇది ఒక వింత కథనం .ఓవరాల్ గా విజయ్ దేవర కొండ నటనకు తిరుగులేదని చెప్పవచ్చు. జనాన్ని ఆకట్టుకునేలా సినిమాను మలచడంలో సఫలీకృతం అయ్యారు.

**తీర్పు:** కింగ్‌డమ్ చిత్రం ఆశయంతో నిండి ఉంది, మొదటి సగం ఆకట్టుకునేలా ఉంది మరియు బలమైన విజువల్స్‌తో ఉంది, కానీ రెండవ భాగంలో అసమాన రచన , కథానాయకుడిపై దృష్టి లేక పోవడం వల్ల తడబడుతుంది. అనిరుధ్ సంగీతం మరియు విజయ్ దేవరకొండ నటన అద్భుతమైన అంశాలు, సినిమాటోగ్రఫీ కథనానికి దృశ్యమాన వైభవాన్ని తెస్తుంది. సినిమా అంతటా దాని భావోద్వేగ కథన తీవ్రతను కొనసాగించి ఉంటే, అది బ్లాక్‌బస్టర్ స్థాయికి చేరుకునేది. అయినప్పటికీ, కింగ్‌డమ్ దాని అద్భుతమైన విజువల్స్, సాంకేతిక నైపుణ్యం మరియు విజయ్ హృదయపూర్వక చిత్రణ కోసం చూడదగినది. క్లైమాక్స్ సాధ్యమయ్యే సీక్వెల్ లేదా ప్రీక్వెల్‌ను సూచిస్తుంది ఈ నిర్ణయం దర్శకుడు గౌతమ్ తిన్ననూరి నిర్మాతలకు వదిలివేయడం మంచిది.

**రేటింగ్: 3/5**

## 'అరణ్య ధార' నుండి 'యుగానికే ప్రయాణమే' పాట విడుదల

బాలు నాయుడు,ఆశా సుదర్శన్ జంటగా నటించిన సస్పెన్స్ అండ మైథలాజికల్ థ్రిల్లర్ మూవీ 'అరణ్య ధార'. 'సిల్వర్ స్క్రీన్ షాట్స్' బ్యానర్ పై నిర్మాత బాలు నాయుడు 'అరణ్య ధార'ని రూపొందించారు. దర్శక ద్వయం శివ పచ్చ, బాలు నాయుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. తాజాగా 'అరణ్య ధార' నుండి 'యుగానికే ప్రయాణమే' అనే పాటను విడుదల చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు రఘు కుంచె చేతుల మీదుగా లాంచ్ చేశారు. రవి నిడమర్తి సంగీతంలో రూపొందిన ఈ పాటని అమన్ సిద్ధికి ఆలపించగా బాలు నాయుడు సాహిత్యం సమకూర్చారు. ఈ సందర్భంగా రఘు కుంచె మాట్లాడుతూ ఈ పాటలో ప్రకృతిని బాగా చూపించారు. ఇందులో హీరో ఒక ఫోటోగ్రాఫర్ గా నటిస్తున్నారని అన్నారు. బాలు నాయుడు, ఆశ సుదర్శన్, రేవతి నాథ, వెంకట్ పసుపులేటి, నాయకంటి స్వేతాంజలి, ప్రసాద్ పూసల,సంజయ్ సముద్రాల, జంజుర్ నిఖిల్ తదితరులు నటించారు.

## యథార్థ సంఘటన ఆధారంగా చేతబడి




శ్రీ శారద రమణా క్రియేషన్స్ బ్యానర్ పై నంద కిషోర్ నిర్మాణంలో నూతన దర్శకుడు సూర్యాస్ రూపొందిస్తున్న చిత్రం చేతబడి. యాధార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

ఈ కథ గురించి దర్శకుడు సూర్యాస్ మాట్లాడుతూ 'చేతబడి అనేది 16 వ శతాబ్దంలో మన ఇండియాలో పుట్టిన ఒక కల. రెండు దేశాలు కొట్టుకోవాలన్న రెండు దేశాలు కలవాలన్న.. ఒక బలం బలగంతో ఉండాలి. కానీ ఒక ఈవిల్ ఎనర్జీతో మనిషిని కలవకుండా అతన్ని చంపే విద్యే చేతబడి. అది ఎంత భయంకరంగా ఉంటుందో ఇప్పటికే చాలా సినిమాల్లో చూపించారు. ఇందులో చాలా విభిన్నంగా చూపిస్తున్నాం. ఈ చిత్రానికి సహ నిర్మాత : నరేష్ జైన్ , క్రియేటివ్ హెడ్ : దీపింటి అగర్వాల్ , సంగీతం : అచ్చు రాజమణి, సినిమాటోగ్రాఫర్ : మిర్లాన్ నజీర్ ,

## డబ్బుకు కక్కుర్తి పడ్డాం

(మొదటి పేజీ తరువాయి)

పాటు సిబ్బంది, టెక్నీషియన్లు, అనస్తేషియా నిపుణులు మొత్తం 8 మందిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో అసలు వాస్తవాలను వెలికితీసేందుకు హైదరాబాద్ పోలీసులు ప్రధాన నిందితురాలైన నమ్రతను కోర్టు అనుమతితో ఐదురోజుల కస్టడీ తీసుకుని విచారిస్తున్నారు. కేసులో రోజుకో కొత్త కోణం వెలుగులోకి చూస్తుంది. ఈ కేసులో పోలీసుల విచారణలో విస్తుపోయే విషయాలు బయటకు వస్తున్నాయి. పోలీసుల కస్టడీలో ఉన్న యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత తన తప్పును అంగీకరించినట్లు తెలుస్తోంది. 'సృష్టి' లో అక్రమాలు నిజమేనని, తెలిసే ఈ తప్పులు చేశామని పోలీసుల విచారణలో అంగీకరించినట్లు సమాచారం. రాజస్థాన్ దంపతులను సరోగసి చేసినట్లు నమ్మించామని పోలీసుల ముందు ఆమె ఒప్పుకున్నట్లు తెలిసింది. ఇలాంటి మోసాలు 2020 నుంచి నడిపిస్తున్నట్లు తెలిసింది. హైదరాబాద్‌తో ఆపటు విజయవాడ, విశాఖపట్నంలో కూడా వీరికి సెంటర్లు ఉన్నాయి. సరోగసి గర్భం ధరించిన మహిళకు రూ.90 వేలు ఇస్తారని, ఆ బిడ్డను రూ.35 లక్షలకు దంపతులకు అమ్మినట్లు తేలింది.బీరు, బిర్యానీ వాగ్దానంతో పేద ప్రజల నుంచి వీర్యాన్ని సేకరించడం, పరిశీలన చేయకుండానే ఐవిఎఫ్‌లో ఉపయోగించడం వంటి అవినీతి చర్యలను కూడా పోలీసులు సేకరించారు. అయితే పిల్లలు లేని దంపతుల బలహీనతను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడిన సృష్టి ఫర్టిలిటీ సెంటర్ నిర్వహాకులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

# కేంద్ర బృందం బతుకమ్మ కుంట సందర్శన

### జాతీయ స్థాయిలో ఇది ఒక నమూనా అంటూ కితాబు

### హైడ్రా కృషిని అభినందించిన కేంద్ర అధికారులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను కేంద్ర గృహ నిర్మాణ, పట్టన వ్యవహారల మంత్రిత్వ శాఖ ( ఎంఓహెచ్‌యుఏ)కు చెందిన అధికారుల బృందం గురువారం సందర్శించింది. చెరువు చుట్టూ తిరుగుతూ, అభివృద్ధిని దశలవారీ తెలుసుకుంది. ఒకప్పుడు చెత్త, నిర్మాణ వ్యర్థాలతో నిండిన ప్రాంతం చెరువులా రూపాంతరం చెందడాన్నిపాత చిత్రాలను చూసి ఆశ్చర్యపోయింది. చెరువుల పరిరక్షణకు జాతీయ స్థాయిలో బతుకమ్మ కుంట ఒక నమూనా అవుతుందని బృందానికి నాయకత్వం వహించిన కేంద్ర గృహ నిర్మాణం, పట్టన వ్యవహారల మంత్రిత్వ శాఖ అదనపు చీఫ్ టౌన్ ప్లానర్ మోనీస్ ఖాన్ అన్నారు. కబ్జాల చెర నుంచి విముక్తి కల్పించడం, మండు వేసవిలో రెండు మీటర్ల లోతు తవ్వగానే గంగమ్మ తల్లి ఉబికి వచ్చే వీడియోలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. హైడ్రా పనితీరు గురించి వార్తల్లో చదివామని, నేడు క్షేత్రస్థాయిలో తెలుసుకున్నామన్నారు. చెరువు చుట్టూ ఇంకా అభివృద్ధి చేయాల్సిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. చెరువు అభివృద్ధితో ఇక్కడి ప్రాంతం సుందరంగా తయారవ్వడమే కాకుండా, ఇక్కడ భూముల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని అన్నారు.

**వరద నీరు వచ్చేలా ఎలా..?**

చెరువుకు ఆనుకుని సాగే మురుగు కాలువలోంచి వరద నీరు మాత్రమే వచ్చేలా ఇన్‌లెట్‌ను నిర్మించడాన్ని చూసి కేంద్ర గృహనిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి బృందం ముచ్చట పడింది. ఇటీవల కురిసిన వర్షాల సమయంలో వరద నీరు ఎలా వచ్చి చేరిందో వీడియాల ద్వారా హైడ్రా అధికారులు కేంద్ర బృందానికి చూపించారు. ఈ వరద నీరు గతంలో ఎటు వెళ్లేదని, స్థానికులతో కూడా మాట్లాడి ఈ బృందం తెలుసుకుంది. వరద నీరు తమ బస్తీలను, కాలనీలను ముంచెత్తేది, ఈ సారి ఆ వరద చెరువుకు చేరిందని చెప్పడంతో మరింత లోతుగా అధ్యయనం చేయడం ప్రారంభించింది. చెరువు ఔట్‌లెట్‌లను కూడా పరిశీలించింది. కేంద్ర గృహనిర్మాణ మంత్రిత్వ శాఖ అసోసియేట్ టౌన్ ప్లానర్ సందీప్ రావుతో పాటు, హైడ్రా అధికారులు మోహన రావు, బాలగోపాల్, చెరువులను అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాట్ ఎండి పి. యూనస్, జిహెచ్‌ఎంసి అదనపు చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, సిటీ ప్లానర్ ఉమాదేవి కేంద్ర బృందంతో ఉన్నారు.

## సిగాచిలో పేలుళ్లపై దర్యాప్తు జాప్యం

### పిల్ ను విచారించిన హైకోర్టు

### కౌంటర్ వేయాలని ప్రభుత్వానికి నోటీసులు



**హైదరాబాద్ :** సంగారెడ్డిలోని సిగాచి కర్మాగారంలో భారీ పేలుడు ఘటనపై దర్యాప్తు జాప్యం అవుతోందనే ప్రజాహిత వ్యాజ్యంపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు గురువారం ఆదేశించింది. కర్మాగారంలో భద్రతా నిబంధనలు పాటించడం లేదని, బాధిత కార్మికుల కుటుంబాలకు పరిహారం చెల్లింపులో తీవ్ర జాప్యం జరిగిందని రిటైర్డ్ శాస్త్రవేత్త కె. బాబు రావు వేసిన పిల్ ను చీఫ్ జస్టిస్ ఏకే. సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ గౌస్ డివిజన్ బెంచ్ విచారించింది.

ప్రమాదఘట్టంలో మరణించిన కార్మికులు అందరూ శాశ్వత ఉద్యోగులు కాదని, ఎక్కువగా కాంట్రాక్ట్, వలస కార్మికులని పిటిషనర్ అడ్వకేట్ చెప్పారు. కార్మికులు అందరికీ పరిహారం చెల్లించాలని కోరారు.

ప్రమాద ఘటనపై ఉన్నత స్థాయి కమిటీ, నిపుణుల కమిటీ నివేదికల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎదురుచూస్తున్నట్లు ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. అయితే, ఈ రెండు కమిటీల ఫలితాలపై దర్యాప్తు ఆధారపడి ఉండబోదని చెప్పారు. ఇప్పటివరకు ఎవరిని అరెస్టు చేయలేదని కూడా వివరించారు.

దీనిపై స్పందించిన హైకోర్టు ఇదేమి రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకమైన వ్యాజ్యంగా భావించవద్దని స్పష్టం చేసింది. మరణించిన కార్మికుల కుటుంబాలకు సహాయం చేయడానికి రాష్ట్రం తన వంతు కృషి చేయాలంది. ఎఫ్ఐఆర్ నమోదు దశ నుంచి, కేసు దర్యాప్తు పురోగతి వరకు వివరాలు అందజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రాణనష్టం ఏ మేరకు జరిగిందీ, కంపెనీని బాధ్యులుగా గుర్తించి నమోదు చేశారా, ప్రమాదం జరిగినప్పుడు ఫ్యాక్టరీలో ఉన్న కార్మికుల సంఖ్య ఎంత, ఎంతమంది మరణించారు, బాధిత కుటుంబాలకు ఏ మేరకు సాయం అందించారు, కార్మికులకు చెల్లించిన పరిహారం వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 27కి వాయిదా వేసింది.

## ఏడుగురూ నిర్దోషులే

(మొదటి పేజీ తరువాయి)

నిర్దోషులుగా పేర్కొంది. జాతీయ దర్యాప్తు సంస్థ కేసులను విచారించడానికి నియమించబడిన స్పెషల్ జడ్జి ఏకె.లహోటి ప్రాసిక్యూషన్ కేసులో, దర్యాప్తులో అనేక లోపాలను ఎత్తిచూపారు. నిందితులు 'బెనిఫిట్ ఆఫ్ డౌట్'కు అర్హులని ప్రత్యేక కోర్టు చెప్పింది. 2008 సెప్టెంబర్ 29న ముంబయ్ నుండి 200కి.మీ దూరంలో ఉన్న మాలేగావ్ పట్టణంలోని ఒక మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు అమర్చిన పేలుడు పరికరం పేలి ఆరుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు. 101మంది క్షతగాత్రులు అయ్యారు. ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్‌తోపాటు మేజర్ రమేష్ ఉపాధ్యాయ్ (రిటైర్డు), అజయ్ రాహిర్‌కర్, సుధాకర్ ద్వివేదీ, సుధాకర్ చతుర్వేదీ, సమీర్ కులకర్ణి ఈ కేసులో నిందితులుగా అభియోగాలు ఎదుర్కొన్నారు. ఈ ఏడుగురు నిందితులను కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన తర్వాత వారి ముఖాలలో చిరునవ్వులు చిగురిస్తూ కనిపించారు. వారు జడ్జికి, న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. తీర్పును చదువుతున్నప్పుడు కోర్టు 'సహేతుకమైన సందేహానికి మించి కేసును నిరూపించడానికి బలమైన, విశ్వసనీయమైన ఆధారాలు లేవని పేర్కొంది. 'నిజమైన రుజువు స్థానంలో అనుమానం ఉండకూడదు'అని కోర్టు వ్యాఖ్యానించింది.'ఎటువంటి ఆధారాలు లేనప్పుడు నిందితులు సందేహం యొక్క ప్రయోజనానికి అర్హులు' అని న్యాయస్థానం స్పష్టంచేసింది. తీర్పు ప్రకటించే ముందు ఏడుగురు నిందితులు అందరూ బెయిల్‌పై బయటకు వచ్చి, దక్షిణ ముంబయిలోని స్పెషల్ కోర్టుకు భారీ భద్రతతో వచ్చారు. నిందితులు ఉగ్రవాద చర్యలకు పాల్పడ్డారంటూ 'ఉపా' (చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక) చట్టం, ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), ఆయుధాల చట్టం కింద అభియోగాలు మోపారు.అయితే ఈ కేసుకు 'ఉపా' చట్టం వర్తించదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ పేలుడుకు వినియోగించిన మోటార్ బైక్ మాజీ ఎంపి ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ పేరు మీద రిజిస్టర్ అయిందన్న ప్రాసిక్యూషన్ వాదనలకు తగిన సాక్ష్యాధారాలు లేవని, బైక్‌కు అమర్చిన బాంబు వల్లే పేలుడు సంభవించిదనడానికి కూడా ఆధారాలు లేవని ఎన్ఐఏ కోర్టు తేల్చిచెప్పింది. 2018లో ప్రారంభమైన ట్రయల్ ఈ ఏడాది ఏప్రిల్ 19న ముగిసింది. ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను జాతీయ దర్యాప్తు సంస్థ స్వీకరించింది. ట్రయల్ సమయంలో ప్రాసిక్యూషన్ 323మంది సాక్ష్యాలను ప్రవేశపెట్టగా, వారిలో 37మంది ప్రతికూలంగా మారారు.

## ప్రభుత్వం సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుత విధానాల ప్రకారం, పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వహిస్తున్న గ్రామం నుంచే మొబైల్ ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయాలి. కానీ, కొందరు కార్యదర్శులు ఇతరుల సహాయంతో, లేదా తమ మొబైల్ ఫోన్లు మల్టీ పర్పస్ వర్కర్లకు ఇచ్చి, తాము లేకుండానే యాప్ ద్వారా హాజరు నమోదుచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఏకంగా తమ పాస్‌పోర్ట్ ఫోటోలను వాడి హాజరు నమోదు చేసిన ఉదంతాలూ ఇటీవల వెలుగుచూశాయి. కొన్నిచోట్ల ఖాళీ కుర్చీలను ఫోటోలు తీసి అటెండెన్స్ యాప్‌లో అప్‌లోడ్ చేసినట్టు తెలిసింది. జిల్లాల వారీగా పదుల సంఖ్యలో ఇలాంటి ఫేక్ హాజరు కేసులు వెలుగుచూస్తున్నాయి. విధులకు హాజరుకాకుండా ఫేక్ హాజరు వేయడం ద్వారా మొత్తం వ్యవస్థ పట్ల అపవాదులు పడుతున్నదని పంచాయతీ కార్యదర్శుల సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఫేక్ అటెండెన్స్ తో నెట్టుకొస్తున్న పంచాయతీ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఇటీవల పంచాయతీరాజ్ శాఖను కూడా కోరినట్టు సమాచారం. దీనిపై వెంటనే స్పందించిన అధికారులు, సంబంధిత జిల్లాల డిపిఓలకు ఆ ఉద్యోగులపై సస్పెన్షన్ విధించాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్లకు నివేదికలు పంపించి తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు. ఫేక్ అటెండెన్స్ చేసిన పంచాయతీ కార్యదర్శులు, పర్యవేక్షించకుండా వదిలేస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జి.సృజన డిపిఓలను ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ఫేక్ అటెండెన్స్‌తో ఉద్యోగాలను నెట్టుకొస్తున్న పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు పడే అవకాశాలు ఉన్నాయని అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది.

## చమురు విక్రయాలు

(మొదటి పేజీ తరువాయి)

వాణిజ్య ఒప్పంద ఖరారు ప్రకటన వెలువడింది.

''ఇప్పుడే మా రెండు దేశాలమధ్యా వాణిజ్య ఒప్పందం పూర్తయింది, పాకిస్థాన్‌లో మూడు సామూహిక చమురు నిల్వలక్షేత్రాలను అభివృద్ధి చేసేందుకు రెండు దేశాలు రాబోయేకాలంలో రెండు దేశాలూ కలిసి కృషి చేస్తాయి, ఈ దిశగా ఒక మంచి చమురు కంపెనీని ఎంచుకునే ప్రక్రియ ప్రారంభించాం, అమెరికా—పాకిస్థాన్ రెండు దేశాలూ ఈ భాగస్వామ్య వ్యాపారానికి నాయకత్వం వహిస్తాయి, ఎవరికి తెలుసుగనుక...భవిష్యత్‌లో ఏదోఒకరోజున భారతదేశం కూడా పాకిస్థాన్ నుండి చమురు కొనుగోలు చేసే పరిస్థితులు రావొచ్చు'' అని సోషల్ మీడియాలో ఆయన పేర్కొన్నారు. తమ తీర ప్రాంతంలో భారీ ఎత్తున సామూహిక చమురు నిల్వలు ఉన్నాయని దీర్ఘకాలంగా పాకిస్థాన్ చెబుతూ వస్తున్నది. కానీ ఇంతవరకూ ఈ చమురు నిల్వలను వెలికి తీసేందుకు ఎలాంటి ప్రయత్నాలూ జరగలేదు. ఈ నిల్వలను వెలికితీసేందుకు పెట్టుబడులను ఆకర్షించేందుకు పాకిస్థాన్ అనేక ప్రయత్నాలు చేస్తున్నది. ఈ దశలో ట్రంప్ వాణిజ్య ప్రకటన వెలువడింది. ప్రస్తుతం మధ్యప్రాచ్యం (మిడిల్ ఈస్ట్) నుండి పాకిస్థాన్ భారీగా చమురు దిగుమతి చేసుకుంటున్నది.కాగా పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ సోషల్ మీడియాలో గురువారంనాడు ఒక ప్రకటన చేస్తూ, అమెరికాతో చారిత్రక వాణిజ్యం ఒప్పందం కుదిరిందని చెబుతూ ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. రెండు దేశాలమధ్యా వాణిజ్యసహకారం రాబోయే రోజుల్లో మరింతగా వృద్ధి చెందాలన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పాకిస్థాన్—అమెరికా మధ్య చరిత్రాత్మకమైన ఒప్పందం కుదరడంతో ట్రంప్ గొప్ప పాత్ర నిర్వహించారని ఆయన ప్రశంసించారు. రెండు దేశాలమధ్యా బుధవారం రాత్రి ఒప్పందం విజయవంతంగా పూర్తయిందన్నారు. పాకిస్థాన్ ఆర్థికమంత్రి మహ్మద్ ఔరంగ్‌జేబ్, అమెరికా వాణిజ్యశాఖామంత్రి హోవార్డ్ లుట్నిక్, అమెరికా వాణిజ్య ప్రతినిధి రాయబారి జమైసన్ గ్రీర్‌లమధ్య బుధవారం రాత్రి వాషింగ్టన్ డి సిలో ఈ వాణిజ్య ఒప్పందం జరిగిందని పాకిస్థాన్ ప్రభుత్వ రేడియో ప్రకటించింది. ద్వైపాక్షిక వాణిజ్యం మరింత పెరగడంతో పాటు మార్కెట్‌లు కూడా అందుబాటులోకి వస్తాయని, పెట్టుబడులు భారీగా తరలిరావడానికి అవకాశాలు మెరుగుపడతాయని, రెండు దేశాలమధ్యా సహకారం విస్తరిస్తుందని పాకిస్థాన్ రేడియో ప్రకటించింది.

ఇటీవలికాలంలో భారత ఉపఖండంలో పాకిస్థాన్‌కు ట్రంప్ చాలా ఎక్కువ ప్రోత్సాహం ఇచ్చే అనేక పరిణామాలు సంభవించాయి. అదే సమయంలో భారత్‌ను మిత్రదేశంగా చెబుతూనే అవమానకరమైన ప్రకటనలు ట్రంప్ చేస్తున్నారు. భారత్‌పై 25 శాతం భారీ సుంకాలు విధించడం, రష్యాతో భారత్ సరుకుమార్పిడి వాణిజ్యాన్ని తప్పుపట్టడం, పాకిస్థాన్ నుండి ఏదో ఒకరోజు భారత్ చమురు కొనుగోలు చేయాల్సి వస్తుందని గడచిన 24 గంటల్లో ట్రంప్ చేసిన ప్రకటనలు భారత్‌కు అవమానకరంగా మారాయి. పహల్గామ్ దాడి వెనుక పాకిస్థాన్ ప్రత్యక్ష హస్తం ఉందని, అందులో ఆ దేశ సైనికదళాల ప్రధానాధిపతి ఆసిఫ్ మునీర్ హస్తం కూడా ఉందన్న విషయాన్ని భారత వర్గాలు అమెరికాకు తెలియజేసినప్పటికీ మునీర్‌కు వాషింగ్టన్ వైట్ హౌస్‌లో రెడ్‌కార్పెట్ పరిచి ట్రంప్ విందు ఆతిథ్యం ఇచ్చారు. భారత్—పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని విరమింపజేయడంలో కీలకపాత్ర వహించినందుకు మునీర్‌ను ప్రశంసించారు. స్వదేశంలో మునీర్‌ను దేశాధ్యక్షుణ్ని చేసే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com